సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 265

శనివారం 16-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



36 నెలలు EMI
₹1 డౌన్ పేమెంట్
ఇప్పుడే కొనండి,
మీ 1వ ఇఎంఐ మరుసటి సంవత్సరం
2024 ఫిబ్రవరి తరువాత
ప్రారంభమవుతుంది
36 నెలల వరకు ఇఎంఐ ఆప్షన్లు కలవు
(కేవలం బాంటియాలోనే)
క్రిస్మస్ అండ్ నూతన సంవత్సర
అమ్మకం
ఫ్లాట్ 50% off
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
ఐకాన్: 2 డోర్
MRP ₹ 39,799
₹ 10,999
PER DAY EMI ₹ 12
ఐకాన్: 3 డోర్
MRP ₹ 45,499 ₹ 15,999
ఐకాన్: 4 డోర్
MRP ₹ 58,999 ₹ 21,999
థాయిలాండ్ ప్రీమియం క్వాలిటీ రిక్లైనర్ కార్నర్ సోఫా
2 రిక్లైనర్స్ మరియు 2 కప్ హోల్డర్స్‌తో
MRP ₹ 2,09,499 ₹ 59,999 PER DAY EMI ₹ 65
రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1 (2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + రిక్లైనర్స్‌తో 2 సీటర్ + రిక్లైనర్‌తో 1 సీటర్)
MRP ₹ 2,04,499 ₹ 89,999 PER DAY EMI ₹ 97
కార్పెట్ ఉచితం
అన్ని మోటరైజ్డ్ : 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 2 సీటర్ + 1 ఎలక్ట్రిక్ రిక్లైనర్‌తో 1 సీటర్
ఉచిత యుఎస్‌బి ఛార్జర్లు + ఉచిత కన్సోల్ టేబుల్
MRP ₹ 2,91,499 ₹ 99,999 PER DAY EMI ₹ 108
ఆఫర్ కొన్ని పీసులు మాత్రమే ఉన్నాయి
ఎల్ టైప్ సోఫా సెట్ + కప్ హోల్డర్ ఉచితం + సెంటర్ టేబుల్ ఉచితం స్టోరేజ్‌తో
MRP ₹ 1,49,499 ₹ 49,999 PER DAY EMI ₹ 54
లండన్ ప్రీమియం ఫ్యాబ్రిక్ సోఫా సెట్ 3+2+1
LOWEST PRICE
MRP ₹ 83,499 ₹ 59,999 PER DAY EMI ₹ 65
ఎల్ టైప్ సోఫా సెట్ + రూ. 7000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
ఉచితం
MRP ₹ 52,999 ₹ 26,999
PER DAY EMI ₹ 29
సోఫా సెట్ : 3+2+1+ డివైడర్ + రూ. 7,000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
MRP ₹ 63,999
₹ 32,999 PER DAY EMI ₹ 36
ఉచితం
ప్రీమియం క్వాలిటీ ఫ్యాబ్రిక్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1 MRP ₹ 1,64,999
2 రిక్లైనర్స్‌తో 3 సీటర్, 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ మరియు రిక్లైనర్‌తో 1 సీటర్
₹ 79,999 PER DAY EMI ₹ 87
బెడ్‌రూం సెట్ :
కింగ్‌సైజ్ బెడ్
+ 2 బెడ్ సైడ్ టేబుల్స్
+ 6 డోర్ వార్డ్‌రోబ్
+ 2 డ్రెస్సింగ్ మిర్రర్స్
రూ. 50,000/- విలువ గల
2 సీటర్ రిక్లైనర్ ఉచితం
MRP ₹ 2,14,999
₹ 79,999
PER DAY EMI ₹ 86
రూ. 50,000 విలువ గల 2 సీటర్ రిక్లైనర్ ఉచితం
సింగపూర్ ప్రీమియం క్వాలిటీ బెడ్ హైడ్రాలిక్ స్టోరేజ్‌తో
MRP ₹ 63,999
₹ 19,999
PER DAY EMI ₹ 43
ప్రీమియం క్వాలిటీ బెడ్ రూం సెట్ : 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో హైడ్రాలిక్ బెడ్ + స్టూల్‌తో డ్రెస్సింగ్ టేబుల్ + 3 డోర్ వార్డ్‌రోబ్
MRP ₹ 2,16,999
₹ 89,999 PER DAY EMI ₹ 97
బాటమ్ డ్రా స్టోరేజ్‌తో బెడ్
ఉచితం రూ. 9,000 విలువ గల డ్రెస్సింగ్ మిర్రర్
కింగ్ సైజ్
MRP ₹ 43,999
₹ 20,999
క్వీన్ సైజ్
MRP ₹ 42,499 ₹ 19,999 PER DAY EMI ₹ 22
బెండ్ గ్లాస్ డైనింగ్ టేబుల్ 4 కుర్చీలతో
MRP ₹ 23,999
₹ 9,999
PER DAY EMI ₹ 11
లగ్జరీ ఇటాలియన్ మార్బుల్ డైనింగ్ టేబుల్ (సైజు 6X3 అడుగులు)
MRP ₹ 32,999
₹ 29,999
PER DAY EMI ₹ 32
ప్రీమియం ఉడెన్ డైనింగ్ టేబుల్
4 కుర్చీలతో
MRP ₹ 38,999
₹ 15,999
PER DAY EMI ₹ 17
6 కుర్చీలతో
MRP ₹ 33,999
₹ 21,999
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్
4 కుర్చీలతో
MRP ₹ 43,999
₹ 14,999
PER DAY EMI ₹ 16
6 కుర్చీలతో MRP ₹ 56,999 ₹ 19,999 PER DAY EMI ₹ 22
సింగిల్ బెడ్
MRP ₹ 13,499
₹ 5,999
PER DAY EMI ₹ 6
ఫ్రాన్స్ ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
Credit Card EMI ₹ 146 (24 months)
MRP ₹ 7,499 ₹ 2,999
ఎక్స్ఛేంజ్ 20% వరకు తగ్గింపు ఇప్పుడే బుక్ చేయండి - అదే రోజు డెలివరీ తీసుకోండి!
www.bantia.in
ఉ. 10 గం.ల లోపు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయండి, అదనంగా 5% తగ్గింపు పొందండి కూపన్‌కోడ్ : BantiaDiwali ఉపయోగించండి www.bantia.in
మ. 1 గం.లోపు షాపింగ్ చేయండి
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
✆ 79950 00930 / 040-2784 1562 / 79933 33351 / 63014 32711
సికింద్రాబాద్ | ఎ.ఎస్.రావు నగర్ | నాగోల్ | హైటెక్ సిటీ | కొంపల్లి | బోడుప్పల్
దిల్‌సుఖ్‌నగర్ | కర్మన్‌ఘాట్ | కూకట్‌పల్లి | వరంగల్ | అత్తాపూర్ | సిద్దిపేట్ | జగిత్యాల్ |
త్వరలో ప్రారంభం విజయవాడ & చందానగర్‌లలో


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 265

శనివారం 16-12-2023



71 వేల శిఖరంపై సెన్సెక్స్

21,450 స్థాయి పైకి నిఫ్టీ
రెండో రోజూ బుల్ రికార్డుల్ -15లో



దీప్తి మాయాజాలం

5 వికెట్లు తీసిన భారత బౌలర్.
ఇంగ్లండ్‌తో టెస్టులో భారత్ పైచేయి -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రాజస్తాన్ సీఎం ప్రమాణం..

రాజస్తాన్ నూతన ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ ప్రమాణం చేశారు. ఆపై పదవీబాధ్యతలు చేపట్టారు.
- వివరాలు 6లో



వీసా లేకున్నా ఇరాన్‌కు..

భారత్ సహా 33 దేశాల వారికి వీసా లేని ప్రయాణాలకు అనుమతివ్వనున్నట్లు ఇరాన్ ప్రకటించింది.
- వివరాలు 6లో



ఎమ్మెల్యేకి 25 ఏళ్ల జైలుశిక్ష

బాలికపై రేప్ కేసులో యూపీ బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌కు కోర్టు 25 ఏళ్ల జైలుశిక్ష విధించింది.
- వివరాలు 6లో



మహిళా జడ్జికి లైంగిక వేధింపులు

తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నారని. అనుమతిస్తే చనిపోతానంటూ ఓ మహిళా జడ్జి సీజేఐకి లేఖ రాయడం కలకలం రేపింది.
- వివరాలు 6లో

సర్వజన రంజక పాలన

ఆరు గ్యారంటీల సాక్షిగా రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వర్ధిల్లుతుంది

అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశిస్తూ ప్రసంగంలో గవర్నర్ తమిళిసై

- గత ప్రభుత్వ నిర్బంధ పాలనకు జనం స్వస్తి పలికారు
- త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం
- హామీలన్నీ 100 రోజుల్లో అమలు చేసేలా కార్యాచరణ తీసుకుంటాం
- కాళేశ్వరం అవినీతిని ఉపేక్షించం.. డ్రగ్స్ మాఫియాను వదిలిపెట్టబోం
- అభివృద్ధి విషయంలో ప్రాంతాల మధ్య వివక్ష ఉండదని వెల్లడి



శుక్రవారం అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల సాక్షిగా తెలంగాణలో ఇందిరమ్మ పాలన వర్ధిల్లుతుందని కాంగ్రెస్ సర్కారు తరఫున గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి.. హామీలకు చట్టబద్ధత కల్పించే ఫైలుపై తొలి సంతకం చేయటం ప్రభుత్వ సంకల్పాన్ని తెలుపుతోందని చెప్పారు. పదేళ్ల నిర్బంధ పాలన నుంచి విముక్తి కావాలని, తమ బతుకుల్లో గొప్ప మార్పు రావాలని ప్రజలు ఇటీవలి ఎన్నికల్లో సుస్పష్టమైన తీర్పు ఇచ్చారని.. వారి విజ్ఞతను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. పాలకులకు, ప్రజలకు మధ్య ఉన్న ఇనుప కంచెలు తొలగిపోయాయని.. అద్దు గోడలు, అద్దాల మేడలు పటాపంచలై ప్రజా ప్రభుత్వ ప్రస్థానం మొదలైందని చెప్పేందుకు గర్విస్తున్నానని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఉదయం అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశిస్తూ గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. అనుభవం, యువ రక్తం మేళవింపుతో కొత్త ప్రభుత్వం ఏర్పాటైందని.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందన్న నమ్మకం ఉందని తమిళిసై ఆకాంక్షించారు. గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

''ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని మాట ఇచ్చాం. ప్రజా సంక్షేమం కోసం మిగతా 2వ పేజీలో ▶



వెంటనే పోలీసు ఉద్యోగాల భర్తీ..

నియామకాలకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం

- పలు అంశాలపై ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి సమీక్ష
- పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక స్కూళ్లు
- ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన నళినికి ఉద్యోగం ఇవ్వండి

- 10లో

పట్టణాలు, గ్రామస్థాయిలో ప్రజావాణి 5లో

న్యూస్‌రీల్

కేసీఆర్ డిశ్చార్జి..



మాజీ సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. తుంటి ఎముక విరగడంతో ఆయనకు వారం క్రితం సర్జరీ జరిగింది. కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేసి బంజారాహిల్స్ నందినగర్‌లోని ఆయన నివాసానికి తీసుకెళ్లారు. - 2లో

ప్రభుత్వ విప్‌లుగా నలుగురు



అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), ఆది శ్రీనివాస్ (వేములవాడ), జాటోతు రాంచందర్ నాయక్ (డోర్నకల్), బీర్ల అయిలయ్య (ఆలేరు) నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. - 2లో

మెగా డీఎస్సీనేనా?



- గవర్నర్ ప్రసంగంతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఆశలు
- రాష్ట్రంలో టెట్ అర్హత ఉన్నవారు 4 లక్షల మందిపైనే..
- ఉపాధ్యాయ ఖాళీలు 22 వేల వరకు ఉన్నా 18 వేల ఖాళీలకే లెక్కచెప్పిన విద్యాశాఖ
- హేతుబద్ధీకరణ చేపట్టే అవకాశం.. ఆగిపోయిన డీఎస్సీ సంగతేంటి?
- విద్యాశాఖలో పదోన్నతులు చేపడితేనే స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు తెలిసే వీలు

- వివరాలు 3లో

పట్టువీడని విపక్షాలు..



- పార్లమెంట్‌లో భద్రతా లోపంపై రెండో రోజూ ఆందోళన
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్.. భద్రతా లోపానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలంటూ నిరసన
- లోక్‌సభ, రాజ్యసభలో పూర్తిగా స్తంభించిన కార్యకలాపాలు
- ఉభయసభలు సోమవారానికి వాయిదా

- వివరాలు 6లో

కాటేసిన ఆన్‌లైన్ ఆట..



కుటుంబంతో నరేశ్(ఫైల్)

- పిస్టల్‌తో భార్య, పిల్లలను చంపి, తానూ కాల్చుకుని కలెక్టర్ గన్‌మన్ ఆత్మహత్య
- ఆన్‌లైన్ గేమ్, ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసిన కానిస్టేబుల్
- కలెక్టర్ సెలవుపై వెళ్లడంతో ఇంటికి వచ్చి ఈ ఘాతుకం
- సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం రాముని పట్ల గ్రామంలో విషాదం

- వివరాలు 5లో

క్లుప్తంగా...

ప్రజలు కోరుకున్న విధంగా పాలన సాగుతోంది

మాజీ ఎంపీ మల్లురవి



సాక్షి, హైదరాబాద్: ప్రజలు కోరుకున్న విధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని, ప్రజా పాలన ఎలా ఉండాలో, ప్రజలేమి కోరుకుంటున్నారో వారం రోజుల్లోనే సీఎం రేవంత్ చేసి చూపించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి వ్యాఖ్యానించారు. నిర్బంధాల ఇనుప కంచెలను తొలగించి ప్రజావాణిని ప్రారంభించి పాలకులంటే సేవకులని, ప్రజల మధ్యనే ఉండాలని రేవంత్‌రెడ్డి నిరూపించారని శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. మహాలక్ష్మి కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని 10 లక్షల పరిధి వరకు పెంపు, ఫార్మాసిటీ రద్దు లాంటి నిర్ణయాలతో ప్రజాభీష్టాలను నెరవేర్చే దిశలో రేవంత్ పాలిస్తున్నారని మల్లురవి చెప్పారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో చదివినట్లు ఉంది: కడియం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగంలో కొత్తదనం ఏమీలేదని, కాంగ్రెస్ మేనిఫెస్టో చదివినట్లు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, అరెకపూడి గాంధీ, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, శంభీపూర్ రాజులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ అబద్ధాలు చెప్పడం దురదృష్టకరమని, నిర్బంధం నుంచి తెలంగాణ విముక్తి అయిందని చెప్పడం గవర్నర్ స్థాయికి తగదన్నారు. 2014లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయిందని, ఇప్పుడు కావడమేమిటని ప్రశ్నించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, ఐటీలో ఎంతో ప్రగతిని సాధించిందని, వీటి గురించి గవర్నర్ చెప్పడం మరిచిపోయారన్నారు. పదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని విస్మరించారని, ప్రస్తుత అభివృద్ధికి ఎంచుకున్న మార్గం ఏమిటో చెప్పలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో లభించిన నీతి ఆయోగ్ ప్రశంసలు, కేంద్ర ప్రభుత్వ అవార్డులనూ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో దళితబంధు ప్రస్తావన లేదని, పంటలకు బోనస్ గురించి మాట్లాడలేదని కడియం అన్నారు.

గవర్నర్ ప్రసంగమా? కాంగ్రెస్ ఎన్నికల ప్రచారమా?

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన ప్రసంగం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం మాదిరిగా ఉందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. అప్పుల పేరు చెప్పి కాంగ్రెస్ బాధ్యతలనుంచి తప్పించుకునే యత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రం తిరోగమనంలో ఉన్నట్లు గవర్నర్ పేర్కొనడం అన్యాయమని, మరి అదే నిజమైతే కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నీతి ఆయోగ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఇచ్చిన అవార్డులు, గుర్తింపులు దాచేస్తే దాగని సత్యాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో పండుతున్న పంటలు, గ్రామాలలో స్వచ్ఛత, పట్టణాల సుందరీకరణ, 24 గంటల కరెంటు, ఐటీ, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే కంటే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై శ్రద్ధపెడితే మంచిదని హితవు పలికారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు లోబడి అత్యంత తక్కువగా రుణాలు తీసుకున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రాన్ని బాగు చేయకున్నా పర్వాలేదని, నష్టం చేయకుంటే చాలని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇదం జగత్



ఐడియా సార్! మీరు బర్రెలన్నగా పేరు మార్చుకుంటే?

సర్వజన రంజక పాలన



అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్ తమిళిసైని తోడ్కొని వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

▶ మొదటి పేజీ తరువాయి

అరు గ్యారంటీలు ప్రకటించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి హామీలకు చట్టబద్ధత కల్పించే ఫైలుపై ముఖ్యమంత్రి తొలి సంతకం చేయటం ప్రభుత్వ సంకల్పాన్ని తెలుపుతోంది. ఇది ప్రజాపాలన. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అందుబాటులో ఉండే పాలన తెలంగాణలో మొదలైందనడానికి నిదర్శనంగా ప్రారంభమైనదే ప్రజావాణి. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించే మహాలక్ష్మి, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం పొందేలా ఆరోగ్యశ్రీ పథకంలో మార్పులు.. ఈ రెండు గ్యారంటీల అమలు ప్రారంభమైంది. మొత్తం ఆరు గ్యారంటీలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూతలను వచ్చే 100 రోజుల్లో అమలు చేసేలా కార్యాచరణ తీసుకుంటాం. రైతుల కోసం ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్, హైదరాబాద్‌లో ప్రకటించిన యువ డిక్లరేషన్, చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్.. అన్నీ అమలు చేస్తాం. సాధ్యమైనంత త్వరలో అమరవీరుల కుటుంబాలను గుర్తించి.. 250 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని, గౌరవ భృతిని అందజేస్తాం. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన, నిరంతర విద్యుత్ ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి పంటకు మద్దతు ధర ఇస్తాం. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుంది.

ఆదిలాబాద్‌కు సాగునీరు ఇస్తాం..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నాణ్యతలోపం, అవినీతి, అవకతవకలపై విచారణ దిశగా ప్రభుత్వ కార్యాచరణ ఉంటుంది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేసి ఎగువన ఆదిలాబాద్, ఇతర ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం దిశగా సాగుతాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధనకు కట్టుబడి ఉన్నాం. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. దానికి జాతీయ హోదా సాధించాలన్న సంకల్పంతో సాగుతాం.

మాఫియాపై ఉక్కుపాదం

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల మాఫియాను నిర్మూలించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. డ్రగ్స్ విషయంలో దోషులు ఎంతటివారైనా వదిలేది లేదు. ఐటీ విషయంలో మరింత వేగంగా పురోగతి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. హైదరాబాద్ నగరాన్ని అన్నిదిశలా అభివృద్ధి చేయాలన్నది ఈ ప్రభుత్వం సంకల్పం. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా భావిస్తూ.. ఔటర్ లోపల ఉన్న నగరం, ఔటర్ రింగురోడ్డు– ప్రతిపాదిత రీజనల్ రింగురోడ్డు మధ్య ఉన్న ప్రాంతం, రీజనల్ రింగు రోడ్డు అవల ఉన్న ప్రాంతం.. ఇలా మూడు ప్రాంతాలను నిర్ధారించి వాటికి తగ్గట్టుగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

అప్పుల్లో విద్యుత్ సంస్థలు

గత ప్రభుత్వ నిర్వాకంతో విద్యుత్ సంస్థలు రూ.81,516 కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయి. రూ.50,275 కోట్ల నష్టాల్లో ఉన్నాయి. పౌర సరఫరాల కార్పొరేషన్ రూ.56 వేల కోట్ల అప్పులు, రూ.11 వేల కోట్ల నష్టాల్లో ఉంది. ఆర్థిక క్రమశిక్షణ లేక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైంది. దీన్ని సరిదిద్ది గాడిలో పెట్టాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. శాఖల వారీగా శ్వేతపత్రాలు విడుదల చేసి, వాస్తవాలు ప్రజల ముందు ఉంచుతాం. ప్రజలపై భారం మోపకుండానే ఆర్థిక క్రమశిక్షణ తెచ్చి సంక్షేమ పాలన అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

వ్యక్తుల కోసం విధ్వంసమా?

వ్యవస్థలు, సంస్థలు వ్యక్తుల కోసం పనిచేసే పరిస్థితికి దిగజారాయి. ఈ తీరును మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో విలువలు పునరుద్ధరిస్తాం. ప్రతిపక్షాల నుంచి సూచనలు తీసుకుంటాం. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు అభివృద్ధి నిధు లు పొందుతారు. రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యువత, అమరవీరుల కుటుంబాలు ..ఇలా అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యాచరణ ఉంటుంది.. '' అని గవర్నర్ పేర్కొన్నారు.

కాళోజీ, అంబేద్కర్ మాటలను ఉటంకిస్తూ..

''మూడు కోట్ల మేటి ప్రజల గొంతొక్కటి, కోరికొక్కటి, తెలంగాణ వెలసి నిలిచి ఫలించాలె భారతాన..'' అన్న ప్రజాకవి కాళోజీ మాటలను ఉటంకిస్తూ గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. చివరిగా ''ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వ పాలనా రూపం మాత్రమే కాదు.. అది తోటి మానవుల పట్ల గౌరవాదరాలతో కూడిన ఒక వైఖరి..'' అన్న అంబేడ్కర్ మాటలను ప్రస్తావించారు. ప్రముఖ కవి దాశరథి పేర్కొన్న ''ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో.. ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..'' అనే మాటలతో ప్రసంగాన్ని ముగించారు. కాగా ప్రసంగంలో ''అప్పట్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాకారానికి కృషి చేసిన యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కృతజ్ఞతలు'' అని పేర్కొన్నారు.

సంయుక్త భేటీలో బంధుగణం

ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ప్రసంగం సందర్భంగా శుక్రవారం శాసనసభలో ఆసక్తికరమైన దృశ్యం కనిపించింది. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల సంయుక్త భేటీలో భార్యాభర్త, తండ్రీ కొడుకు, అన్నాతమ్ముళ్లు, అన్నా చెల్లి ఇలా దగ్గరి బంధువులు ఒకేచోట కొలువుదీరడం ఆసక్తికరంగా కనిపించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (హుజూర్ నగర్), ఆయన సతీమణి పద్మావతి (కోదాడ), మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ), ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), వీరితోపాటు గడ్డం వినోద్ (బెల్లంపల్లి), ఆయన తమ్ముడు గడ్డం వివేక్ (చెన్నూరు), తండ్రీకుమారుడు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి (ఎమ్మెల్సీ), కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి (నాగర్‌కర్నూలు), అన్నాచెల్లి కేటీఆర్ (సిరిసిల్ల), కల్వకుంట్ల కవిత (ఎమ్మెల్సీ), మామాఅల్లుడు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజిగిరి), బావబావమరిది హరీశ్‌రావు (సిద్దిపేట), కేటీఆర్ (సిరిసిల్ల)లు ఈ భేటీకి హాజరయ్యారు.

త్వరలో మెగా డీఎస్సీ

మెగా డీఎస్సీ నిర్వహణతో వచ్చే 6 నెలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తాం. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న టీఎస్‌పీఎస్సీ వ్యవస్థ ప్రక్షాళన కోసం ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టింది. ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ.లక్ష, స్థలం లేని పేదలకు ఇంటి నిర్మాణానికి ఇంటి స్థలం ఇస్తాం. ధరణి స్థానంలో భూమాత పోర్టల్ ప్రారంభించేలా త్వరలో కార్యాచరణ ప్రారంభమవుతుంది. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేస్తాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంచిన 25 లక్షల ఎకరాల భూమిపై పేదలకు హక్కులు కల్పిస్తాం.

ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

జారిపడి తుంటి ఎముక విరగడంతో సర్జరీ చేసిన వైద్యులు

- ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచన
- బంజారాహిల్స్ నందినగర్‌లోని నివాసానికి చేరుకున్న మాజీ సీఎం

లక్డీకాపూల్ (హైదరాబాద్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ నెల 7వ తేదీన అర్ధరాత్రి ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్ ప్రమాదశాత్తు జారిపడిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో కేసీఆర్ ఎడమ కాలి తుంటి ఎముక విరిగింది. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఉన్న యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు 8న సాయంత్రం ఆయనకు తుంటి ఎముక మార్పిడి సర్జరీ చేశారు. వారం రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్న ఆయనను శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఆస్పత్రి లోపలి నుంచి వీల్‌చైర్‌లో కేసీఆర్‌ను బయటికి తీసుకువచ్చి ప్రత్యేక వాహనంలో బంజారాహిల్స్ నందినగర్‌లో ఉన్న నివాసానికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ వాహనంలో కూర్చుని వెంట వెళ్లారు. ఈ సమయంలో కేసీఆర్‌ను చూసేందుకు ఆస్పత్రి వద్దకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. సర్జరీ అనంతర చికిత్స, ఫిజియోథెరపీ కోసం తరచూ డాక్టర్ల బృందం వచ్చి వెళ్లేందుకు వీలుగా కేసీఆర్ హైదరాబాద్‌లోనే ఉండనున్నారు. కేసీఆర్ పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని వైద్యులు చెప్తున్నారు.



ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు దిష్టి తీస్తున్న దృశ్యం

అసెంబ్లీలో విప్‌లుగా నలుగురి నియామకం

- ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, రాంచందర్ నాయక్, అయిలయ్యలకు అవకాశం
- తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు పదవులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో విప్‌లుగా నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నియమితులయ్యారు. ఈ మేరకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), ఆది శ్రీనివాస్ (వేములవాడ), జాటోతు రాంచందర్ నాయక్ (డోర్నకల్), బీర్ల అయిలయ్య (ఆలేరు)లను విప్‌లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నలుగురూ తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు కావడం గమనార్హం. అసెంబ్లీలో అధికార పక్షానికి దక్కే పదవుల్లో ఇప్పటికే స్పీకర్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎంపిక చేయగా, ఇప్పుడు విప్‌లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నలుగురు నేతలకు అవకాశం కల్పించారు. ఇందులో లక్ష్మణ్ కుమార్ (మాల), రాంచందర్ నాయక్ (లంబాడా), ఆది శ్రీనివాస్ (మున్నూరుకాపు), బీర్ల అయిలయ్య (యాదవ) సామాజిక వర్గానికి చెందిన వారు. గత ప్రభుత్వంలో ఆలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన గొంగిడి సునీత (బీఆర్ఎస్) విప్‌గా పనిచేయగా, ఇప్పుడు కూడా అదే నియోజకవర్గానికి చెందిన అయిలయ్య (కాంగ్రెస్)ను ఆ పదవి వరించింది. కాగా, అసెంబ్లీలో విప్‌లుగా నియమితులైన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను కలసి ధన్యవాదాలు తెలిపారు.

రెండు గదులు కేటాయించండి

స్పీకర్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఇన్నర్‌లాబీలో ఇప్పటికే కేటాయించిన కార్యాలయంతో పాటు, ఆవరణలోనే తమ కోసం విశాలంగా ఉండేలా రెండుగదుల కార్యాలయాన్ని ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బీజేపీ శాసనసభాపక్షం (బీజేఎల్పీ) విజ్ఞప్తి చేసింది. తమ పార్టీ పక్షాన 8 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, నలుగురు ఎంపీలున్నందున సమావేశమయ్యేందుకు, సందర్శకులను కలుసుకునేందుకు వీలుగా రెండుగదులున్న కార్యాలయాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం స్పీకర్‌కు బీజేఎల్పీ పక్షాన ఎమ్మెల్యేలు టి.రాజాసింగ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా వినతిపత్రం సమర్పించారు. తమ విజ్ఞప్తిపై స్పీకర్ సానుకూలంగా స్పందించారని బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. అందుబాటులో ఉన్న గదులు, వీలును బట్టి తప్పకుండా అసెంబ్లీ ఆవరణలోనే కార్యాలయం కేటాయించే విషయాన్ని పరిశీలిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారని తెలిపారు.



స్పీకర్ ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు

- శాసనసభలో సీఎం రేవంత్, మండలిలో డిప్యూటీ సీఎం భట్టి సమాధానం!
- గవర్నర్ ప్రసంగంలో తమపై చేసిన విమర్శలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై శనివారం అసెంబ్లీ, మండలిలో చర్చ జరగనుంది. ఉదయం 10 గంటలకు ఉభయసభలు వేర్వేరుగా సమావేశం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు అసెంబ్లీ కార్యదర్శి బులెటిన్ విడుదల చేశారు.

వాడీవేడి చర్చకు చాన్స్

రాష్ట్ర మూడో శాసనసభ తొలి విడత సమావేశాల్లో.. తొలిసారిగా అధికారపక్షం హోదాలో కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం పాత్రలో బీఆర్ఎస్ తలపడేందుకు సన్నద్ధమయ్యాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు కాంగ్రెస్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ పరస్పరం విమర్శించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంపై శాసనసభలో జరిగే చర్చకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మండలిలో జరిగే చర్చకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చే అవకాశం ఉంది.

'చర్చ'కోసం బీఆర్ఎస్ కసరత్తు: శుక్రవారం గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కేటీఆర్, హరీశ్‌రావులతో కలసి పార్టీ శాసనసభాపక్ష కార్యాలయానికి చేరుకున్నారు. గవర్నర్ ప్రసంగం తీరుతెన్నులు, ఉభయ సభల్లో పార్టీ సభ్యులు వ్యవహరించాల్సిన తీరు, పార్టీ సభ్యులు తమ ప్రసంగాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం శాసనసభ చర్చలో బీఆర్ఎస్ తరఫున కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్.. శాసనమండలిలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్ మాట్లాడనున్నారు. ధన్యవాద తీర్మానం తర్వాత ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడే అవకాశాలు ఉన్నాయి.

హైదరాబాద్‌లో 'గింబల్స్' తయారీ పరిశ్రమ

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఫ్రెంచ్ బృందం



ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో మేరియో సంస్థ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: భారత రక్షణ దళాలకు అవసరమయ్యే ఆధునిక 'గింబల్స్'తయారీ పరిశ్రమను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాల్సిందిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌సీ రోబోటిక్స్ ఫ్రెంచ్ కంపెనీ మేరియోతో కలిసి ఆధునిక గింబల్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఫ్రెంచ్ కంపెనీ మేరియోకు చెందిన అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందం సంస్థ సీఈవో రెమీ ప్లెనెట్ నేతృత్వంలో శుక్రవారం మంత్రిని కలిసి హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఆసక్తిని తెలియజేసింది. హైదరాబాద్‌లో మేరియో కార్యకలాపాలకు ప్రభుత్వపరంగా మద్దతును ఇస్తామని మంత్రి హామీనిచ్చారు. మేరియో ప్రతినిధి బృందం భారత పర్యటనలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ అధికారులతోపాటు ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ సంస్థలతో సమావేశమైంది. శ్రీధర్‌బాబును కలిసిన ప్రతినిధి బృందంలో హెచ్‌సీ రోబోటిక్స్ సీఈవో వెంకట్ చుండి, డైరెక్టర్ డాక్టర్ రాధాకిషోర్ ఉన్నారు.

కుక్కలు కూడా వారి వెంట పడవు

- మా పార్టీ మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: 'వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు.. కుక్కలు కూడా వారి వెంట పడవు'అని శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఉభయసభల సంయుక్త సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై శాసనసభ ఆవరణలో పిచ్చాపాటిగా మాట్లాడారు. 'తొక్కుడు రాజకీయాలతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైంది. అసలు విషయాలు అధిష్టానం వరకు చేరకుండా మధ్యలోనే కొందరు ఆపేశారు. జోకుడు బ్యాచ్‌కు మా పార్టీ అధిష్టానం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. వాస్తవాలు చెప్పేందుకు అధినేత అవకాశం ఇస్తే ఎవరైనా అసలు విషయం చెప్తారు. వాస్తవాలు చెప్పేవారు బయట, జోకుడుగాళ్లు లోపల ఉంటే వాస్తవాలు ఎలా తెలుస్తాయి. పార్టీ గెలుపుపై ఊహాగానాలు ఎక్కువై వాస్తవాలు మరిచిపోయారు. 2014, 2018 ఎన్నికల్లో ఇతర పార్టీల్లో గెలిచిన వారిని బీఆర్ఎస్‌లోకి లాగితే.. వచ్చిన వారు నిజమైన బీఆర్ఎస్ లీడర్లను అణచివేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతీసారి ఇతర పార్టీల్లో గెలిచిన వారిని బీఆర్ఎస్‌లోకి తెచ్చుకుంటే నేతలు గ్రూపులుగా విడిపో యారు. కొన్ని జిల్లాల్లో మా పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల్లో అసహనం పెరిగేలా చేశారు.. దానిని ఎలా మేనేజ్ చేయాలో పార్టీకి ప్రణాళిక లేకపోతే ఎలా గెలుస్తాం. ఆత్మగౌరవం ఎక్కువగా ఉండే వరంగల్ లాంటి జిల్లాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ లాంటి వారికి మంత్రి పదవులు ఇస్తే ఉద్యమకారులు బాధపడ్డారు. తెలంగాణవాదం, ఉద్యమం గురించి తెలియని వారికి మంత్రి పదవులు ఇస్తే ఎలా..పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమిని అక్కడి ఓటర్లు ఎప్పుడో నిర్ణయించారు. ఆయన జనాలకు చక్కిలిగింత పెట్టడం తప్ప ఎవరికీ రూపాయి సాయం చేయరు'అని రవీందర్‌రావు అన్నారు.

ఆ ప్రచారాన్ని నమ్మొద్దు

చిట్‌చాట్ పేరిట తాను అనని మాటలను అన్నట్టుగా ప్రచారం జరుగుతోందని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. తాను వ్యాఖ్యలు చేసినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను ఏదైనా విషయం మాట్లాడాలని అనుకుంటే అధికారికంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి చెప్తానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌పై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఆయన అప్పజెప్పిన అనేక బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చినట్లు పేర్కొన్నారు. చిట్‌చాట్ పేరిట జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తక్కెళ్లపల్లి కోరారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో 5 పామాయిల్ పరిశ్రమలు

ఫైలుపై మంత్రి తుమ్మల తొలి సంతకం

- సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరణ



ఫైలుపై తొలి సంతకం చేస్తున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పామాయిల్ సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని.. ఆయిల్ పామ్ సాగు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతాంగం ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గుచూపేలా అధికార యంత్రాంగం దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మూడు కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొత్తం 5 ఆయిల్ పామ్ పరిశ్రమలు నెలకొల్పే ఫైలుపై తొలి సంతకం చేశారు. రూ. 1,050 కోట్లతో ఈ పరిశ్రమలను స్థాపించనున్నారు. తర్వాత రాష్ట్రంలోని 110 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేలా రూ. 4.07 కోట్లతో సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని తీర్చిదిద్దేందుకు అవసరమైన రెండో ఫైలుపై సంతకం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు తరచూ అవగాహన సదస్సులు నిర్వహించేందుకు వీలుగా రైతు వేదికలను తీర్చిదిద్దుతామన్నారు. సహకార వ్యవస్థలో పారదర్శకమైన పాలన అందించేందుకు వివిధ విభాగాలను పూర్తిగా కంప్యూటరీకరణ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా.. మంత్రి మూడో ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా గద్వాలకు చెందిన పట్టు పరిశ్రమశాఖ అధికారి జగన్నాథ్ కుమారుడు ఆశిష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ నియామక పత్రం అందజేశారు. తర్వాత అధికారులతో తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఏడాదికి ఒకటి చొప్పున పామాయిల్ పరిశ్రమలను ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నెలకొల్పుతామన్నారు. పామాయిల్ సాగు విస్తరణకు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లుల స్థాపన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుతో రైతులకు ఎళ్లవేళలా మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగుతో రైతులకు ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే అంతరపంటలతో అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఆయిల్ ఫెడ్ ఏటా 40 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తుమ్మల తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల నీటిసరఫరాపై పర్యవేక్షణ ఉంచండి

అధికారులకు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. ప్రతి గ్రామానికి రోజువారీ నీటి సరఫరా జరిగేలా చూడాలని శాఖ ఇంజనీర్లను కోరారు. మేడారం జాతరపై త్వరలోనే వివిధ విభాగాలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాలపై చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో శుక్రవారం మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్లు, నదులు తదితర తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాల గురించి ఆ శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ మంత్రికి వివరించారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

చర్ల: మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్‌లోని ఖామ్‌కోదాదర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు చైతూ అలియాస్ మడకం హిద్మా మృతి చెందాడు. ఘటనాస్థలం నుంచి 315 బోర్ రైఫిల్‌ను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బాలాఘాట్‌లోని గర్హి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో 12 మంది మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో శుక్రవారం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుపడిన మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో అప్రమత్తమైన బలగాలు సైతం కాల్పులకు దిగాయి. కాల్పులు ఆగిన అనంతరం గాలించగా ఓ మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. అతడు బీజాపూర్ జిల్లా పమ్మర గ్రామానికి చెందిన చైతు అలియాస్ మడకం హిద్మాగా గుర్తించారు. మృతుడిపై రూ.14 లక్షల రివార్డు ఉన్నట్టు తెలిసింది. కాగా, హిద్మా 2012లో దళంలో చేరి దండకారణ్య మండలం ప్లాటూన్–02లో చురుగ్గా ఉండడంతో 2020లో ఎంఎంసీకి పంపించారు. అక్కడ మలాజ్‌ఖండ్ ప్రాంతంలో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించడంతో ప్రత్యేక కమిటీ కార్యదర్శి దామా అలియాస్ మంగు గార్డ్ టీమ్‌కు కేటాయించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చైతూ అలియాస్ మడకం హిద్మా మృతి చెందగా.. మావోయిస్టు అగ్రనేత, మోస్ట్ వాంటెడ్ మడకం హిద్మాగా ప్రచారం జరగడంతో గందరగోళం నెలకొంది.

క్లుప్తంగా...

హైకోర్టు భవన నిర్మాణానికి దస్తావేజుల పరిశీలన

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో హైకోర్టు భవన నిర్మాణానికి తగు ఏర్పాట్లు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో తహసీల్దార్ స్థల సేకరణ, దస్తావేజుల పరిశీలన ప్రారంభించారు. అధికారులు గతంలో హైకోర్టుకు కేటాయించిన స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు, దస్తావేజులు శుక్రవారం వెలికితీశారు. 2010లో రాజేంద్రనగర్-బుద్వేల్ ప్రాంతంలో హైకోర్టు నిర్మాణానికి స్థలం కేటాయించారు. సర్వేనంబర్ 282 నుంచి 299 వరకు 100 ఎకరాలకు సంబంధించిన మ్యాప్ రూపొందించారు. ప్రేమావతిపేట సర్వేనంబర్ 41 నుంచి 49 వరకు ఉన్న 100 ఎకరాలను గుర్తించి ఆ మ్యాప్ కూడా తయారు చేశారు. ఈ రెండు మ్యాప్‌లను అధికారులకు అందజేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో ఈ భూములను మరో సారి సర్వే చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాన ద్వారం యూనివర్సిటీ పక్క నుంచే వస్తుందని అధికారులు చెబుతున్నారు. గతంలో మానస హిల్స్ నుంచి ప్రధాన ద్వారం ప్రారంభమవుతుందని అధికారులు భావించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో డీకే అరుణ భేటీ

పాలమూరు ఎంపీ టికెట్ కోరుతున్న డీకే



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ శుక్రవారం భేటీ అయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి పోటీకి తనకు అవకాశం కల్పించాలని ఆమె కోరినట్లు తెలిసింది. ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ కోసం అరుణతో పాటు మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, పార్టీనేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి ఇతర నేతలు పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి జితేందర్‌రెడ్డి కుమారుడు పోటీచేసిన నేపథ్యంలో ఈసారి తనకే లోక్‌సభకు అవకాశం కల్పించాలని డీకే అరుణ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై మహబూబ్‌నగర్ నుంచి అరుణ పోటీచేసి పరాజయం పాలయ్యారు. పాలమూరు ఎంపీ టికెట్ కేటాయింపు విషయాన్ని జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటారనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. ఇదిలాఉండగా, అధిష్టానం ఆదేశిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేసినట్టుగా కూడా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

మెగా డీఎస్సీనేనా?

గవర్నర్ ప్రసంగంతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై చిగురిస్తున్న ఆశలు



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో మెగా డీఎస్సీ ప్రస్తావన రావడంతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఆశలు చిగురిస్తున్నాయి. 22 వేల ఖాళీలున్నట్టు విద్యాశాఖ వర్గాలు చెబుతూ వచ్చాయి. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రం అధికారులు 18 వేల పోస్టులే ఉన్నట్టు సర్కారుకు నివేదించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల మందిదాకా ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్క 2017లోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి, 8,792 పోస్టులు భర్తీ చేశారు. అప్పటికే 2.5 లక్షల మంది టెట్‌కు అర్హత సాధించి ఉన్నారు.

2016లో టెట్‌లో ఉత్తీర్ణులు ఇలా...

పేపర్	ఉత్తీర్ణులు
పేపర్–1	48,278
పేపర్–2	63,079
2017లో..	
పేపర్–1	56,708
పేపర్–2 (సైన్స్)	20,233
పేపర్–2(సోషల్)	24,732
2022లో	
పేపర్–1	1,01,922
పేపర్–2	1,04,078

కొత్త నియామకాలపైనే దృష్టి

ఉపాధ్యాయ ఖాళీల్లో కొన్నింటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. స్కూల్ అసిసెంట్లు(ఎస్‌ఏ)గా అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ల ద్వారా 70 శాతం ఖాళీలు భర్తీ చేసి, 30 శాతం స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీ నేరుగా నోటిఫికేషన్ ద్వారా చేయాల్సి ఉంటుంది. కొన్ని స్కూళ్లలో టీచర్ల సంఖ్యకు తగ్గట్టుగా విద్యార్థుల సంఖ్య లేదు. కొన్ని స్కూళ్లల్లో విద్యార్థులున్నా, టీచర్ల సంఖ్య తక్కువగా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని హేతుబద్ధీకరణ చేయాలని విద్యాశాఖ 2016 నుంచి చెబుతూనే ఉంది. ఈ సమస్యల కారణంగానే 2022లో డీఎస్సీ ద్వారా కేవలం 5,089 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పుడు పదోన్నతులు కల్పించి, హేతుబద్ధీకరణ చేపట్టి వాస్తవ ఖాళీలను భర్తీ చేస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదే జరిగితే గత ఏడాది ఆగిపోయిన డీఎస్సీ నోటిఫికేషన్ స్థానంలో కొత్త నియామక ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

అడ్డంకులెన్నో...

ఉపాధ్యాయ నియామకాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా లక్షలాదిమంది కోచింగ్‌ల కోసం హైదరాబాద్ బాట పడుతున్నారు. అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకుంటున్నారు. కొంత మంది ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్నా, వాటిని విడిచిపెట్టి ప్రభుత్వ టీచర్ పోస్టులకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలాంటి వాతావరణమే మళ్లీ కనిపించనుంది. అయితే, విద్యాశాఖలో పదోన్నతులు చేపడితేనే స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు తెలుస్తాయి. టెట్ అర్హత ఉన్నవారికే పదోన్నతులు ఇవ్వాలని కోర్టు తెలిపింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు ముందు దీనిని చేపట్టాల్సి ఉంటుంది. వరుసగా స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలున్నాయి. దీనివల్ల కాలయాపన జరిగే వీలుంది. ఇవేవీ అడ్డంకి కాకుండా నియామకాలు చేపట్టాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

పూర్తిస్థాయి నియామకాలు చేపట్టాలి

విద్యాశాఖలో 22 వేల పోస్టులున్నాయి. లక్షల మంది టెట్ ఉత్తీర్ణులై టీచర్ పోస్టు కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయిలో నియామకాలు చేపడితేనే ఎక్కువ మందికి ప్రయోజనం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయాలి.

– రావుల రామ్మోహన్‌రెడ్డి (డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు)

9 మంది ఐఏఎస్‌లకు పోస్టింగులు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. 2020, 2021 బ్యాచ్‌లకు చెందిన తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చారు. వీరికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన పి.కదిరవన్‌ను భూపాలపల్లి అదనపు కలెక్టర్‌గా నియమించారు. 2021 బ్యాచ్‌కు చెందిన రాధికా గుప్తా(హనుమకొండ), పి.శ్రీజ(ములుగు), ఫైజాన్ అహ్మద్(నిర్మల్), పి.గౌతమి(రాజన్న సిరిసిల్ల), పర్మర్ పింకేశ్‌కుమార్ లలితకుమార్(జనగామ), లెనిన్ వత్సల్ టొప్పో(మహబూబాబాద్), శివేంద్ర ప్రతాప్(మహబూబ్‌నగర్), సంచిత్ గాంగ్వర్(వనపర్తి)లకు ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు)గా పోస్టింగులు ఇచ్చారు.

ఏజీగా వేణుగోపాల్?



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్‌ను అడ్వొకేట్ జనరల్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అధికారికంగా జీవో వెలువడలేదు. ఏజీ పదవి కోసం చాలామంది సీనియర్ల పేర్లు వినిపించినా, అనూహ్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏజీగా పనిచేసిన పి.వేణుగోపాల్ పేరు తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో తొలి అడ్వొకేట్ జనరల్‌గా 2014 జూన్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన 2016, మే వరకు కొనసాగారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం కోరడంతో ఏజీ పదవికి రాజీనామా చేశారు. ఏజీగా వేణుగోపాల్ పేరును ప్రభుత్వం ఖరారు చేసిందంటూ శుక్రవారం రోజంతా హైకోర్టు న్యాయవాదుల మధ్య చర్చ సాగింది.

రైల్ నిలయంలో పెన్షన్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే కేంద్ర కార్యాలయం రైల్ నిలయంలో శుక్రవారం పెన్షన్ అదాలత్ నిర్వహించారు. ఆరు డివిజన్లు, వాటి పరిధుల్లోని వర్క్‌షాపుల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు సంబంధించిన అంశాలపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో హాజరైన రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం అధికారులను సంప్రదించారు. పెన్షన్లకు సంబంధించిన సమస్యలున్నవారు భవిష్యత్తులో నిర్వహించే పెన్షన్ అదాలత్‌కు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'లోక్‌సభ'కు బీజేపీ ఒంటరిగానే..

వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు

- అత్యధిక ఎంపీ సీట్ల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి... రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో తరుణ్‌చుగ్, మురళీధర్‌రావు

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఏ పార్టీతో పొత్తు ఉండదని, బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని కేంద్రమంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి బీజేపీ సమాన దూరం పాటిస్తుందని తేల్చి చెప్పారు. ఈ రెండు పార్టీలను గట్టిగా ఎదుర్కొని, రాష్ట్రంలో అత్యధిక సీట్లలో విజయమే లక్ష్యంగా పార్టీ కేడర్ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్‌లు, లోక్‌సభ ప్రభారీల సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, పి.మురళీధర్‌రావు, బంగారు శృతి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ఇతరనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ, మద్దతు లభిస్తుందని, సర్వే సంస్థల అంచనాలకు కూడా అందని పద్ధతుల్లో అనూహ్య ఫలితాలు వస్తాయని చెప్పారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఇప్పటినుంచే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కిషన్‌రెడ్డి కోరారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక పార్టీ, పార్టీనేతలను లక్ష్యంగా చేసుకొని వివిధ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులపై కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. జిల్లా అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జ్‌లతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయిన సందర్భంగా అభ్యంతరకర లేదా కించపరిచే పోస్టులు పెడితే వేటు తప్పదని హెచ్చరించారు.

విశ్వకర్మ కింద.. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు వెయ్యి మంది..

పీఎం విశ్వకర్మయోజన కింద రాష్ట్రంలో ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి వెయ్యిమంది లబ్ధిదారులను నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విశ్వకర్మయోజనపై జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పదిలక్షల కుటుంబాలు చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి నైపుణ్యాభివృద్ధి, గుర్తింపు, ఆర్థిక ప్రగతి కోసం ఈ యోజనను ప్రధాని మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే.

దక్షిణ డిస్కం సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ బాధ్యతల స్వీకరణ



ముషారఫ్ ఫరూఖీ

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఐఐటీ మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన ఫరూఖీ 2014లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఫరూఖీ గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా, నిర్మల్ జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో డైరెక్టర్‌గా పని చేశారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విభాగాల వారీగా సంస్థ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, కె.రాములు, సీహెచ్ మదన్‌మోహన్, జి.పర్వతం, ఎస్.స్వామిరెడ్డి, జి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, హన్మకొండలో టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కర్నాటి వరుణ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

> అది (పరమాత్మ) నడుస్తుంది. నడవదు కూడా. అది దూరాతిదూరంగా ఉంటుంది. అత్యంత సమీపంగానూ ఉంటుంది. అది ఈ సమస్త జగత్తు లోపల పరిపూర్ణంగా నిండివుంటుంది; అదే సమయంలో ఈ జగత్తుకు వెలుపల కూడా ఉంటుంది.
>
> – ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 16 డిసెంబర్ 2023

‘కీచక న్యాయం’పై కొరడా!

ఎన్ని చట్టాలున్నా, ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నా మహిళలకు వేధింపులు తప్పడం లేదని తరచు రుజువవుతూనే వుంది. ఆఖరికి న్యాయదేవత కొలువుదీరే పవిత్ర స్థలం కూడా అందుకు మినహాయింపు కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని బాందా జిల్లా మహిళా సివిల్ జడ్జి రాసిన బహిరంగ లేఖ స్పష్టం చేస్తోంది. జిల్లా జడ్జి, ఆయన అనుచరుల నుంచి ఆమె ఎదుర్కొంటున్న వేధింపులు ఎలాంటివో, అవి ఎంత ఆత్మ న్యూనతకు లోనయ్యేలా చేశాయో మహిళా జడ్జి వాడిన పదజాలమే పట్టిచూపుతోంది. ‘నన్నొక వ్యర్థపదార్థంగా చూస్తున్నారు. పురుగుకన్నా హీనంగా పరిగణిస్తున్నారు’ అని అన్నారంటే ఆమె వేదనను అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు... ‘గత ఏడాదిన్నరగా నడిచే శవంగా బతుకీడుస్తున్నాను. ఇక జీవరహితమైన ఈ కాయాన్ని కొనసాగించలేను. ఆత్మహత్యకు అనుమతించండి’ అని కూడా ఆమె రాశారు. ‘మీరంతా ఆటబొమ్మగా, ప్రాణరహిత పదార్థంగా మారటం నేర్చుకోండి’ అని మహిళలనుద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. తనను రాత్రిపూట ఒంటరిగా కలవమంటూ వేధిస్తున్నారని మొన్న జూలైలో ఆమె చేసిన ఫిర్యాదుపై హైకోర్టులోని అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారించింది. కానీ కింది ఉద్యోగులు ధైర్యంగా సాక్ష్యం చెప్పాలంటే ఆ జడ్జిని విచారణ సమయంలో బదిలీ చేయాలన్న వినతిని పట్టించుకున్నవారు లేరు. దీనిపై సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేస్తే ఈ దశలో జోక్యం చేసుకోలేమంటూ ధర్మాసనం తోసిపుచ్చటం ఆమె తట్టుకోలేక పోయారు. నిరుడు దేశ వ్యాప్తంగా మహిళలపై 4.45 లక్షల నేరాలు చోటు చేసుకున్నాయని జాతీయ క్రైం రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక చెబుతోంది. లైంగిక నేరాలకు సంబంధించి సగటున ప్రతి 51 నిమిషాలకూ ఒక ఎఫ్ఐఆర్ నమోదవుతున్నదని ఆ నివేదిక వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ 65,473 కేసులతో మొదటి స్థానంలో వుంటే మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ ఆ తర్వాత స్థానాల్లో వున్నాయి. పనిచేసే చోట మహిళలను వేధించటంలో ఢిల్లీ అగ్రస్థానంలో వుంది. నిజానికి వాస్తవ ఘటనలతో పోలిస్తే కేసుల వరకూ వెళ్లే ఉదంతాలు తక్కువనే చెప్పాలి. అందరి దృష్టిలో పడతామని, ఉపాధి కోల్పోతామని, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ప్రతీకారానికి దిగొచ్చని భయపడి చాలామంది ఫిర్యాదు చేయటానికి వెనకాడతారు. ఈ వేధింపుల పర్యవసానంగా చాలామంది మహిళలు ఆత్మాభిమానం దెబ్బతిని, మానసిక క్షోభకు లోనయి వృత్తిపరంగా ఎదగలేని నిస్సహాయస్థితిలో పడుతున్నారు. ఇలాంటి కేసులు తమముందు విచారణకొచ్చినప్పుడు నేరగాళ్లను కఠినంగా శిక్షించి, బాధితులకు ఉపశమనం కలగజేయాల్సిన చోటే... మహిళా న్యాయమూర్తులకు వేధింపులుంటే ఇంతకన్నా ఘోరమైన స్థితి వుంటుందా?

నిజానికి న్యాయవ్యవస్థలో లైంగిక వేధింపులుంటున్నాయని ఆరోపణలు రావటం ఇది మొదటిసారేమీ కాదు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనే ఫిర్యాదులొచ్చిన సందర్భాలున్నాయి. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తరుణ్ గొగోయ్‌పై 2019లో ఒక మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేసినప్పుడు ఆమెను మొదట బదిలీ చేసి,ఆ తర్వాత సర్వీసునుంచి తొలగించి చివరకు చీటింగ్ కేసు కూడా పెట్టారు. గొగోయ్ పదవీ విరమణ చేశాక ఆ మహిళకు తిరిగి ఉద్యోగం లభించింది. జస్టిస్ గొగోయ్‌కి మాత్రం ఏం కాలేదు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జిగా పనిచేసిన మహిళ కూడా ఇలాంటి స్థితినే ఎదుర్కొన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి తనను వేధించిన తీరు గురించి ఆమె ఫిర్యాదు చేశారు. తన గోడు అరణ్యరోదన కావటంతో గత్యంతరం లేక 2014లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన వేధింపులు ఎలావుండేవో సోదాహరణంగా వివరించారు కూడా. ‘నీ పని తీరు చాలా బాగుంది. నీ అందం మరింత బాగుంది’ అనటం, ఒక శుభకార్యంలో నృత్యం చేయాలంటూ భార్యతో ఫోన్ చేయించటం, ‘ఒంటరిగా ఓసారి నా బంగ్లాకు రా’ అని ఫోన్ చేయటం తేలిగ్గా కొట్టిపారేయదగ్గ ఆరోపణలు కాదు. కానీ విషాదమేమంటే ఆ ఫిర్యాదుకు అతీగతీ లేక పోయింది. ఆ న్యాయమూర్తి నిక్షేపంగా తన పదవీకాలం పూర్తిచేసుకున్నారు. ఆయన రిటైర్ కావటంతో తిరిగి ఉద్యోగం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో ఆమె 2018లో పిటిషన్ పెట్టుకున్నారు. చివరకు ఆ మహిళా జడ్జి స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదని సర్వోన్నత న్యాయస్థానం నిర్ధారించుకుని నిరుడు ఉద్యోగంలో చేరడానికి అనుమతించింది.

చదువూ సంస్కారం లేనివాళ్లూ, జులాయిలుగా తిరిగేవాళ్లూ మహిళలపై, బాలికలపై వేధింపులకు దిగుతారనే అపోహ వుంది. కానీ పెద్ద చదువులు చదువుకుని, ఉన్నత పదవులు వెలగబెడుతున్న వారిలో కొందరు ఆ తోవలోనే ఉంటున్నారని అప్పుడప్పుడు వెల్లడవుతూనే వుంది. ఇలాంటి కేసుల్లో అసహాయ మహిళలకు ఆసరాగా నిలవాల్సిన మహిళా న్యాయమూర్తులకు సైతం వేధింపులుంటే ఇక దిక్కెవరు? కాలం మారింది. యువతులు చదువుల్లో ఎంతో ముందుంటున్నారు. ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నారు. వేరే వృత్తి ఉద్యోగాలను కాదనుకుని న్యాయవ్యవస్థ వైపు వచ్చే వారిలో చాలామంది సమాజానికి ఏదో చేద్దామన్న సంకల్పంతో వస్తారు. అలాంటి వారికి సమస్యలుండటం దురదృష్టకరం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆ మహిళా జడ్జి లేఖపై వెనువెంటనే స్పందించటం, అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరటం హర్షించదగ్గ అంశం. గతంలో మాదిరి కాక దోషులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఈ కీచకపర్వం ఆగదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు , మార్గశిర మాసం, **తిథి:** శు.చవితి రా.11.01 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.31 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.18 నుండి 2.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.26 నుండి 7.53 వరకు, **అమృతఘడియలు:** రా.10.21 నుండి 11.52 వరకు

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అవసరమైన సామాజిక కూర్పు

ఇటీవలి ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించిన మూడు రాష్ట్రాలకు కొత్త ముఖ్యమంత్రులే వచ్చారు. ఇదొక కొత్త రాజకీయ సంప్రదాయం కాబట్టి చర్చ కూడా పెద్ద ఎత్తునే జరుగుతోంది. అది రాజకీయ పార్టీలు మంచి చేసినప్పుడు జరగవలసిన చర్చేనా? ఇది ప్రశ్నార్థకమే. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం అంటే, అది ఏ పార్టీ మనస్ఫూర్తిగా, నిజాయితీగా చేసినా స్వాగతించాలి. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కూడా ఈ విషయంలో పట్టింపుగా ఉన్నారు. ఈ ప్రస్తావన ఎందుకంటే, సోషల్ ఇంజినీరింగ్ కోసం ఏ పార్టీ అయినా ప్రయత్నిస్తుంటే ఆ విషయం చెప్పడానికి సందేహించనక్కర లేదు. మనం ఒక పార్టీని అభిమానించడం, ఆ పార్టీ చేపట్టే సోషల్ ఇంజినీరింగ్‌ను సానుకూలంగా గమనించడం, ఈ రెండూ అవసరమే.

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

ఇటీవల గెలిచిన మూడు రాష్ట్రాల్లోనూ మాజీలను కాదని, కొత్తవారిని ముఖ్యమంత్రి స్థానాల్లో కూర్చోబెట్టింది బీజేపీ. మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ స్థానంలో మోహన్ యాదవ్‌కూ, రాజస్థాన్‌లో వసుంధరా రాజేను కాదని మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన భజన్‌లాల్ శర్మకూ, ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు స్పీకర్ స్థానం ఇచ్చి విష్ణుదేవ్ సాయ్‌కీ బీజేపీ అధిష్ఠానం ముఖ్యమంత్రి స్థానాలను అప్పగించింది. ఇలాంటి నిర్ణయం రాజకీయాలకు కొత్త. ఒకే దెబ్బతో నిర్ణయించడం కూడా కొత్తే.

2018 ఎన్నికల తరువాత రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కానీ గతంలో ముఖ్యమంత్రులుగా చేసినవారినే తిరిగి ప్రతిష్ఠించారు. అది సర్వసాధారణ సంప్రదాయమనే అంతా సర్దుకుపోయారు. ఆ మూస ధోరణితో ఇద్దరు యువనేతలకు అవకాశం లేకుండా పోయిందన్న వాస్తవం మరుగున పడింది. కొత్తవారికి అవకాశాల సంగతి ఆ పార్టీలో ప్రశ్నార్థకమైందన్న వాదన కూడా వీగిపోయింది. కానీ ఇప్పుడు ఓడిపోతుందని అంతా అనుకున్న మధ్యప్రదేశ్‌లో ఘన విజయం సాధించి పెట్టిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను వదిలిపెట్టి వేరొకరికి బీజేపీ అధికారం కట్టబెట్టడం అనూహ్యంగానే కనిపిస్తుంది. వసుంధరా రాజే వంటి దిగ్గజాన్ని ముఖ్యమంత్రి పదవికి దూరంగా ఉంచగలగడం కూడా అలాంటిదే. భజన్‌లాల్ శర్మకు ముఖ్యమంత్రిగా అవకాశం రావడం మరీ ఊహకు అందనిదే.

ఈ ముగ్గురికీ ప్రత్యేకతలు ఉన్నాయి. బీజేపీతో, లేదా మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌తో వీరికి విశేషమైన సాన్నిహిత్యం ఉంది. ఎవరూ ఇతర పార్టీల నుంచి దిగుమతి అయినవారు కాదు. అయోధ్య ఉద్యమంతో మమేకమైనవారు భజన్‌లాల్ శర్మ. ఇవన్నీ సాధారణ ప్రజానీకం దృష్టిలో పడని అభ్యర్థుల అర్హతలే అవుతాయి. వీరి పాలనానుభవం, ప్రజాహిత కార్యక్రమాలు, ప్రజల మధ్యన ఉండే తత్త్వం ఇవన్నీ పార్టీ పరిగణనలోకి తీసుకునే అంశాలు అవుతాయి. ఒక నాయకుడిని మూడు లేదా నాలుగు పర్యాయాలు పదవిలో కొనసాగించడం వల్ల, తద్వారా ఎదురయ్యే ప్రభుత్వ వ్యతిరేకత పార్టీ భవిష్యత్తుకు సంబంధించినది. కొత్త నాయకత్వాన్ని నిర్మించే ప్రక్రియ కూడా పార్టీ తాజా నిర్ణయంలో కనిపిస్తోంది. మొత్తంగా పార్టీ ప్రయోజనాల రక్షణ, అభ్యర్థి సామర్థ్యం, గుణగణాలు ఇవన్నీ పార్టీ మనుగడకు పరోక్షంగా దోహదం చేస్తాయి.

దీనితో పాటే పట్టించుకోవలసిన మరొక లోతైన అంశం, పార్టీ అనుసరించిన సోషల్ ఇంజినీరింగ్. దురదృష్టవశాత్తు బీజేపీ అమలు చేయదలిచిన సోషల్ ఇంజినీరింగ్‌కు మీడియా చర్చలు, పత్రికల కాలమ్‌లు తగిన స్థానం ఇస్తున్నాయా? ఇవ్వడం లేదన్నదే సమాధానం. సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి. స్త్రీపురుష సమానత్వం కూడా అందులో భాగం. వీటిని



ఇప్పటికైనా పార్టీలో, ప్రభుత్వంలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నందుకు బీజేపీని మనసారా అభినందించవలసి ఉంటుంది. ఒక్క మహిళకు కూడా స్థానం కల్పించకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వం నడిపిన ముఖ్యమంత్రులు మన కళ్లెదుటే ఉన్నారు. కొన్ని వర్గాలవారు అసలు శాసనసభ ముఖం చూడలేదన్నది ఒక చేదునిజం. వీటిని అధిగమించి తీరాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. అదే సమయంలో అప్పటిదాకా రాజకీయాలలో, పాలనలో తగినన్ని అవకాశాలను పొందిన వారికీ, ఇప్పుడు పొందవలసి ఉన్నవారికీ మధ్య సమతూకం పాటిస్తేనే ఏ పార్టీ అయినా మనుగడ సాగించగలుగుతుందన్నది ఒక వాస్తవం. మొత్తం వ్యవస్థను పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా, ఓటు ద్వారా మార్చదలిచిన ఏ పార్టీ అయినా ఈ సూత్రానికి దగ్గరగా పనిచేస్తుంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కొత్త ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల ఎంపికలో బీజేపీ చేసిన కసరత్తు ఇందుకు సంబంధించినదే!

అయితే, ఏ అడుగు వేసినా అందులో ఎన్నికల కోణాన్ని మాత్రమే చూడడం ఇటీవలి చర్చలు, విశ్లేషణలలో కనిపించే ఒక అవాంఛనీయ పరిణామం. ఇప్పుడు బీజేపీ ఎంపికను కూడా విశ్లేషకులు మూస ధోరణిలో ఎన్నికల వ్యూహాన్నే చూస్తున్నారు. మీడియా ఏం చర్చించాలో పాఠాలు చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. అయితే అభ్యర్థుల ఎంపిక గురించి పార్టీలు తీసుకున్న నిర్ణయాలు, ఎంపికలు తమ ఊహాగానాలకు, సర్వేలకు అనుకూలంగా లేవేమిటని వారు ఆశ్చర్యపోవడం కూడా వింతే అనిపిస్తుంది. తాము ఎంతో ఖర్చు చేసి చేయించిన సర్వేల కంటే బీజేపీకి ఎక్కువ స్థానాలు రావడమేమిటన్న ఒక అసంబద్ధ వైఖరి కూడా కొందరు మీడియా వారు పరోక్షంగా అయినా వ్యక్తం చేయడం నిజం. ఇలాంటివారు మొదట చేయవలసిన పని ఆ తీర్పు ప్రజలు ఇచ్చినదని గౌరవించడం.

అలాగే ఊహాగానాలకు అతీతంగా ముఖ్యమంత్రి అభ్యర్థుల పేర్లు వచ్చినా బుగ్గలు నొక్కుకోవడం ఎందుకు? పార్టీ కొత్తవారికి అవకాశం ఇవ్వదలిచింది. గతం కంటే మెరుగ్గా సోషల్ ఇంజినీరింగ్‌కు స్థానం కల్పించాలని అనుకున్నది. దాని ఫలితమే ఇలాంటి ఎంపిక. తెలంగాణలో బీసీ వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి పదవి ఇస్తానని చెప్పిన తరువాత ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎంపిక జరిగింది. అందులో తెలంగాణకు ఇచ్చిన హామీ జాడలు కనిపిస్తున్నాయి కూడా. దీనిని గుర్తించడం అవసరం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యాభయ్ శాతం ఉన్న ఓబీసీలకు ఆ అవకాశం దాదాపు రాలేదు. దానిని గుర్తించి, ఆ తప్పిదాన్ని సవరించే ప్రయత్నం బీజేపీ చేసింది. ఈ అంశం గురించి సరైన దారిలో చర్చ జరిపితే అది అన్ని పార్టీలకు ఉపయోగపడుతుంది. బీజేపీ చేసింది కాబట్టి మేము అనుసరించబోమని మిగిలిన పార్టీలు అంటే అది వేరే విషయం. అలాంటి అభిప్రాయానికి మీడియా కూడా రాకూడదన్నదే ఇక్కడ చెప్పదలుచుకున్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడుతున్నా విశ్లేషణలు వస్తున్నాయి. ఏ సంవత్సరం ఎన్ని ఓట్లు వచ్చాయి, శాతం, ప్రాంతాలవారీగా అభ్యర్థులు, గెలుపోటములు విశ్లేషిస్తున్నారు. ఇవన్నీ స్వాగతించవలసినవే. వాటితో పాటు సోషల్ ఇంజినీరింగ్ విషయంలో పార్టీలలో వస్తున్న పురోగతి గురించి, అలాంటి ఆహ్వానించదగిన పరిణామం గురించి పార్టీలు పెడుతున్న శ్రద్ధలో వచ్చిన గ్రాఫ్ గురించి కూడా చర్చ జరిగితే రాజకీయాల గతినైనా మార్చవచ్చు.

మిగిలిన విషయాలు ఎలా ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఈ విషయంలో ముమ్మాటికి పట్టింపుగా ఉన్నారు. సోషల్ ఇంజినీరింగ్‌కు, స్త్రీపురుష సమానత్వానికి ఆయన తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఈ ప్రస్తావన ఎందుకు అంటే, సోషల్ ఇంజినీరింగ్‌ను పాటించడానికి ఏ పార్టీ అయినా ప్రయత్నం చేస్తుంటే ఆ విషయం చెప్పడానికి సందేహించనక్కర లేదు. మనం ఒక పార్టీని అభిమానించడం, ఆ పార్టీ చేపట్టే సోషల్ ఇంజినీరింగ్‌ను సానుకూలంగా గమనించడం, ఈ రెండూ అవసరమే. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం అంటే, అది ఏ పార్టీ మనస్ఫూర్తిగా, నిజాయితీగా చేసినా స్వాగతించాలి. అదే బాధ్యతాయుతమైన పౌరుల లక్షణం కూడా. అనేక కారణాలతో, వందల సంవత్సరాల విదేశీ పాలన ఫలితంగా ఇక్కడ అలాంటి సమతూకం, క్రమం దెబ్బతిన్నాయి. దానిని సరిదిద్దే బాధ్యతను అన్ని రాజకీయ పార్టీలు స్వీకరించాలి. బడుగు బలహీన వర్గాల గురించి, మైనారిటీల గురించి ఇంతగా మాట్లాడే వామపక్ష, ఉదారవాద పార్టీలు కూడా ఆ విషయంలో పెద్దగా సాధించినది ఏమీలేదు. అంతమాత్రాన బీజేపీ ఆ ప్రయత్నంలో ఉంటే అందులో రాజకీయాలు, ఎన్నికల వ్యూహాలు చూడడం మంచిది కాదు. అందుకు సంబంధించిన కీర్తి బీజేపీదే అయితే దానికే దక్కనివ్వాలి!

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పిలిచారా?



మీరు పాశ్చాత్య దేశాలనూ, వారి సంస్కృతినీ, వారి విలువలనూ ద్వేషిస్తున్నట్ట యితే – అసలు ఆ దేశాలకు మిమ్మల్ని ఎవరు వెళ్లమన్నారు?

– లుయీ అహ్మద్, యాక్టివిస్ట్

అనారోగ్య చరిత్ర



స్థూలకాయం అనేది 1970లకు ముందు అసాధారణ విషయం. కానీ తర్వాత మన పోషణ మారింది. ఆరోగ్యకర కొవ్వుల స్థానంలోకి గింజ నూనెలు, రిఫైన్డ్ పిండిపదార్థాలు, చక్కెర వచ్చాయి. ఇప్పుడు స్థూలకాయం, మధుమేహం అనేవి నమోదైన చరిత్రలో ఏ కాలానికైనా అత్యధికం.

– రాబర్ట్ లుష్కిన్, మెడికల్ స్కూల్ ప్రొఫెసర్

ఇవీ వండుతాం!



బెంగాలీ వంటకాలంటే కేవలం చేపలు, చికెన్, మటన్ మాత్రమే కాదు. బెంగాలీ జనం కూరగాయలతో కూడా నోరూరించే వంటలు వండుతారు. శుక్తో, ఆలూ పోస్తో, దోయి పాతోల్, బసంతీ పులావ్, ధోకర్ దాల్నా, భోగ్ ఖిచూరీ, లాబ్రా, రధా బల్లాభీ, ఆలూర్ చోప్, చోర్‌చోరీ అందులో కొన్ని.

– ఇంద్రాణి, వ్యాఖ్యాత

ఒక వాస్తవం



అన్ని కులాలకు చెందిన హిందూ వితంతువులు తిరిగి పెళ్లి చేసుకోవచ్చునని మౌర్య యుగపు కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. ఒకవేళ మామ అంగీకరించిన మనిషిని పెళ్లి చేసుకుంటే... భర్తగానీ, మామగానీ ఇచ్చిన ఆస్తిని ఆమె తనతో ఉంచుకోవచ్చునని కూడా అంటోంది. లేదంటే, ఆస్తి జప్తు అవుతుంది. పెళ్లి మాత్రం చేసుకోవచ్చు.

– సావిత్రి ముముక్షు, పరిశోధకురాలు

ఒక గౌరవం



యాభై ఏళ్ల క్రితం నేను పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి (ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఆనర్స్) పట్టభద్రురాలినయ్యాను. వృత్తిలో రాణించినందుకుగానూ 2023 ‘ఇల్లస్ట్రియస్ అలుమ్నై అవార్డ్’కు నన్ను డిపార్ట్‌మెంట్ ఎంపిక చేసిందన్న ప్రకటనను అణకువతో స్వీకరించాను. నా మాతృసంస్థకూ, పంజాబ్‌కూ ధన్యవాదాలు.

– వందనా శివ, పర్యావరణవేత్త

ఎందుకు వదిలేశారు?



స్టాలిన్ 1939లో పోలండ్ మీద కూడా దాడి చేశాడన్న విషయాన్ని ‘నెట్‌ఫ్లిక్స్’ కొత్త డాక్యుమెంటరీ సిరీస్ ‘వరల్డ్ వార్ 2: ఫ్రమ్ ద ఫ్రంట్‌లైన్స్’ విడిచిపెట్టింది. కేవలం జర్మనీ దాడిని మాత్రమే ప్రస్తావించారు. గొప్ప సూక్ష్మాంశాలు ఇవ్వక్కర్లేదు; కానీ ఎన్నో యుద్ధ, యుద్ధానంతర అంశాలకు అది ముఖ్యమైన భాగం కదా!

– గారీ కాస్పరోవ్, చెస్ దిగ్గజం, యాక్టివిస్ట్

ఒక సందేహం



పని ప్రదేశాల్లో సమానత్వాన్ని కోరుతూనే, రుతుస్రావాన్ని ఒక వైకల్యంగా పరిగణించి తప్పనిసరి పెయిడ్ లీవ్ ఇవ్వాలంటున్న మహిళల పట్ల నేను గర్వపడతాను. కానీ మీ ఇంట్లో పనిచేసే మహిళకు కూడా రుతుస్రావం ఉంటుంది; ఆమెకు కూడా మీరు పెయిడ్ లీవ్ ఇస్తున్నారా?

– రూపా మూర్తి
సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

పెట్టుబడి మర్మం తెలిపే గ్రంథం

పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయవచ్చని ప్రభుత్వాలు భావిస్తూ ఉన్నాయి. కానీ ఈ పెట్టుబడులు కొంతమందికి వందల కోట్ల రూపాయల లాభం చేకూరుస్తాయేమోగానీ మూడొంతుల ముప్పాతిక మంది జనానికి నయాకాణీ ఆస్తిని సమకూర్చలేవు. పెట్టుబడులు బాగా ఉన్న ఏ దేశంలో చూసినా ఇంకా దరిద్రం కొనసాగుతూనే ఉంది. నిరుద్యోగం, నిరాశ్రయత, ఆకలిదప్పులూ, అలమటింపులూ, విద్య వైద్య సేవల అలభ్యతలూ కొనసాగుతూనే ఉన్నాయి. కాబట్టి పెట్టుబడుల రాకడతోనో, పోగుపడటం మూలంగానో భూతలస్వర్గం ఏర్పడబోదు అని స్పష్టం అవుతోంది. మహా అయితే కొంతమందికి కూలి, ఇంకొంత మందికి జీతం, మరికొంత మందికి ఇయర్లీ ప్యాకేజీ గిట్టుబాటు అవుతాయి. అంతే!



పెట్టుబడుల లోగుట్టు తెలవాలంటే ‘కమ్యూనిస్ట్ మానిఫెస్టో’ (కమ్యూనిస్టు ప్రణాళిక)ను చదవాలి. దీనిని తొలిగా దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 1930వ దశాబ్దంలో తెలుగు చేసి వెలువరించారు. ఆ తర్వాత కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), రాచమల్లు రామచంద్రా రెడ్డి, గిడుతూరి సూర్యం, ఇంగువ మల్లికార్జునశర్మ, ‘పీకాక్ క్లాసిక్స్’ ఏ. గాంధీ తెలుగులోకి అనువదించి వెలువరించారు. గతేడాది కమ్యూనిస్టు ప్రణాళిక 150వ జయంతి సందర్భంగా, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కమ్యూనిస్టు ప్రణాళికను స్థానిక భాష లలో లక్షల ప్రతులు ముద్రించి పంపిణీ చేశారు. అయినప్పటికీ కమ్యూనిస్టు ప్రణాళి కను మరింత సరళంగా తెలుగులో తీసుకురావాలని మేం భావించాం. మార్క్స్ రచనా శైలి కవితాత్మకంగా ఉంటే, ఏంగెల్స్ రచనా శైలి మర ఫిరంగి పక్కన నిలబడ్డ ఒక పెద్దమనిషి రెండు చేతుల్తో బాంబులు విసురుతున్నట్లుగా ఉంటుందని ప్రముఖ ఆర్టిస్ట్ తాడి మోహన్ అంటారు.

సమాజం నిత్య చలనశీలమైనదన్న వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారు. సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా భాష, సంస్కృతి, ప్రజల ఆహార్యం, ఆహార అలవాట్లు... ఇలా మానవజీవిత సకల పార్శ్వాలూ మార్పులకు లోనవుతుంటాయి. ఇందుకు మన తెలుగు భాష అతీతం కాదు. 50వ దశకంలో తెలుగు భాష, 80వ దశకానికి వచ్చేసరికి చదువరుల సౌలభ్యం కోసం మార్పులకు లోనయింది. 2000వ ఏడాది నుండి విద్య కార్పొరేటీకరణకు లోనయి, ప్రైవేటు విద్యారంగంలో తెలుగు మాధ్యమం లేకుండా పోవడం, మార్కుల కోసం సంస్కృతాన్ని ద్వితీయ భాషగా ఎంపిక చేసుకునే దుఃస్థితి కల్పించటంతో ఆ తరం చదువరులకు భాష మరింత సరళం అవ్వాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో కమ్యూనిస్టు మానిఫెస్టోకు వచ్చిన అనువాదాలు కాలప్రామాణికత రీత్యాగానీ, సారం రీత్యాగానీ గొప్పవే. యువతరం చదువరుల కోసం సారం రీత్యాగానీ, భాషా సరళత రీత్యాగానీ మరో అనువాదం అవసరం అనిపించింది. మా అభ్యర్థన మేరకు రచయిత్రి ఉమా నూతక్కి అనువదించిన కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిష్కరణ సభ డిసెంబర్ 17, సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. మాజీ శాసన సభ్యులు పాటూరు రామయ్య, గుమ్మడి నరసయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

– విశ్వేశ్వరరావు, పబ్లిషర్ ; 94906 34849

(రేపు ‘కమ్యూనిస్ట్ ప్రణాళిక’ నూతన అనువాదం ఆవిష్కరణ)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆ కెనాల్ కోసమే ఉత్తర గాజాపై దాడి

అభిప్రాయం



బుడ్డిగ జమిందార్

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపమని ప్రపంచవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నా అమెరికా అండతో ఇజ్రాయెల్ బేఖాతరు చేస్తోంది. లక్షలాది ప్రజానీకాన్ని గాజాలో ఉత్తర ప్రాంతం నుండి దక్షిణాదికి తరుముతూ ఇప్పటి వరకూ 20 వేల మందిని చంపింది. యుద్ధానికి ప్రధాన రహస్య ఎజెండా ‘బెన్ గురియన్ కెనాల్ ప్రాజెక్ట్’ను నిర్మించటమే అనే అనుమానం నిజమౌతోంది. ‘సూయజ్ కెనాల్’ చుట్టూ ఉన్న క్లిష్టమైన భౌగోళిక రాజకీయ వ్యూహాలను విశ్లేషిస్తే కానీ అసలు విషయం అర్థం కాదు.

1948 ఊచకోత (నక్బా) సమయంలో ప్రథమ ప్రధాన మంత్రిగా బెన్–గురియన్, లక్షమంది పాలస్తీనియన్లను చంపించి, 7 లక్షల పాలస్తీనియన్ అరబ్బులను బలవంతంగా దేశం నుండి బహిష్కరించి ఇజ్రాయెల్ రాష్ట్ర స్థాపన చేశాడు. పాలస్తీనాలో యూదులకూ, అరబ్బులకూ సమాన రాజకీయ హక్కులను కల్పించే ప్రజాస్వామ్య గణతంత్ర స్థాపనను వ్యతిరేకించాడు. అన్ని యూదు మిలిటరీ సమూహాలను ఒక కేంద్ర సంస్థగా ఏకం చేస్తూ ఇజ్రాయెల్ రక్షణ దళాలను స్థాపించాడు. 1956లో గాజా, సినాయ్‌పై దాడికి ఆదేశించాడు. ఈజిప్టు నియంత్రణ నుండి సూయజ్ కాలువను స్వాధీనం చేసుకునేందుకు ఫ్రాన్స్, బ్రిటన్‌లు చేసిన ప్రయత్నంలో భాగస్వామిగా మారాడు. అందుకే బెన్ గురియన్ జియోనిస్ట్ ప్రభుత్వం అరబ్బులను మాతృభూమి నుంచి తరిమివేసినా పశ్చిమ దేశాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోలేదు.

1963లో ‘బెన్ గురియన్ కెనాల్ ప్రాజెక్ట్’ సముద్ర రవాణా మౌలిక సదుపాయాల చొరవగా భావించబడింది. ఈ ప్రాజెక్టుకు దేశ వ్యవస్థాపకుడు అయిన ‘డేవిడ్ బెన్–గురియన్’గా నామకరణం జరిగింది. ప్రతిపాదిత బెన్ గురియన్ కాలువ తూర్పు మధ్యధరా తీరం వరకు విస్తరించి, గాజా ఉత్తర సరిహద్దు దగ్గర మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. కనుకనే గాజాలోని ఉత్తర ప్రాంత పాలస్తీనియన్లను ఏరివేసే పనిచేపట్టింది ఇజ్రాయెల్. యూరప్–ఆసియా మార్గంలో ఈజిప్టును సవాలు చేస్తూ ప్రపంచ సముద్ర మార్గాలను పునర్నిర్మించటానికి ఈ నూతన కాలువను ‘గల్ఫ్ ఆఫ్ అకాబా’ (ఎర్ర సముద్రం యొక్క తూర్పు భాగం) నుండి ప్రారంభించి ‘నెగెవ్ ఎడారి’ (ఇజ్రాయెల్) ద్వారా నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. గల్ఫ్ ఆఫ్ అకాబా నాలుగు దేశాలు (ఈజిప్ట్, ఇజ్రాయెల్, జోర్డాన్, సౌదీ అరేబియా) పంచుకున్న తీర



రేఖను కలిగి ఉంది. ఈ ప్రతిపాదిత కాలువ నిర్మాణంతో ఒనగూరే ఆర్థిక అవకాశాల కోసం ఇజ్రాయెల్ ప్రస్తుతం పాలస్తీనాపై యుద్ధం చేస్తుందనిపిస్తోంది. సూయజ్ కెనాల్‌కు ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి అమెరికా సరఫరా చేసే 520 అణుబాంబులను ఉపయోగించాలనే ప్రతిపాదనను ఇజ్రాయెల్ 1963లో పరిగణనలోకి తీసుకున్నది. ఒక డీ క్లాసిఫైడ్ మెమోరాండం ప్రకారం... ఇజ్రాయెల్ నెగెవ్ ఎడారి గుండా సముద్ర మట్ట కాలువకు 160 మైళ్ల కంటే ఎక్కువ త్రవ్వకాలు జరిపి ఉండేదని చరిత్రకారుడు అలెక్స్ వెల్లర్ స్టెయిన్ అంటున్నాడు. ప్రతి మైలుకు నాలుగు 2–మెగా టన్నుల పరికరాలు అవసరమని మెమోరాండం అంచనా వేసింది. ‘‘దీనిని వెల్లర్‌స్టెయిన్ ‘520 న్యూక్స్’ అని వ్యవహరిస్తా’’రని అలెక్స్ వెల్లర్ స్టెయిన్ ట్వీట్ చేశాడు. ఈ ప్రణాళికను ‘సూయజ్ కెనాల్‌కు ప్రత్యమ్నాయ ప్రతిపాదన’గా పేర్కొన్నాడు.

సూయజ్ కెనాల్ 1869లో ప్రారంభించబడిన మానవ నిర్మిత జలమార్గం. ఇది ఈజిప్టులోని సూయజ్ యొక్క ఇస్త్మస్ మీదుగా ఉత్తరం నుండి దక్షిణం వైపు ప్రవహిస్తూ, మధ్యధరా సముద్రాన్ని ఎర్ర సముద్రంతో కలుపుతోంది. యూరప్ ఆసియా మధ్య నౌకాయాన దూరాన్ని గణనీయంగా తగ్గిస్తోంది. ఆఫ్రికా ఖండాన్ని ఆసియా నుండి వేరు చేసే ఈ కాలువ 150 సంవత్సరాల క్రితం తవ్వినది. కాలువ ప్రారంభంలో బ్రిటిష్, ఫ్రెంచ్ ప్రయోజనాలకు ఉపయోగపడేది. అయితే ఈజిప్ట్ 1956లో దీన్ని జాతీయం చేసింది. దీంతో ఈ కాలువపై ఈజిప్టు ఆధిపత్యం ఏర్పడింది. ప్రస్తుతం ఈజిప్టు జీడీపీలో దాదాపు 2 శాతం వాటా ఈ కాలువ ద్వారా సరుకు రవాణా చేసే నౌకలపై విధించిన టోల్ రుసుము ద్వారానే లభిస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 12 శాతం సూయజ్ కెనాల్ గుండా సాగుతోంది.

ఈ పరిస్థితుల్లో బెన్–గురియన్ కాలువ నిర్మాణం జరిగితే ప్రపంచ వాణిజ్య, భౌగోళిక రాజకీయాలపై గణనీయమైన ప్రభావం పడుతుంది. యూరప్– ఆసియా మధ్య కొత్త నౌకా రవాణా మార్గాన్ని సృష్టించి ప్రపంచ నౌకా రవాణాపై ఇజ్రాయెల్ ఆధిపత్యం చెలాయించాలనే తపనతో ఉత్తర గాజా ప్రాంతవాసుల్ని దక్షిణం వైపునకుగానీ, వేరే దేశాలకుగానీ శరణార్థులుగా పొమ్మంటున్నదనే ఆలోచనలు బలపడుతున్నాయి.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్,
కె.ఎల్. యూనివర్సిటీ

క్లుప్తంగా...

సింగరేణిలో ఎన్నికలు మళ్లీ వాయిదా?

- హైకోర్టులో పిటిషన్ దాఖలు.. 18న తేలనున్న ఎన్నికల నిర్వహణ భవితవ్యం

సింగరేణి (కొత్తగూడెం) / సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఈనెల 27న జరగనున్న సింగరేణి ఎన్నికలు వాయిదా పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సింగరేణి గుర్తింపు ఎన్నికలపై రాష్ట్ర మంత్రులు శుక్రవారం కీలక భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాయంత్రం అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయంలో కోల్‌బెల్ట్‌ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఎన్టీయూసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికలు వాయిదా వేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఇటీవలే అధికారంలోకి రావడం, ఇంకా వివిధ శాఖల్లపై సమీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సింగరేణిలో ఎన్నికల ప్రచారానికి సమయం సరిపోదనే భావనతో ఎన్నికలు వాయిదా వేయించాలనే భావనకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే విషయమై సింగరేణి సంస్థ, కార్మిక శాఖ ఉన్నతాధికారులతో కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎనర్జీ సెక్రటరీ గుర్తింపు ఎన్నికలు వాయిదావేయాలని కోరు తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లుగా తెలుస్తోంది. ఈ పిటిషన్‌పై ఈనెల 18న వాదనలు జరిగే అవకాశముంది. కాగా, మరోవైపు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరిపించాలని ఏఐటీయూసీ నాయకులు హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు.

రియల్‌మీ సీ67 5జీ మొబైల్ విడుదల



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ సెలెక్ట్ మొబైల్స్ మాదాపూర్ స్టోర్‌లో రియల్‌మీ సరికొత్త మోడల్ రియల్‌మీ సీ67 5జీ మొబైల్‌ను సినీనటి శివానీ రాజశేఖర్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని విడుదల చేశారు. ఈ మోడల్ ఫోన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉందని మురళి రేతినేని తెలిపారు. కార్యక్రమంలో తరిణి ప్రసాద్, పునీత్ చతుర్వేది తదితరులు పాల్గొన్నారు.

భార్య, ఇద్దరు పిల్లలను చంపి..

కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య

- సర్వీస్ పిస్టల్‌తో కాల్చేసిన వైనం
- ఆన్‌లైన్ గేమ్స్, ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసిన కానిస్టేబుల్!
- కలెక్టర్ సెలవుపై వెళ్లడంతో ఇంటికి వచ్చిన సమయంలో ఘాతుకం
- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో విషాదం



పిల్లల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సాక్షి, సిద్దిపేట: కలెక్టర్ గన్‌మన్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు పిల్లలను పిస్టల్‌తో కాల్చి చంపి.. తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులే ఈ దారుణానికి కారణమని తెలుస్తోంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మృతుడు కలెక్టర్ గన్‌మన్ కావడంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం ప్రకారం.. రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల రాములు, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు ఆకుల నరేశ్ (35) 2013లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఎనిమిదేళ్ల క్రితం కోహెడ మండలం ఎర్రగుంటపల్లెకు చెందిన చైతన్య (30)తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు రేవంత్ (7), కుమార్తె హితాశ్రీ(5) సంతానం. భార్య చైతన్య సిద్దిపేట పట్టణంలోని ఓ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. అదే పాఠశాలలో కుమారుడు రేవంత్ రెండో తరగతి, కుమార్తె హితాశ్రీ ఒకటో తరగతి చదువుతున్నారు. నరేశ్ సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దగ్గర గన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో లేని సమయంలో నరేశ్.. ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌కు అలవాటు పడ్డాడు. డబ్బులు పెట్టి ఆర్థికంగా నష్టపోయాడు. దీనికి తోడు సొంత గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు గుదిబండగా మారాయి. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఇదిలా ఉండగా శుక్రవారం కలెక్టర్ సెలవుపై వెళ్లడంతో విధి నిర్వహణలో ఉన్న నరేశ్.. రామునిపట్లలోని ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో భార్య చైతన్యను, స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరు పిల్లలను 9ఎంఎం సర్వీస్ పిస్టల్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి, తర్వాత తాను కూడా అదే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తుపాకీ శబ్దం విన్న ఇరుగు, పొరుగువారు ఇంట్లోకి వెళ్లి చూడగా.. నరేశ్ కుటుంబం రక్తపు మడుగులో పడి ఉండటంతో వెంటనే మృతుడి సోదరుడికి, డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీపీ శ్వేత ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నరేశ్ తుపాకీని, సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. అనంతరం మృతదేహాలను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులే కారణం: శ్వేత, సీపీ

నరేశ్‌తో పాటు అతని భార్య, ఇద్దరు పిల్లల మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. ఆన్‌లైన్ గేమ్‌లకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. నరేశ్‌కు సంబంధించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాం. నరేశ్ శుక్రవారం డ్యూటీలో రిపోర్ట్ చేశాడు. పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తాం.

రక్తపు మడుగులో..

నరేశ్, అతని భార్యాపిల్లలు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది నరేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌పుష్ప విల్లాస్‌లో శుక్రవారంరాత్రి జరిగిన రాష్ట్ర సమాచార, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడైన ప్రసాదరెడ్డి కుమారుడి నిశ్చితార్థానికి సీఎం ఎ.రేవంత్‌రెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

పట్టణాలు, గ్రామస్థాయిలో ప్రజావాణి

- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి
- అధికారులకు సీఎం ఆదేశాలు
- ప్రతి నెలా రెండు రోజులు నిర్వహిస్తే ప్రజలు హైదరాబాద్‌కు రావడం తగ్గుతుందని వ్యాఖ్య
- మంత్రులను జనం కలవడానికి నిర్దిష్ట సమయం కేటాయించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రతినెలా రెండు రోజుల పాటు పట్టణాలు, గ్రామాల్లో ప్రజావాణి సభలు నిర్వహించి.. అక్కడే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తే ప్రజలు హైదరాబాద్ దాకా వచ్చే అవసరం తగ్గుతుందని సూచించారు. ప్రజల నుంచి అందే విజ్ఞప్తులు, ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలని.. ఎప్పటికప్పుడు ప్రజలకు స్టేటస్‌ను తెలియజేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, సమయం నిర్దేశించుకుని పరిష్కరించాలని సూచించారు. దీనితో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఏర్పడుతాయని.. సుహృద్భావ వాతావరణంలో ప్రభుత్వం పనిచేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

మంత్రులకూ నిర్దిష్ట సమయం

సచివాలయానికి వచ్చే ప్రజలు మంత్రుల చాంబర్లలో తమ సమస్యలను విన్నవించుకునేందుకు నిర్దిష్టమైన సమయం, ప్రత్యేక అనుమతులు కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రజావాణికి అద్భుత స్పందన వస్తున్నందున ఫిర్యాదుల స్వీకరణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టేబుళ్ల సంఖ్యను పెంచాలని, కనీస అవసరాలైన మంచినీరు, ఇతర వసతులను కల్పించాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అవసరమైతే శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

6 గ్యారంటీలకు దరఖాస్తు సిద్ధం చేయండి

తాము హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ఓ నమూనా పత్రాన్ని (ఫార్మాట్‌ను) రూపొందించాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. గతంలో ఉన్న గ్రామసభలను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. గ్రామసభలతో క్షేత్రస్థాయిలోనే సగం సమస్యలు పరిష్కారం అవుతాయని.. కేవలం 20 శాతం సమస్యలే పైస్థాయి దాకా వస్తాయని పేర్కొన్నారు.



ప్రజావాణిలో సమస్యల పరిష్కారం కోసం ప్రజాభవన్ వద్ద భారీగా బారులు తీరిన జనం

ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

బారులు తీరిన జనం... ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు..

సాక్షి, హైదరాబాద్: ''నాకు డబుల్ బెడ్రూం ఇల్లు రాలేదు''.. ''పింఛన్ కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా..నాకు పింఛను రావడం లేదు సర్''.. ''ప్రభుత్వోద్యోగం సాధించాలని నా కల..త్వరలో నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలి''..''తెలంగాణ ఉద్యమంలో కళాకారులమంతా పాటలతో ఉద్యమాన్ని ఢిల్లీకి వినిపించాం..ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం''అంటూ వివిధ జిల్లాల నుంచి ప్రజలు ప్రజావాణిలో విన్నవించారు. వారంలో మంగళ, శుక్రవారాలే ప్రజావాణి నిర్వహిస్తుండటంతో శుక్రవారం జనం బారులు తీరారు. దీంతో పంజగుట్ట నుంచి ప్రజాభవన్ వరకు ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంటవరకు మాత్రమే వినతులు స్వీకరిస్తుండటంతో అనేకమంది ఉదయం ఐదు గంటల నుంచి క్యూ కట్టారు. ప్రజావాణికి హాజరైన వారికి తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. అయితే అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ఉండటంవల్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవ్వరూ ప్రజావాణికి హాజరు కాలేదు. ఉదయం 10 గంటల నుంచి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, ఆయుష్ శాఖ కమిషనర్ హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ వినతులు స్వీకరించారు. తిరిగి మంగళవారం ప్రజావాణి ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం వారి వివరాలు తీసుకుని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. పింఛన్, డబుల్ బెడ్రూం, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య, భూమి సమస్య వంటివాటిపై ప్రజావాణిలో ఎక్కువ వినతులు వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శాసనసభ ముందు ఉన్న జంక్షన్‌లోని రెండు రోడ్లను తాత్కాలికంగా మూసివేయడం, మాజీ సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి శుక్రవారం డిశ్చార్జ్ కావడం.. ఆయన కోసం మధ్యాహ్నం గ్రీన్‌చానల్ ఇవ్వడంతో పలు మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

బ్రిటన్లో పాపం పసివాడు!

- తల్లే 'కిడ్నాప్' చేసింది!
- అప్పట్లో దేశవ్యాప్త సంచలనం
- ఆరేళ్లకు ఫ్రాన్స్‌లో దొరికాడు

అనగనగా అలెక్స్ బాటీ. ఓ 11 ఏళ్ల పాల బుగ్గల పసివాడు. సొంతూరు బ్రిటన్‌లోని గ్రేటర్ మాంచెస్టర్. తల్లి, తాతయ్య విదేశీ యాత్రకు వెళ్దామంటే సంబరంగా వాళ్లతో కలిసి స్పెయిన్ బయల్దేరాడు. ఆ యాత్ర ఏకంగా ఆరేళ్లకు పైగా సాగుతుందని అప్పుడతనికి తెలియదు పాపం! ఎందుకంటే అప్పట్నుంచీ అతను బ్రిటన్ తిరిగి రానే లేదు. సరికదా, ఆచూకీ కూడా తెలియకుండా పోయాడు! అతనే కాదు, నాటినుంచీ అతని తల్లి, తాతయ్య కూడా నేటికీ పత్తా లేరు!! ఈ ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బ్రిటన్ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కూడా చేశారు. అలెక్స్ కోసం యూరప్ అంతటా వెదికీ వెదికీ అలసిపోయారు. ఇక తమవల్ల కాదంటూ చేతులెత్తేశారు. అదుగో, అలాంటి స్థితిలో మూడు రోజుల క్రితం అనుకోకుండా ఫ్రాన్స్‌లో దొరికాడు అలెక్స్. ఈ లాస్ట్ అండ్ ఫౌండ్ స్టోరీ ఇప్పుడు బ్రిటన్ అంతటా టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది!


ట్రక్కు డ్రైవర్ అడిసినీ

ఇలా దొరికాడు...


వాయవ్య ఫ్రాన్స్‌లోని టౌలోస్ అనే కొండ ప్రాంతంలో గత బుధవారం అర్ధరాత్రి దాటాక ఓ 17 ఏళ్ల కుర్రాడు హోరు వానలో తడుస్తూ, హైవే పక్కగా పేవ్‌మెంట్‌పై ఒంటరిగా నడుస్తూ పోతున్నాడు. అటుగా వెళ్తున్న ఫాబియన్ అసిడినీ అనే ఓ ట్రక్ డ్రైవర్ కంటపడ్డాడు. అది మారుమూల ప్రాంతం, పైగా ఎవరూ బయట తిరగని వేళ కావడంతో అనుమానం వచ్చిన ఆ డ్రైవర్ మనవాణ్ని దగ్గరికి తీశాడు. తొలుత బెదురు చూపులతో మారుపేరు చెప్పినా, అనునయించి అడిగేసరికి అసలు పేరు, తాను తప్పిపోయిన వృత్తాంతం మొత్తం చెప్పుకొచ్చాడు. 'కొన్నేళ్ల కింద మా అమ్మే నన్ను కిడ్నాప్ చేసింది' అంటూ ముక్తాయించాడు. దాంతో బిత్తరపోయిన అసిడినీ వెంటనే అతన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పజెప్పాడు. వాళ్లు బ్రిటన్‌కు సమాచారమివ్వడం, ఫొటో చూసిన నానమ్మ అలెక్స్‌ను గుర్తు పట్టడం, ఇద్దరూ వీడియో కాల్‌లో మాట్లాడుకుని ఆనందబాష్పాలు రాల్చడం చకచకా జరిగిపోయాయి.

ఏం జరిగిందంటే...

అలెక్స్ అమ్మానాన్నలు చాన్నాళ్ల క్రితమే విడిపోయారు. అలెక్స్ కోరిక మేరకు కోర్టు అతన్ని నానమ్మ సంరక్షణలో ఉంచింది. ఆమె అనుమతి లేకుండానే 11 ఏళ్ల అలెక్స్‌ను తల్లి, తాతయ్య కలిసి విహారయాత్ర పేరిట 2017లో స్పెయిన్ తీసుకెళ్లారు. అప్పటినుంచీ ముగ్గురూ అయిపు లేకుండా పోయారు. పెద్దవాళ్లిద్దరూ అప్పటికి కొంత కాలంగా ఆధ్యాత్మిక బాట పట్టినట్టు దర్యాప్తులో తేలింది. తమతో పాటు అలెక్స్ కూడా ఆ ప్రత్యామ్నాయ జీవనం గడపాలనే ఉద్దేశంతో అతన్ని తీసుకుని స్పెయిన్‌లో ఓ ఆరామం వంటి ప్రదేశానికి వెళ్లినట్టు పోలీసులు ముక్తాయించారు. తాము తొలుత ఓ విలాసవంతమైన ఇంట్లో ఒక రకమైన ఆధ్యాత్మిక సమూహంతో కలిసి కొన్నేళ్ల పాటు గడిపామన్న అలెక్స్ తాజా వాంగ్మూలం కూడా దీన్ని ధ్రువీకరించింది. తర్వాత అమ్మ, తాతయ్య ఇద్దరూ అలెక్స్‌ను తీసుకుని 2021లో ఫ్రాన్స్‌లో ప్రత్యామ్నాయ జీవన శైలికి పేరున్న పైరెనీస్ ప్రాంతానికి మారినట్టు భావిస్తున్నారు. అలెక్స్ దొరికిన చోటు కూడా అక్కడికి కొద్ది దూరంలోనే ఉంది. ఆ జీవన విధానం తనకు నచ్చక నానమ్మ చెంతకు చేరేందుకు తప్పించుకుని వచ్చేశానని అలెక్స్ చెప్పుకొచ్చాడు. అతన్ని ఒకట్రెండు రోజుల్లో నానమ్మ దగ్గరికి చేర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అతని అమ్మ, తాతయ్యలపై కిడ్నాపింగ్ కేసు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండటం విశేషం! తాజా వివరాల ఆధారంగా వారిని తెరపైకి తీసుకొచ్చే పనిలో పడ్డారు బ్రిటన్ పోలీసులు.


11 ఏళ్ల ప్రాయంలో అలెక్స్ బాటీ

- సాక్షి, నేషనల్ డెస్క్



సౌర విలయం!

వాషింగ్టన్: వజ్రపు మొనపై కాంతి ఒక క్రమంలో చెదిరిపోయి చిత్రించిన అందమైన వెలుగు రేఖల్లా కన్పిస్తున్నాయి కదూ! కానీ ఇవేమిటో తెలుసా? సూర్యునిపై చెలరేగుతున్న ప్రచండమైన మంటలు! వీటిని ఎక్స్ కేటగిరీకి చెందిన సోలార్ ఫ్లేర్స్‌గా నాసా పేర్కొంది. గత 20 ఏళ్లలో నమోదైన అత్యంత శక్తిమంతమైన మంటలు ఇవేనట! సాధారణంగా సూర్యుని ఉపరితలంపై అయస్కాంత క్షేత్రాలు పునసంధానమయ్యే క్రమంలో ఈ మంటలు చెలరేగుతుంటాయి. తీవ్రతను బట్టి వాటిని జీ, సీ, ఎం, చివరగా అతి తీవ్రమైన మంటలను ఎక్స్‌గా వర్గీకరిస్తారు. ఇవి వరుసగా ఒక దానికంటే మరొకటి పదిరెట్లు శక్తిమంతమైనవన్నమాట. తాజా మంటలు ఎక్స్ కేటగిరీలోనూ అతి తీవ్రతతో కూడినవని నాసా వివరించింది. వీటి దెబ్బకు అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కొద్దిసేపు రేడియో ధార్మికత బాగా పెరిగిపోయింది. వీటి దెబ్బకు ఆయా చోట్ల రెండు గంటలకు పైగా సిగ్నల్స్‌కు అంతరాయం కూడా కలిగిందట. 2003లో వీటికంటే 15 రెట్లు శక్తిమంతమైన సోలార్ ఫ్లేమ్స్ నమోదయ్యాయి!

ప్రతి విద్యార్థికీ సమాన అవకాశాలు దక్కాలి



న్యూఢిల్లీ: ప్రపంచ స్థాయికి ఎదిగే క్రమంలో ప్రతి భారతీయ విద్యార్థికీ సమాన అవకాశాలుండాలని కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. శుక్రవారం తనను కలిసిన హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన హార్వర్డ్ విద్యార్థులతో చర్చలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. భారతదేశం గురించి, ఇక్కడ పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు, ప్రజాస్వామ్య రాజకీయాలకు ఎదురవుతున్న సవాళ్లు, చైనాతో భౌగోళిక రాజకీయ సవాళ్లు, కృత్రిమ మేధ వంటి అనేక అంశాలను తెలుసుకునేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఉన్నారు' అని గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. విద్యార్థులతో మాట్లాడుతున్న ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. 'ప్రజాస్వామ్య నమూనా, భారతదేశ తాత్విక, ఆధ్యాత్మిక ధోరణులపై నాకున్న అభిప్రాయాలను వివరించాను. ప్రతి భారతీయ విద్యార్థి ప్రపంచ స్థాయికి ఎదగటానికి అన్ని అవకాశాలను కల్పించాలని, అందుకోసం పోరాడాలని నిర్ణయించుకున్నాను'అని తెలిపారు.

ఆవిష్కరణలపై భారత్, అమెరికా ఎంవోయూ

న్యూఢిల్లీ: ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పించేందుకు భారత్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం(ఎంవోయూ)ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. ఉన్నత సాంకేతిక రంగంలో వాణిజ్య అవకాశాల బలోపేతానికి ఈ ఎంవోయూ దోహదపడుతుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంవోయూలో భాగంగా త్వరలోనే సిలికాన్ వ్యాలీలో హ్యాకథాన్, ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సులుంటాయి. ఇండస్ట్రియల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్‌లు)కు సంబంధించి ఇటలీతో కుదిరిన ఎంవోయూను కూడా కేబినెట్ ఆమోదించింది.

పట్టువీడని విపక్షాలు

- పార్లమెంట్‌లో భద్రతా లోపంపై రెండో రోజూ కొనసాగిన ఆందోళన
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్
- భద్రతా లోపానికి రాజీనామా చేయాలని స్పష్టీకరణ
- లోక్‌సభ, రాజ్యసభలో పూర్తిగా స్తంభించిన కార్యకలాపాలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా



పార్లమెంట్ ఆవరణలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాలతో ఉభయ సభలు వరుసగా రెండో రోజు శుక్రవారం సైతం పూర్తిగా స్తంభించిపోయాయి. తమ డిమాండ్ నుంచి విపక్ష ఎంపీలు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. బుధవారం నాటి అవాంఛనీయ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే సభకు వచ్చి వివరణ ఇవ్వాలని, భద్రతా లోపంపై ఉభయ సభల్లో చర్చ చేపట్టాలని వారు తేల్చిచెప్పారు. పార్లమెంట్ బయట మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్న హోంమంత్రి సభకు ఎందుకు రావడం లేదని వారు నిలదీశారు. పార్లమెంట్‌లో భద్రతా లోపానికి బాధ్యత వహిస్తూ హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆగంతకులకు విజిటర్ పాసులు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా లోపంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు 14 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతించాలంటూ లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పదేపదే కోరినా వినిపించుకోలేదు. ప్రతిపక్షాలు ఎంతకీ పట్టువీడకపోవడంతో ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సభలను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు. పార్లమెంట్ ప్రాంగణంలోనూ విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. గురువారం సస్పెన్షన్ వేటు పడిన ఎంపీలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లోక్‌సభ అలా...

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. భద్రతా లోపాన్ని లేవనెత్తారు. వెల్‌లోకి దూసుకెళ్లి ప్రకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ప్రారంభించారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే సభ వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ పునః ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాలేదు. విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్థానంలో ఉన్న కిరీట్ సోలంకీ ప్రకటించారు.

రాజ్యసభ ఇలా...

ఎగువ సభలోనూ విపక్షాలు అలజడి సృష్టించాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే విపక్షాల నుంచి నినాదాల హోరు మొదలైంది. హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి, సమాధానం చెప్పాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే అన్నారు. సభలో స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భద్రతా లోపంపై చర్చ చేపట్టాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేయగా, చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అంగీకరించలేదు. భద్రతా లోపంపై రాజ్యసభలో చర్చ కోసం పట్టుబడుతూ విపక్షాలు ఇచ్చిన 23 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. జీరో అవర్ చర్చను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తడానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ప్రయత్నించగా, చైర్మన్ ధన్‌ఖడ్ అసహనం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించవద్దని సూచించారు. విపక్ష ఎంపీలు నినాదాలు జోరు పెంచడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. పునఃప్రారంభమైన తర్వాత కూడా సభలో అలజడి తగ్గలేదు. సభా కార్యకలపాలు సజావుగా సాగడానికి సహకరించాలని పలుమార్లు కోరినా విపక్ష ఎంపీలు లెక్కచేయలేదు. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు.

అది మా బాధ్యత: ఖర్గే

దేశ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశంపై గళం వినిపించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ బాధ్యత, పార్లమెంటరీ విధి అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. విపక్ష ఎంపీలను చట్టవ్యతిరేకంగా నుంచి సస్పెండ్ చేశారని విమర్శించారు. ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన

14 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ విపక్ష ఇండియా కూటమి నేతలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు. గురువారం రాజ్యసభ నుంచి సస్పెండైన ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ ఈ నిరసనలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి తప్పు చేయని విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, భద్రతా లోపానికి కారణమైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై మాత్రం చర్యల్లేవని మండిపడ్డారు. తమపై సస్పెన్షన్ వేటును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ప్లాన్ బీ కూడా ఉంది..!

పార్లమెంట్‌లో అలజడికి కుట్ర పన్నిన లలిత్ ఝా బృందం, ప్లాన్ బీ కూడా సిద్ధం చేసుకుంది. విచారణలో లలిత్ ఈ మేరకు వెల్లడించాడు. నీలమ్, అమోల్ పార్లమెంట్ వద్దకు చేరుకోలేకుంటే ముకేశ్, కైలాశ్ మరో మార్గంలో చేరుకుని మీడియా కెమెరాల ఎదుట నినాదాలిస్తూ పొగ గొట్టాలను పేల్చాలనుకున్నారు. కానీ మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని విక్కీ ఇంటికి సాగర్ శర్మ, మనోరంజన్, అమోల్, నీలమ్ మాత్రమే వచ్చారు. మహేశ్, కైలాశ్ రాలేకపోయారు.

బూట్లలో పొగ గొట్టాలు

లోక్‌సభలో ప్రయోగించిన పొగ గొట్టాలను నిందితులు బూట్లలో దాచి సభలోకి తెచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఎడమ బూటు కింది భాగంలో రబ్బరు పొరలతో చేసిన రహస్య అరలో వాటిని అమర్చుకొని సభలోకి ప్రవేశించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బూట్లను భద్రతా సిబ్బంది తనిఖీ చేయరని కనిపెట్టే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. వారినుంచి స్వాధీనం చేసుకున్న కరపత్రాల్లో కరపత్రాల్లో మణిపూర్ హింసాకాండపై నినాదాలున్నట్లు తెలిపారు.

ఏడు రోజుల కస్టడీ

పార్లమెంట్‌లో పొగ గొట్టాలు ప్రయోగించిన కేసులో అరెస్టయిన కీలక సూత్రధారి లలిత్ ఝాను 7 రోజుల పాటు ఢిల్లీ పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఝాను గురువారం రాత్రి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతను వాడిన ఫోన్లో కీలక సమాచారం ఉండొచ్చన్నారు. ఈ ఉదంతంపై ఉన్నత స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. దీనిపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విపక్షాలు ముందుకు రావాలని సూచించారు.



సహనశీలత తగ్గుతోంది



పదవీ విరమణ కార్యక్రమంలో సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ కౌల్

న్యూఢిల్లీ: ఎదుటి వారి అభిప్రాయాల పట్ల ప్రజలు సహనం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సమాజంలో నేడు సహనశీలత స్థాయిలు తగ్గుతూండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు ధైర్యం కలిగి ఉండటం చాలా కీలకమైన అంశమన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడే బాధ్యత బార్ అసోసియేషన్‌దేనని చెప్పారు. అత్యున్నత న్యాయస్థానంలో ఆరేళ్ల 10 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన జస్టిస్ ఎస్‌కే కౌల్ ఈ నెల 25న పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టుకు ఈ నెల 18 నుంచి వచ్చే జనవరి 2వ తేదీ వరకు శీతాకాల సెలవులు. దీంతో, శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో సమావేశమైన వీడ్కోలు ధర్మాసనంలో జస్టిస్ కౌల్ మాట్లాడారు. 'సర్వోన్నత న్యాయస్థానం నిర్భయంగా న్యాయాన్ని అందించిన న్యాయ దేవాలయం. ఈ ఒరవడి ఇలాగే కొనసాగాలి'అని ఆయన ఆకాంక్షించారు. పూర్తి సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్.. జస్టిస్ కౌల్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. '70ల్లో నేనూ జస్టిస్ కౌల్ కలిసి కాలేజీకి వెళ్లాం. పుట్టస్వామి గోపత్యా హక్కు కేసు, వైవాహిక సమానత్వ కేసు, తాజాగా ఆర్టికల్ 370 కేసు..ఇలా పలు కేసుల్లో ఇరువురం కలిసి ఇదే వేదికపై నుంచి తీర్పులు వెలువరించడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు. గోప్యతా హక్కు ప్రాథమిక హక్కేనంటూ తీర్పు వెలువరించిన తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ కౌల్ కూడా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ ఇటీవల తీర్పు వెలువరించిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోనూ ఉన్నారు.

1958లో జన్మించిన కౌల్ 1982లో ఢిల్లీ వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా అందుకున్నారు. 1999లో సీనియర్ న్యాయవాది గుర్తింపు పొందారు. 2001లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా, 2003లో శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. 2013లో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2014లో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2017లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

షాహీ ఈద్గాలో సర్వేపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న షాహీ ఈద్గాలో సర్వే చేపట్టాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కోర్టు పర్యవేక్షణలో షాహీ ఈద్గాలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సర్వేను పరిశీలించేందుకు అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించేందుకు కూడా అంగీకరించింది. ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలంటూ శుక్రవారం షాహీ మసీద్ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ ట్రస్ట్ చేసిన వినతిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను పిటిషన్ రూపంలో సవాల్ చేయాలని సూచించింది. దీనితో పాటు దీనిపై ట్రస్ట్ వేసిన మరో పిటిషన్‌పై కూడా జనవరి 9వ తేదీన విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది.

మహిళా జడ్జికి లైంగిక వేధింపులు

గౌరవప్రదంగా చనిపోవాలనుందంటూ సీజేఐకి బాధితురాలి లేఖ

అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరిన జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నారని, అనుమతిస్తే గౌరవప్రదంగా చనిపోతానంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం కలకలం రేపింది. ఈ వ్యవహారాన్ని సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన ఉత్తర్వుల మేరకు..సత్వరమే నివేదిక ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. జిల్లాలోని బారాబంకీలో నియామకం అయిన ఏడాదిన్నర నుంచి తనపై కొనసాగుతున్న వేధింపులను బాధిత జడ్జి రెండు పేజీల లేఖలో ప్రస్తావించారు. 'నాకు ఏమాత్రం జీవించాలని లేదు. ఏడాదిన్నర కాలంలో నన్ను జీవచ్ఛవంలా మార్చారు. నిర్జీవమైన ఈ శరీరాన్ని ఇంకా మోయడం వల్ల ప్రయోజనం లేదు. నా జీవితంలో ఎలాంటి లక్ష్యం లేదు. దయచేసి నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకునేందుకు అనుమతించండి'అని అందులో తెలిపారు. ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధిత జడ్జి గతంలో పెట్టుకున్న పిటిషన్‌పై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, బాధితురాలిపై వేధింపుల అంశం అంతర్గత ఫిర్యాదుల కమిటీ పరిశీలనలో ఉన్నదని, కమిటీ తీర్మానం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నదంటూ ఆ ఫిర్యాదును ధర్మాసనం కొట్టివేసింది. తాజాగా, బాధితురాలి లేఖపై సీజేఐ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుంచి నివేదిక కోరారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ నివేదికపై ఏమేరకు చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ ఆదేశించినట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి.

వీసా లేకున్నా ఇరాన్ వెళ్లొచ్చు

భారత్ సహా 33 దేశాలకు అవకాశం

టెహ్రాన్: ఇరాన్ సందర్శించాలనుకునే భారతీయులకు శుభవార్త. ఇరాన్‌కు వెళ్లేందుకు ఇక వీసా అవసరమే లేదు. విదేశీ పర్యాటకులు, సందర్శకులకు ఆకర్షించేందుకు ఇరాన్ ప్రభుత్వం భారత్ సహా 33 దేశాల వారికి వీసా లేని ప్రయాణాలకు అనుమతులివ్వనున్నట్లు ప్రకటించింది. ఇరాన్ మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశ పర్యాటక మంత్రి ఎజ్జతొల్లా జర్ఘామి ఇటీవల ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. ఇరాన్ వ్యతిరేక ప్రచారానికి చెక్ పెట్టేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు. ఇరాన్ వీసా ఫ్రీ వెసులుబాటు ప్రకటించిన దేశాల్లో భారత్‌తోపాటు రష్యా, యూఏఈ, బహ్రెయిన్, సౌదీ, ఖతార్, కువాయిట్, లెబనాన్, ఉజ్బెకిస్తాన్ తదితరాలున్నాయి. మార్చి 21తో ప్రారంభమైన ఈ ఏడాది మొదటి 8 నెలల్లోనే ఇరాన్‌ను సందర్శించిన విదేశీయుల సంఖ్య 44 లక్షలుగా ఉంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 48.5% ఎక్కువ. భారతీయులు ఇకపై తమ దేశానికి వీసాతో పనిలేకుండా రావొచ్చంటూ ఇటీవలే మలేసియా, శ్రీలంక, వియత్నాం దేశాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

బాలికపై అత్యాచారం కేసు.. యూపీ బీజేపీ ఎమ్మెల్యేకి 25 ఏళ్ల జైలు

సోన్‌భద్ర: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌కు ప్రత్యేక న్యాయస్థానం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, మరో రూ.10 లక్షల జరిమానా విధించింది. దీంతో, శాసనసభ సభ్యత్వానికి ఆయన అర్హత కోల్పోనున్నారు. తొమ్మిదేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఈ నెల 12న కోర్టు విచారణ ముగిసింది. సోన్‌భద్ర అడిషనల్ జడ్జి, ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు సెషన్ జడ్జి అహ్సానుల్లా ఖాన్ తాజాగా తీర్పు వెలువరించారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలి కుటుంబ సంక్షేమం కోసం వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2014లో ఈ ఘటన చోటుచేసుకోగా ఆ సమయంలో రామ్‌దులార్ గోండ్ భార్య గ్రామ సర్పంచిగా ఉన్నారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు మియోర్పూర్ పోలీస్ స్టేషన్‌లో గోండ్‌పై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. మొదట్లో పోక్సో ప్రత్యేక కోర్టులో కేసు విచారణ సాగింది. బీజేపీ తరఫున గోండ్ దుద్ధి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యాక ఈ కేసు ఎంపీ/ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ అయ్యింది.


సీఎంగా ప్రమాణస్వీకారం తర్వాత ప్రధాని మోదీకి శర్మ అభివాదం

రాజస్థాన్ సీఎంగా భజన్‌లాల్ ప్రమాణం

జైపూర్: రాజస్థాన్ నూతన ముఖ్యమంత్రిగా శుక్రవారం భజన్ లాల్ శర్మ బాధ్యతలు చేపట్టారు. ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నాయకత్వం సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)కు భజన్ లాల్ శర్మ చేరుకున్నారు. సీఎం కుర్చీలో ఆయన కూర్చోగానే మాజీ సీఎం వసుంధరా రాజె ఆయన శిరస్సుపై చేయి నుంచి ఆశీర్వదించారు. సీఎం శర్మ లేచి నిలుచుని రాజే సహా అక్కడున్న వారందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ మేఘ్వాల్, కైలాశ్ చౌధరి, రాష్ట్ర నేతలు రాజేంద్ర రాథోడ్, సతీశ్ పునియా కూడా ఉన్నారు. వీరంతా ముఖ్యమంత్రి కుర్చీ కోసం పోటీలో నిలిచిన వారే కావడం విశేషం ఈ నెల 12వ తేదీన జరిగిన పార్టీ శాసనసభా పక్ష సమావేశం మొదటిసారిగా ఎమ్మెల్యే అయిన భజన్‌లాల్ శర్మను తమ నేతగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ప్రమాణం చేసిన దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైరవ కూడా సెక్రటేరియట్‌లోని తమ కార్యాలయాల్లో బాధ్యతలను చేపట్టారు.

జనవరి 10 కల్లా తేల్చండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: శివసేన పార్టీలోని రెండు వర్గాలు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ పెట్టుకున్న పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు సుప్రీంకోర్టు గడువు పెంచింది. గతంలో డిసెంబర్ 31వ తేదీలోగా ఏదో ఒకటి తేల్చాలంటూ ఇచ్చిన గడువును తాజాగా మరో 10 రోజులు పొడిగించింది. 'డిసెంబర్ 20వ తేదీతో అసెంబ్లీ కార్యకలాపాలు ముగుస్తున్నందున, ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేందుకు గడువు పొడిగించాలంటూ స్పీకర్ పెట్టుకున్న వినతిని సహేతుకమైందిగా భావిస్తున్నాం. అందుకే, గడువును మరో 10 రోజులపాటు, వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు పొడిగిస్తున్నాం'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం శుక్రవారం పేర్కొంది.

'మణిపూర్'పై ఏం చర్యలు తీసుకున్నారు: సుప్రీం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ప్రార్థనా స్థలాల రక్షణకు తీసుకున్న చర్యలను తాము ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీకి వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మణిపూర్‌లో ప్రార్థనాస్థలాల పునరుద్ధరణ అంశంపై శుక్రవారం విచారణ చేపట్టింది. వర్గ హింసలో దెబ్బతిన్న, ధ్వంసమైన మత సంబంధ నిర్మాణాలపై రెండు వారాల్లోగా కమిటీకి సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 16 । డిసెంబర్ । 2023

గోరువెచ్చగా.. ఉంటదిచ్చట!





చలి పులి మనుషుల్నే కాదు మూగజీవాలను సైతం గజగజ వణికిస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలోని నెహ్రూ జంతు ప్రదర్శనశాల అధికారులు వన్యప్రాణులు, పక్షులు, సరీసృపాలు చలి ప్రభావం నుంచి గట్టెక్కేలా ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వన్యప్రాణులకు అందించే ఆహారం, పానీయాల్లోనూ మార్పులు చేసినట్లు జంతు ప్రదర్శనశాల డైరెక్టర్ వీఎస్ఎన్వీ ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హకీం పేర్కొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

మెగా చిచ్చు!



కొందరికి మోదం.. ఇంకొందరికి ఖేదం

- ఫార్మా సిటీ రద్దుతో ఆశలు గల్లంతు
- బాధితులకు భూమి అప్పగింతపై సందిగ్ధం
- చర్చనీయాంశంగా ఫార్మాసిటీ రద్దు వ్యవహారం

ఫార్మాసిటీని రద్దు చేసి.. సదరు భూముల్లో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటన గందరగోళానికి తెరలేపింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను వెనక్కి ఇస్తామని ప్రచారం చేసి.. ఆ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారం నిర్వహించేలా టౌన్‌షిప్ ప్రతిపాదనను తెరమీదకు తేవడం సరికొత్త వివాదానికి దారితీసింది. ఫార్మాసిటీ రద్దు ప్రకటన చర్చనీయాంశంగా మారింది. – సాక్షి, రంగారెడ్డిజిల్లా

రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాలకు చెందిన పది గ్రామాల పరిధిలో 19,333 ఎకరాల్లో ముచ్చర్లలో ఫార్మా సిటీని ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఔషధ రంగ సంస్థల దిగ్గజాలతో విహంగ వీక్షణం చేసిన అప్పటి సీఎం కేసీఆర్.. ఫార్మాసిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే వడివడిగా భూ సేకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తి చేశారు. కాగా.. భూ సేకరణలో జరిగిన అవకతవకలు, పరిహారం చెల్లింపులో హేతుబద్ధత లేకపోవడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే 12,300 వేల ఎకరాలను రెవెన్యూ యంత్రాంగం సేకరించి.. టీఎస్ఐఐసీకి బదలాయించింది. అతిత్వరలోనే ప్రాజెక్టుకు భూమి పూజ చేయాలని భావించిన క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. దీంతో కథ అడ్డం తిరిగింది. అధికారంలోకి రావడానికి ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. హామీ మేరకు ఫార్మాను రద్దు చేస్తున్నామని, దాని స్థానంలో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఫార్మా రద్దయిందనే వార్త స్థానిక రైతులకు ఊరటనివ్వగా.. అదే స్థాయిలో నిరాశ కూడా మిగిల్చింది. ఫార్మా కోసం సేకరించిన భూములను వెనక్కి ఇస్తారని ఆశలు పెట్టుకున్నవారికి ఈ స్థలంలో టౌన్‌షిప్ నిర్మిస్తామనే ప్రకటన ఆందోళనకు గురి చేస్తోంది. ఫార్మా సిటీతో ఉపాధి అవకాశాలు వస్తాయని భావించిన నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

ఖర్చుల సంగతేమిటి?

భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 వేల కోట్లకు పైగా ఇక్కడ ఖర్చు చేసింది. ఎస్‌బీఐ రూ.వెయ్యి కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించి రూ.600 కోట్లు విడుదల చేసింది. హడ్కో ద్వారా రూ.740 కోట్లు అప్పు తీసుకుంది. ఫార్మాసిటీలో పలు ఇండస్ట్రీయల్ పార్కుల్లో రూ.1600 కోట్ల పెట్టుబడులు పెట్టేం దుకు దుబాయికి చెందిన కూలింగ్ యుటిలిటీ కంపెనీ తబ్రీడ్ ముందుకొచ్చింది. సంస్థ ప్రతినిధులతో ఎంఓయూ కూడా జరిగింది. కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ) ఏర్పాటుకు కేంద్రం రూ.500 కోట్లు ఇచ్చింది. కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 100 అడుగుల రోడ్డును విస్తరించింది. 48 ఎకరాల్లో రూ.5,809 కోట్లతో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేసింది. 180 ఎకరాల్లో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సహా ఆ పరిసర ప్రాంతాల్లోని 19 గ్రామాల కోసం మేడిపల్లిలో పోలీస్‌స్టేషన్ కోసం ఐదు ఎకరాలు కేటాయించింది. భూ బాధితుల కోసం టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేటలో 600 ఎకరాల్లో వెంచర్‌ను అభివృద్ధి చేసి ఒక్కో ఎకరానికి 121 గజాల చొప్పున బాధితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. మరికొంత మంది ఈ స్థలాల కోసం ఎదురు చూస్తున్నారు. తాజా నిర్ణయంతో ఈ పంపకాల అంశం సందిగ్ధంలో పడింది.

ఆ భూములు రైతులకిచ్చేనా?

ఫార్మాసిటీ కోసం కుర్మిద్ద, మేడిపల్లి రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కొంది. వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని కోర్టులో జమ చేసింది. అయితే భూ సేకరణలో అనేక లోపాలున్నాయని పేర్కొంటూ ఆయా గ్రామాల రైతులు కోర్టును ఆశ్రయించారు. భూసేకరణ చట్టం 2013లోని 15(2),16,18 సెక్షన్లకు విరుద్ధంగా ఈ భూములు సేకరించినట్లు కోర్టు ధ్రువీకరించింది. భూసేకరణ ప్రక్రియను ఇటీవల రద్దు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని 1702 ఎకరాల భూసేకరణ మళ్లీ మొదటి కొచ్చింది. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కనీసం ఈ భూములను రైతులకే తిరిగి అప్పగిస్తుందా? లేక ప్రస్తుత మార్కెట్ మేరకు మళ్లీ సేకరించనుందా? అనే అంశంపై కూడా స్పష్టత లేక పోవడంతో ఆయా రైతుల్లో ఆందోళనకు గురవుతున్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమించి, జైలుకు వెళ్లివచ్చిన వారిపై ఉన్న కేసుల సంగతేమిటనేదీ తేలాల్సి ఉంది.

భౌ..భౌ



ముగ్గురు చిన్నారులపై దాడి.. తీవ్ర గాయాలు

- చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలింపు
- నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు



చిన్నారి సోమశ్రీ (ఫైల్)



మెడపై గాయాలు

నిజాంపేట్: నగరంలో శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు తీవ్ర గాయాల పాలయ్యారు. నిజాంపేట్ బండారి లేఅవుట్ రోడ్ నంబర్ 9లో, దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ శాంతినగర్‌లలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. బాధితుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు.. నిజాంపేట్ బండారి లేవుట్ రోడ్ నంబర్–9లో శ్రీకాంత్, నాగసాయి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి మూడేళ్ల కూతురు సోమశ్రీ ఉంది. శుక్రవారం సాయంత్రం సమయంలో సాగసాయి కూతురు సోమశ్రీని తీసుకుని స్థానికంగా ఉన్న పార్కుకు వెళ్లారు. అక్కడ పిల్లలంతా ఆడుకుంటుండగా సోమశ్రీని కూడా ఆడుకొమ్మని తల్లి వారి వద్దకు తీసుకెళ్లింది. సోమశ్రీ ఆడుకుంటుండగా చిన్నారిపై ఓ వీధికుక్క దాడి చేసింది. ఏకంగా మేడపై దాడి చేయడంతో బాలిక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పార్కులో ఉన్నవారు వెంటనే అప్రమత్తమై వీధికుక్కను అక్కడి నుంచి తరిమివేశారు. గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం నిజాంపేట్‌లోని హోలిస్టిక్ ఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో రోడ్డుపై వెళ్తుండగా..

నిజాంపేట్‌లో బండారి లేవుట్‌లోనే శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో నాగేశ్వర్‌రావు, నూక రత్నం దంపతుల ఆరేళ్ల కుమార్తె శ్యామల రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు. వీధి కుక్కలను కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల విషయంపై పలుమార్లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పిల్లలను బయటకు పంపించాలంటేనే భయమేస్తోందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చిన్న పిల్లలను కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

శాంతినగర్‌లో బాలుడిపై..



చైతన్యపురి: ముగ్గురు చిన్నారులు ఇంటి ఎదుట ఆడుకుంటుండగా వీధి కుక్క వెంట పడి మరీ ఓ బాలుడిపై దాడి చేసింది. దీంతో చిన్నారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ శాంతినగర్ కాలనీలో ముగ్గురు పిల్లలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన వీధికుక్కల గుంపు వీరివైపు రావటం గమనించిన చిన్నారులు ఇంట్లోకి పరుగులు పెట్టారు. వారిని తరుముతూ వచ్చిన ఓ కుక్క బిట్టు అనే ఐదేళ్ల బాలుడిని గాయపరిచింది. ఇంట్లోని వ్యక్తులు వచ్చే సరికి చిన్నారిని వదిలేసి కుక్క పారిపోయింది. వీధికుక్క దాడి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

అయ్యో పాపం!

మూడున్నరేళ్లకే నూరేళ్లు నిండాయి

- స్కూల్ బస్సు చక్రాల కింద నలిగిపోయిన బాలుడు
- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం: కుటుంబ సభ్యుల ఆరోపణ



ప్రణయ్ (ఫైల్)



ఘటన స్థలం వద్ద రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు

కుషాయిగూడ: అప్పటిదాకా అక్క, అన్నయ్యతో సరదాగా ఆడుకుంటూ గడిపిన మూడున్నరేళ్ల బాలుడిని స్కూల్ బస్సు చిదిమేసిన హృదయ విదారక ఘటనతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. చిరునవ్వులతో తమ వెంట ఉన్న చిన్నారి కళ్లెదుటే క్షణాల్లో అసువులు బాయడంతో ఆ ప్రాంతంలో రోదనలు మిన్నంటాయి. శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న నీల మౌనికకు ఇద్దరు కుమారులు హేమంత్ (9), మూడున్నరేళ్ల ప్రణయ్‌తో పాటు కూతురు స్నేహ ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో మౌనిక రెండేళ్లుగా బీఎన్‌రెడ్డి నగర్‌లోని పుట్టింట్లో నివాసం ఉంటోంది. ఇళ్లల్లో పని చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. శుక్రవారం హేమంత్, స్నేహ స్కూల్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో చిన్న కుమారుడు ప్రణయ్‌ను అమ్మమ్మ కనకమ్మ ఇంటి అరుగుపై కూర్చొబెట్టిన తల్లి మౌనిక.. హేమంత్, స్నేహలను స్కూల్ బస్సు ఎక్కించేందుకు వెళ్లింది. అదే సమయంలో ప్రణయ్ అరుగు దిగి రోడ్డుపైకి వచ్చాడు. దీనిని గమనించకుండా డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో ప్రణయ్ ముందు చక్రాల కింద పడి నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. తలపై నుంచి బస్సు వెళ్లడంతో ఆ ప్రాంతమంతా రక్తపు మడుగును తలపించింది. మృతుడి తల్లి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలుడి మేనమామ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రగతి పరుగిడేలా!

హెచ్‌ఎండీఏపై త్వరలో సీఎం సమగ్ర సమీక్ష

- మహానగర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు
- భవిష్యత్ అవసరాల మేరకు విస్తరణ
- సమీక్ష సమావేశానికి అధికారులు సన్నద్ధం



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని అభివృద్ధిలో ఎంతో కీలకమైన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)పై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మహానగర విస్తరణ, అభివృద్ధికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో హెచ్‌ఎండీఏపై సమగ్రమైన సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు సైతం సన్నద్ధమవుతున్నారు.

పూర్తిస్థాయిలో ప్రక్షాళన..

ఏడు జిల్లాల్లో సుమారు 7,200 చదరపు కి.మీ వరకు విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ పరిధిలో టౌన్‌షిప్‌లు, రోడ్లు, రవాణా, లాజిస్టిక్ హబ్స్, డ్రైపోర్టు, మెట్రో పొడిగింపు తదితర మౌలిక సదుపాయాలను విస్తరించి భవిష్యత్‌లో 3 కోట్ల నగర జనాభా అవసరాలకనుగుణంగా హైదరాబాద్ మహానగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ దిశగా హెచ్‌ఎండీఏను పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏకు ప్రత్యేకంగా జాయింట్ కమిషనర్‌ను నియమించింది. హెచ్‌ఎండీఏ చరిత్రలోనే కొత్తగా ఏర్పాటు చేసిన ఈ పదవిని ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి అప్పగించారు. శుక్రవారం ఆమె జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలను చేపట్టారు. ప్రస్తుతం అర్వింద్‌కుమార్ కమిషనర్‌గా కొనసాగుతున్నా.. జాయింట్ కమిషనర్‌కు ముఖ్యమైన బాధ్యతలను అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు హెచ్‌ఎండీఏను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసే అవకాశం కూడా ఉంది. ఈ క్రమంలోనే త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

పెరిగిన ప్రాధాన్యం..

- రాష్ట్ర విభజన నాటికి అలంకారప్రాయ సంస్థగా ఉన్న హెచ్‌ఎండీఏ అంచెలంచెలుగా ఎదిగింది. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అనూహ్యంగా హెచ్‌ఎండీఏ ప్రాధాన్యం పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) పోస్టు విభజనలో భాగంగా ఏపీకి వెళ్లింది. అప్పట్లో ఆ పోస్టు తెలంగాణకు అవసరం లేదని గత ప్రభుత్వం భావించింది. దీంతో టౌన్ ప్లానింగ్ మొదట్లో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అలాగే హెచ్‌ఎండీఏ ప్రాధాన్యతను కూడా పూర్తిగా తగ్గించారు. చిరంజీవులు కమిషనర్‌గా ఉన్న సమయంలో దాదాపుగా హెచ్‌ఎండీఏను రద్దు చేయాలనే ప్రతిపాదన కూడా ముందుకు వచ్చింది. ఈ క్రమంలోనే లే అవుట్‌ల క్రమబద్ధీకరణ వంటి ముఖ్యమైన పనులను ప్రభుత్వం కలెక్టర్‌లకు, మున్సిపాలిటీలకు అప్పగించింది. మరోవైపు ప్రత్యేకంగా డీటీసీపీ లేకపోవడం వల్ల జీహెచ్‌ఎంసీ వంటి సంస్థల్లో విధులు నిర్వహించే ఉన్నతాధికారులే ఇప్పటికీ డీటీసీపీ డైరెక్టర్‌లుగా వ్యవహరిస్తున్నారు.
- గత మూడు నాలుగేళ్లుగా హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్‌సిటీగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల దృష్ట్యా హెచ్‌ఎండీఏ, డీటీసీపీల ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. భారీ లేఅవుట్‌లను ఏర్పాటు చేసి భూములను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించడంలో హెచ్‌ఎండీఏ ప్రధాన సంస్థగా అవతరించింది. కోకాపేట్, బుద్వేల్ వంటి లే అవుట్‌లు జాతీయ, అంతర్జాతీయ రియల్ దిగ్గజాలను సైతం ఆకట్టుకున్నాయి. ఔటర్‌రింగ్ రోడ్డును లీజుకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెట్టింది.మరోవైపు సుమారు 500కు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు హైటెక్ సిటీ కేంద్రంగా నగరానికి పడమటి వైపున విస్తరించి ఉండడంతో హైదరాబాద్ అభివృద్ధి సైతం పూర్తిగా పడమటి వైపే కేంద్రీకృతమై ఉందనే భావన కూడా ఉంది. ఈ క్రమంలోనే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం నగరాన్ని అన్నివైపులా సమంగా అభివృద్ధి చేయాలనే దిశగా దృష్టి సారించింది.

నలువైపులా అభివృద్ధి..

పడమటి హైదరాబాద్‌కు దీటుగా తూర్పు, ఉత్తర, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తేనే రాబోయే రోజుల్లో సుమారు 3 కోట్ల జనాభా అవసరాలకు నగరం సరిపోతుంది. ఈ మేరకు ఇప్పుడు ఉన్న 'గ్రేటర్' పరిధిలోని 'ఔటర్' వరకు పొడిగించాలనే అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ బాధ్యతలు మరింత పెరగనునున్నాయి. టౌన్‌షిప్‌ల కోసం ప్రణాళికలను రూపొందించడం, రోడ్లు, రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయడం, ఒక్క ఎయిర్‌పోర్టు వరకే కాకుండా వివిధ ప్రాంతాల్లో మెట్రో రైలును విస్తరించడం వంటి అనేక ప్రాజెక్టులను హెచ్‌ఎండీఏకు అప్పగించే అవకాశం ఉంది. ఇందుకనుగుణంగా ఆ సంస్థను మరింత బలోపేతం చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ఆమ్రపాలి బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా శుక్రవారం ఆమ్రపాలి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ కార్యదర్శి చంద్రయ్య, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి. ప్రభాకర్, ఎస్టేట్ ఆఫీసర్ కిషన్ రావు, ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్, లీగల్ స్పెషలిస్ట్ యశస్వి సింగ్‌లతో పాటు హెచ్‌ఎండీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగుల సహకారంతో మరిన్ని కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు చేసే అవకాశం ప్రభుత్వం తనకు కల్పించిందన్నారు. అనంతరం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గానూ ఆమె బాధ్యతలను స్వీకరించి కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు.



ప్రజా భవన్ ఎదుట రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు

దరఖాస్తుల దారిలో..

కిటకిటలాడిన ప్రజాభవన్



క్యూలోనే కూర్చుని టిఫిన్ చేస్తున్న వృద్ధురాలు



46 జీఓను రద్దు చేయాలంటూ ప్లకార్డుల ప్రదర్శన

సమస్యలను ఏకరువు పెట్టుకునేందుకు నగరంలోని ప్రజా భవన్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి అర్జీదారులు బారులు తీరుతున్నారు. శుక్రవారం ప్రజావాణిలో దరఖాస్తులను సమర్పించేందుకు ప్రజలు వేలాదిగా తరలిరావడంతో ప్రజాభవన్ సమీపంలోని రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కొందరు క్యూలైన్‌లోనే అల్పాహారం తీసుకున్నారు. సందట్లో సడేమియా వలే ఇక్కడ దరఖాస్తులను రాసేందుకు కొందరు తెల్ల కాగితాలను సైతం విక్రయించారు. మొత్తానికి శుక్రవారం గ్రీన్ హిల్స్‌లోని ప్రజాభవన్ వేలాది మంది అర్జీదారులతో కిటకిటలాడుతూ కనిపించింది.



దరఖాస్తు పత్రం రాస్తున్న మహిళ



తెల్ల కాగితాలను విక్రయిస్తున్న ఓ వ్యక్తి..

ఏడేళ్లకే పోలీసయ్యాడు!

బాలుడి కోరికను తీర్చిన 'మేక్ ఎ విష్' ఫౌండేషన్



ఈ చిట్టి పోలీసును చూశారుగా. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జకీర్ హుస్సేన్‌తో ఏదో కేసు గురించి సీరియస్‌గా చర్చిస్తున్నట్లు కనిపిస్తున్నాడు కదూ. ఇతడి పేరు మోహన్‌సాయి. వయసు ఏడేళ్లు మాత్రమే. కానీ పోలీసయ్యాడు. తన చిరకాల కోరికను ఇలా తీర్చుకున్నాడు. ఆసక్తికరమైన ఆ వివరాల్లోకి ఒకసారి వెళ్దామా.. ఏపీలోని గుంటూరుకు చెందిన బ్రహ్మం, లక్ష్మి దంపతులకు ఏడేళ్ల కుమారుడు మోహన్‌సాయి ఉన్నాడు. నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడు కేన్సర్ బారిన పడ్డాడు. నగరంలోని బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఏడాది కాలంగా కుమారుడికి తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. తనకు పోలీస్ కావాలని ఉందంటూ తల్లిదండ్రులకు చెబుతుండేవాడు. మోహన్‌సాయి పరిస్థితి చూసి వారి మనసు చలించేది. కన్నీటి పర్యంతమయ్యేవారు. మోహన్‌సాయి కోరికను ఆస్పత్రి సిబ్బంది ద్వారా తెలుసుకున్న 'మేక్ ఎ విష్' ఫౌండేషన్ ప్రతినిధులు బంజారాహిల్స్ పోలీసులను కలిశారు. మోహన్‌సాయి అభిలాషను తీర్చేందుకు వారు అంగీకరించడంతో శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీస్ యూనిఫాంలో స్టేషన్‌లోకి అడుగుపెట్టిన మోహన్‌సాయికి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జకీర్ హుస్సేన్ సెల్యూట్ కొట్టి స్టేషన్‌లోకి తీసుకువెళ్లారు. బాలుడిని తన సీట్లో కూర్చోబెట్టి ఠాణా పని తీరుపై ఆయన వివరించారు. – బంజారాహిల్స్



జీరో టికెట్ షురూ

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో వారం రోజులుగా ఎలాంటి గుర్తింపు పత్రం లేకుండానే అనుమతించారు. శుక్రవారం నుంచి ఆధార్, ఓటర్ ఐడీ, నివాస ధ్రువీకరణ తదితర పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మహిళా ప్రయాణికులకు బస్సు కండక్టర్లు జీరో టికెట్‌ను ఇవ్వడం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలనుకునే మహిళలు తెలంగాణ ప్రాంతానికి చెందినవారిగా ఏదైనా గుర్తింపు పత్రం చూపించడం తప్పనిసరి అని కండక్టర్లు స్పష్టం చేశారు.




ఆటోడ్రైవర్లకు ఉపాధి చూపాలి

- జీఎంఎస్ ఆటో యూనియన్ నేతల డిమాండ్
- నేటి నుంచి ఉద్యమబాట పడుతున్నట్లు వెల్లడి

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని, ఆటో డ్రైవర్ల ఉపాధిని ప్రభుత్వం కాపాడాలని బీఎంఎస్ ఆటో యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం నుంచి ఈ మేరకు ఉద్యమబాట పట్టనున్నట్లు తెలంగాణ స్టేట్ ఆటో, టాక్సీ డ్రైవర్స్ యూనియన్ నేతలు ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ శ్రమశక్తిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎంఎస్ జాతీయ కార్యదర్శి అల్లూరి రవిశంకర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందకిషోర్, బి.పెంటయ్య గౌడ్‌లు మాట్లాడుతూ రోజువారీ ఆదాయం పడిపోయి ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోల్లో ప్రయాణించే వారిలో 70 శాతం మంది మహిళలేనని,



సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి రవిశంకర్, నందకిశోర్ తదితరులు

ఉచిత బస్సు ప్రయాణం వల్ల వారంతా బస్సులనే ఆశ్రయిస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం రద్దు చేయకపోతే ఆటోడ్రైవర్లకు రోజూ వెయ్యి రూపాయలు సంపాదించుకునేలా ప్రభుత్వమే తగు ప్రణాళిక రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలు, మండలాలు, నగరాల్లో శనివారం నుంచి ఉద్యమం నిర్వహిస్తున్నామని అందులో భాగంగా 16, 17 తేదీలలో ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇవ్వడం , 18న మండల కేంద్రాలలో ధర్నా, 19న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వడం, 20న ఆర్టీసీ డిపో మేనేజర్లకు వినతిపత్రాలు ఇవ్వడం, 21న జిల్లా కేంద్రాలలో ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సంఘాలతో చర్చించి పరిష్కారం కనుగొనకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, కిషన్, హబీబ్, సమ్మయ్య యాదవ్, ఇ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ అరెస్ట్

అధిక లాభాల పేరుతో రూ.23 కోట్లు వసూళ్లు

సాక్షి, సిటీబ్యూరో: తమ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలిస్తామంటూ నమ్మించి 29 మంది నుంచి రూ.23.5 కోట్లు వసూలు చేసి భారీ మోసానికి పాల్పడ్డ వీఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ నన్ననూర్ రాజేష్‌ను సీసీఎస్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం..వరంగల్ జిల్లా నర్సంపేట్‌కు చెందిన రాజేష్ హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడలో నివాసముంటున్నాడు. వీఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా రెస్టారెంట్స్ ఏర్పాటు చేశాడు. తమ సంస్థలో పెట్టుబడిపెడితే 24 నుంచి 27 శాతం సంవత్సరానికి లాభాలిస్తానంటూ నమ్మించి పలువురి నుంచి డబ్బులు సేకరించాడు. ఆ తర్వాత స్పందించకపోవడంతో బాధితులు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ బిక్షపతి బృందం దర్యాప్తు జరిపింది. నిందితుడు రాజేష్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచ రూ.23 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

అవయవదానం చేసే వారు ఆదర్శప్రాయులు: గవర్నర్



వైట్ కోట్ సెర్మనీకి హాజరైన గవర్నర్

అమీర్‌పేట: అవయవదానం చేసే వారు ఆదర్శప్రాయులని, అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. శుక్రవారం సనత్‌నగర్ ఈఎస్ఐ వైద్య కళాశాలలో జరిగిన అవయ దాతల సన్మానం, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు జరిగిన వైట్ కోట్ సెర్మనీకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరణానంతరం శరీర అవయవాలను మట్టిలో కలిసి పోకుండా..అవి అవసరమైన వారికి అందజేయడం గొప్ప విషయమన్నారు. తాను వైద్య విద్యార్థిగా ఉన్న సమయంలోని అనుభవాలను ఇక్కడి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక, కళాశాల డీన్ డాక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల గొంతుకగా ఉంటా: మంత్రి పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

నాంపల్లి: బడుగు బలహీన వర్గాల గొంతుకగా ఎప్పటికీ ఉంటానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో శాసనసభ్యులుగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం, పీసీసీ కల్లుగీత సెల్ విభాగం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం తెలుగువిశ్వవిద్యాలయంలో సత్కరించారు. గౌడ సంఘం అధ్యక్షులు నాగరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ...బీసీలు సంఘటితం కావాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల అమలుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, మాజీ ఎమ్మెల్యే రాజలింగం, గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ రాజకీయాలు దేశానికి చేటు



హిమాయత్‌నగర్: బీజేపీ తన మతతత్వ విష రాజకీయాలతో భారతదేశాన్ని చీకటి యుగంలోకి నెట్టిందని, దేశంలో స్వేచ్ఛ కరువై అశాంతి, అసహనం పెరిగిపోయాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ, విభజన రాజకీయాలు దేశానికి ప్రమాదకరమన్నారు. హిమాయత్‌నగర్ మఖ్దూమ్ భవన్‌లో శుక్రవారం తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన కూనంనేని సాంబశివరావును సన్మానించారు. ఈ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.పల్లేరు వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభ్యుదయ భావాలూ, ప్రజాసాహిత్య వ్యాప్తికి కవులు, రచయితలు కృషి చేసి సమాజ ప్రగతికి దోహదపడాలని కోరారు. అనంతరం డా.వీరాస్వామి, రాపోలు సుదర్శన్, సంఘం ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, నిధి, కార్యనిర్వాహక కార్యదర్శి కేపీఎల్, కార్యదర్శులు డి.కమలారెడ్డి, మద్దిలేటి, కార్యనిర్వాహక సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, వై.పాండురంగా రెడ్డి, అటుకుల రాజు, బి.మహేందర్ గౌడ్ తదితరులు కూనంనేని సాంబశివ రావును శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు పర్యావరణ అవార్డు

రాయదుర్గం: పర్యావరణ కాలుష్య నివారణ సదస్సులో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఉత్తమ పేపర్ ప్రజెంటేషన్ అవార్డును గెలుచుకుంది. భవన నిర్మాణం చేస్తున్నప్పుడు ఏర్పడే కాలుష్యంపై ట్రిపుల్‌ఐటీ బృందం అధ్యయనం చేసి సమర్పించిన పేపర్ ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఇటీవల 'పర్యావరణ కాలుష్యం-నివారణ'పై జరిగిన 11వ అంతర్జాతీయ సదస్సు-2023లో 'కంపారిటివ్ అనాలిసిస్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ రిలేటెడ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ ఇండోర్ అండ్ అవుట్‌డోర్ ఎన్విరాన్‌మెంట్స్' అనే అంశంపై రూపొందించిన పరిశోధనా పత్రాన్ని ట్రిపుల్ ఐటీ బృందం ప్రదర్శించింది. దీన్ని పరిశీలించి అవార్డుకు ఎంపిక చేశారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ సచిన్ చౌదరి, ప్రొఫెసర్ కవిత ఆధ్వర్యంలోని బృందం ఈ పరిశోధనా పత్రాన్ని అంతర్జాతీయ సదస్సులో సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

భార్యకు తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... కొత్తగూడ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ అమీన్ అహ్మద్(42) తన భార్య అరాఫత్ జహాన్‌తో కలిసి శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో అతివేగంతో వచ్చిన బైక్ (ఏపీ11బీ8599) ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన అమీన్ అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అరాఫత్ జహాన్‌ను కేర్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు మృతుడి సోదరుడు అఖిల్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 304(ఏ),337 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్తతో గొడవ..భార్య ఆత్మహత్య

మల్లాపూర్: భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన రేణు రాణి కునల్ (36, జంగ భడూ కునల్ భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకుదెరువు కోసం మల్లాపూర్ భవానీ నగర్‌కు వచ్చారు. భర్త జంగ భడూ కునల్‌తో శుక్రవారం గొడవ జరిగింది. దీంతో పాపని పాఠశాలకు తీసుకు వెళ్లిన సమయంలో రేణు ఇంటి తలుపులు పెట్టుకుని..ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభినందనలు



డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను ఆయన నివాసంలో శుక్రవారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి అధ్యక్షుడు సుధాకర్ కలిసి అభినందనలు తెలిపారు. శాలువా కప్పి..జ్ఞాపికను అందచేశారు. - సాక్షి, సిటీబ్యూరో

చోరీ చేస్తారు..తుక్కుగా అమ్మేస్తారు!

ఇరువుర్ని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఓ దొంగ ద్విచక్ర వాహనాలను తస్కరించుకు వస్తాడు..దీన్ని అతి తక్కువ ధరకు ఖరీదు చేసే బైక్ మెకానిక్ విడి భాగాలుగా మారుస్తాడు...ఆనక తుక్కుగా, స్పేర్ పార్ట్స్‌గా విక్రయించి సొమ్ము చేసుకుంటాడు. ఈ పంథాలో వరుస నేరాలు చేస్తున్న ద్వయాన్ని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ నితిక పంత్ శుక్రవారం వెల్లడించారు. వరంగల్‌కు చెందిన కె.కోటి అలియాస్ ఈశ్వర్ బతుకుతెరువు కోసం నగరానికి వలసవచ్చాడు. జియాగూడ ప్రాంతంలో నివసిస్తూ కూలీగా పని చేస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వాహన చోరీలు మొదలెట్టాడు. చోరీ చేసిన వాహనాలు విక్రయించే క్రమంలో ఇతడికి హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ యూసుఫ్‌తో పరిచయమైంది. ఇలా ఇద్దరూ ముఠాగా ఏర్పడి నేరాలు చేయాలని నిర్ణయించుకున్నారు. నగరంలో రాత్రి వేళల్లో సంచరించే కోటి మారుమూల ప్రాంతాల్లోని వాహనాలు చోరీ చేసుకుని తీసుకువచ్చే వాడు. యూసుఫ్ తన దుకాణంలో వీటిని విడి భాగాలుగా మార్చేవాడు. పనికి వచ్చేవి ఎంపిక చేసి తన వద్ద మరమ్మతుల కోసం వచ్చే ఇతర వాహనాలు వేసి సొమ్ము చేసుకునేవాడు. మిగిలినవి తుక్కుగా అమ్మేసేవాడు. ఇలా ఒక్కో వాహనంపై రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఆర్జించే యూసుఫ్ కోటికి మాత్రం కేవలం రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ఇచ్చేవాడు. ఈ ద్వయం వ్యవహారాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్, ఎస్సైలు ఎస్.సాయికిరణ్, సీహెచ్ నవీన్‌కుమార్ తమ బృందంతో వలపన్ని ఇరువురినీ అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం మాసబ్‌ట్యాంక్ పోలీసులకు అప్పగించారు.

ఆవ నూనెతో ఆరోగ్యం

సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ భారతీయ రుచులకు ఆవ నూనె ఆరోగ్యకరమని హైదరాబాద్ జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆవాల నూనె పాక శాస్త్ర వైవిధ్యత, ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుందన్నారు. వంటకాలలో దాని సువాసన, ఆచారాలు, ఔషధ పద్ధతుల్లో బహుముఖ పాత్రతో పాటు భారతీయ సంస్కృతిలో ఆవ నూనె శాశ్వత ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు 'ఫ్రీడమ్ కచ్చి ఘనీ మస్టర్డ్ ఆయిల్'ను అందిస్తున్నామని పేర్కొన్నారు. భగవత్ ఆరాధన సమయంలో ఆవ నూనెను సమర్పణగా ఉపయోగిస్తారన్నారు. దీపావళి వంటి పండుగల సమయంలోనూ వినియోగిస్తారన్నారు. గృహాలను ప్రకాశింపజేసే ఆవ నూనె శుభం, స్వచ్ఛతను సూచిస్తుందని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, నల్ల వంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చి మిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 55, పచ్చి కాకరకాయ 55, పందిరిబీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండకాయ 45, గుండు బీన్స్ 55, గింజచిక్కుడు 70, గోకరకాయ 55, కీర 21, దోసకాయ 25, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 50, గుమ్మడికాయ 13, క్యాలీ ఫ్లవర్ 18, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4-6, ఉల్లిపా రక 33 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


సుదర్శన్‌రావు

బంజారాహిల్స్: తెలంగాణ తొలి, మలి ఉద్యమ కారుల సంక్షేమం, ప్రయోజనాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ, 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రధాన కార్యదర్శి దుశర్ల సుదర్శన్ రావు కోరారు. జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుమారు మూడు వేల మంది ఉద్యమ కారులు ఉన్నారని వీరి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్పొరేషన్ చైర్మన్ గా తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తాను 1965 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వున్నానని ఇప్పటి వరకు ఎన్నో పదవులు కాంగ్రెస్ లో అంకిత భావంతో నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యమ కారులకు న్యాయం చేసే అవకా శం కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. తాను ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న విషయం తెలిసిందే అన్నారు.

రివాజ్ ఫ్యాషన్ డిజైనర్ ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్లో శుక్రవారం రివాజ్ లైఫ్ స్టయిల్ ఫ్యాషన్ ఎక్సిబిషన్ ప్రారంభమైంది. ఈ నెల17వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుంది. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాత డిజైన్లు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి.

ఉదయ్‌నగర్ పాఠశాల సమస్యకు కానరాని పరిష్కారం
ఏళ్లు గడుస్తున్నా కమ్యూనిటీ హాల్‌లోనే కొనసాగుతున్న వైనం

పాఠశాల.. కమ్యూనిటీ హాల్‌ను వీడేనా..?

- బస్తీవాసులు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్, సింగాడి కుంట బస్తీల్లో ప్రభుత్వ పాఠశాల సమస్య ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదయ్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావించిన బస్తీవాసులకు నిరాశే ఎదురైంది. ఈ సారి కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇక్కడ స్థానికంగా ఉన్న పాఠశాల, కమ్యూనిటీ హాల్ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు.

- అంబేడ్కర్‌నగర్, ఉదయ్‌నగర్, సింగాడికుంట ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన దినసరి కూలీలు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటారు. వారి పిల్లలు చదువుకు దూరమవుతుండటంతో కొన్ని సంవత్సరాలపాటు స్వచ్ఛంద సంస్థలు వారికి విద్యాబుద్ధులు నేర్పించారు.
- అయిదేళ్ల క్రితం ఇక్కడ పాఠశాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను సంప్రదించారు. అధికారులు వెంటనే ప్రాథమిక పాఠశాలను ఉదయ్‌నగర్ బస్తీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు మార్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 300 మంది విద్యార్థులతో ఈ పాఠశాల నడుస్తున్నది.
- ఈ పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఫర్నిచర్‌తో పాటు ఒకరిద్దరు ప్రైవేట్ సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు.

కమ్యూనిటీ హాల్ కావాలంటూ బస్తీవాసుల ఆందోళన...

- గుడిని ఆనుకొని ఉన్న కమ్యూనిటీ హాల్ మాత్రమే ఉదయ్‌నగర్ బస్తీవాసులకు దిక్కు. బస్తీలో ఎవరి ఇంట్లో శుభ కార్యం జరిగినా, సభలు, సమావేశాలు అన్నీ ఈ కమ్యూనిటీ హాల్‌లోనే బస్తీవాసులు గతంలో నిర్వహించుకునేవారు.
- ప్రస్తుతం ఈ కమ్యూనిటీ హాల్‌ను పాఠశాలకు అప్పగించడంతో బస్తీవాసులు తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే ఈ పాఠశాలను కమ్యూనిటీ హాల్ నుంచి తరలించాలంటూ ఎమ్మెల్యే దానంకు, గ్రేటర్ మేయర్ విజయలక్ష్మికి పలుమార్లు వినతులు అందించారు. బస్తీలో చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని ఏదో ఒక స్థలాన్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని వారు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం


తరగతి గది సరిపోనందున ఆరుబయటే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

సమస్యల వలయంలో...

- ఈ కమ్యూనిటీ హాల్‌లో ఒకే ఒక్క పెద్ద హాల్ ఉంది. దీంతో ఈ హాల్‌ను పార్టీషన్లుగా చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5 తరగతుల వరకు ఇక్కడ తరగతులు నడుస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.
- 300 మంది చదువుకునే ఈ పాఠశాలలో రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరో వైపు తరగతులు కూడా సరిపోకపోవడంతో ఆరుబయట విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ మధ్య అదనంగా రెండు మరుగుదొడ్లను కట్టేందుకు పాఠశాల సిబ్బంది ప్రయత్నించగా బస్తీవాసులు అడ్డుకున్నారు.
- పాఠశాల పైన అయ్యప్ప స్వాములు ఉండేందుకు ఒక షెడ్డును నిర్మించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎర్రమంజిల్ స్కూల్ రోడ్డులో ఎన్ని కష్టాలో?

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రి విస్తరణలో భాగంగా నిర్మాణ పనులను చేపట్టడంతో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల చుట్టూ రహదారులను మొత్తం మూసేయడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రామకృష్ణానగర్, ఎర్రమంజిల్, బాలాపుర బస్తీలకు చెందిన విద్యార్థులు తాము చదివే పాఠశాలకు రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. నిమ్స్ విస్తరణ పనుల కారణంగా అన్ని దారులను మూసేయగా కేవలం బాలాపుర బస్తీ వైపు మాత్రమే దారిని వదిలి పెట్టారు.

◆ నిమ్స్‌కు వచ్చే కార్లు, దీని చుట్టూ పార్క్ చేయడానికి ఈ దారిని వదలడంతో విద్యార్థులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను ఈ విషయంపై ప్రశ్నించినా పట్టించుకోవడం లేదని, వెంటనే రోడ్డు సమస్యలను పరిష్కరించాలని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సోమాద్రి రామ్మూర్తి డిమాండ్ చేశారు. నాలుగు సార్లు డైరెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా నిరాకరించారని ఆరోపించారు. 2008లో ఎర్రమంజిల్ కాలనీలో ఉన్న స్థలంలోనే స్కూల్ నిర్మిస్తామని నిమ్స్ యాజమాన్యం మానవ హక్కుల కమిషన్‌కు లేఖ సైతం ఇచ్చిందన్నారు. అయితే తాజాగా స్కూల్‌ను కబళించేందుకు ప్రయత్నాలు జరుగుతన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఆర్ అండ్ బీ అధికారులు కూడా పాఠశాలకు నష్టం కలిగించబోమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ పాఠశాలలో అనేక మంది పేద విద్యార్థులు చదువుతున్నారని, వీరందరికీ సరైన దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టీచర్లు సైతం రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఎర్రమంజిల్ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు నాశనం కాకుండా చూడాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా వాహనాలలో తీసుకురాలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశారు.


ఎర్రమంజిల్ పాఠశాల చుట్టూ నిర్మించిన బ్లూషీట్స్

బీసీల సమస్యలు పరిష్కరించాలని వినతి


భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్ యాదవ్

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బీసీ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని తెలిపారు. బీసీ గ్రాడ్యుయేట్లు, డిగ్రీ విద్యార్థులకు జీఆర్‌ఈ, బ్యాంకింగ్ కోసం ఉచిత కోచింగ్ అందించి, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ రూ. 15 వేల కోట్లకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సుల స్కాలర్షిప్‌లను రూ. 5 వేల నుంచి రూ 25 వేల వరకు పెంచాలని కోరారు. రాజేశ్వర్ యాదవ్‌తో పాటు పూసల సత్యనారాయణ, లక్ష్మయ్య, నగేష్, సాయి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

బంజారాహిల్స్: కష్ట సమయంలో దేశ సమగ్రత కోసం పాటు పడిన మహనీయుడు, తన ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఐక్యంగా చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు అన్నారు. మాజీ భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ వర్థంతి సందర్భంగా ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మామిడి నర్సింగరావు పాల్గొని పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. జాతికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బస్తీ సంక్షేమ సంఘం నాయకులతో పాటు ఆకుల రాజు, బాలస్వామి, కాటూరి రమేష్, బసవరాజు, మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలకు మరమ్మతులు


ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్‌లో గుంతలను పూడ్చుతున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి వద్ద గుంతలమయమైన రోడ్డుకు శుక్రవారం జీహెచ్ఎంసీ ఇంజినీర్ విభాగం మరమ్మతులు చేపట్టింది. కొంతకాలంగా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న జీహెచ్ఎంసీ ఇంజినీర్లు రోడ్లపై దృష్టి సారించకపోవడంతో ఎక్కడికక్కడ రోడ్లు గుంతలమయమై వాహనదారులకు నరకం చూపించాయి. గుంతల మయమైన రాహదారుల విషయంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రహదారులపై గుంతలు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం కూడా ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన ఇంజినీర్లు శుక్రవారం పలు చోట్ల బీటీతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు.

ఆకట్టుకున్న ఛాయాచిత్ర ప్రదర్శన





సాక్షి, సిటీబ్యూరో: కెమెరా క్లిక్ మనిపించేవాళ్లు ఎందరో... కన్నార్పనివ్వని ఛాయాచిత్రాలు ఆవిష్కరించేవారు కొందరే... అలాంటి సృజనాత్మక ఫొటోగ్రఫీకి అద్దం పట్టిన ఫొటోగ్రఫీ షో ఎంతగానో ఆకట్టుకుంది. నగరానికి చెందిన హామ్ స్టెక్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నాగార్జున హిల్స్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శనలో నగరానికి చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కెమెరాకి పనిచెప్పి విభిన్నమైన రీతిలో వీరు అందించిన ఫొటోలు అబ్బురపరిచగా కొన్ని బహుమతులు సైతం గెల్చుకున్నాయి. హామ్ స్టెక్ నిర్వాహకులు అజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు

'సొసైటీ స్థలం కోర్టు కేసులో ఉంది'

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లోని వాటర్ వర్క్స్ రిజర్వాయర్ పక్కన రాధికా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థల వ్యవహారం న్యాయస్థానంలో ఉన్నదని, ఈ స్థలాన్ని ఎవరికీ కేటాయించడానికి రెవెన్యూ అధికారులకు అధికారం లేదని సొసైటీ అధ్యక్షుడు తిలక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తమకు చెందిన ఈ స్థలంపై యథాతథ స్థితిని కొనసాగించాలని గతంలోనే హైదరబాద్ కలెక్టర్ జలమండలి అధికారులకు అధికారికంగా లేఖ కూడా రాశారన్నారు. ఇటీవలే ఈ స్థలంలో కొంత భాగాన్ని జలమండలికి కేటాయించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తున్నదని, అలా జరిగితే తాము కోర్టు ధిక్కరణ కేసు వేస్తామన్నారు. ఇది పూర్తిగా రాధిక కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థలమని, వీరికి సభ్యులు కూడా ఉన్నారని వెల్లడించారు. స్థలంలోకి అక్రమంగా ప్రవేశించినా కూడా నేరమే అవుతుందన్నారు. షేక్‌పేట్ మండల రెవెన్యూ అధికారులు, జలమండలి అధికారులు కలెక్టర్ ఇచ్చిన లేఖను పరిశీలించుకోవచ్చన్నారు.

మింట్ కాంపౌండ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ఖైరతాబాద్: సచివాలయం నార్త్ ఈస్ట్ గేట్ నుంచి మింట్ కాంపౌండ్ మీదుగా ఉన్న రోడ్డులో అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. వారం రోజుల్లో మింట్ కాంపౌండ్ రోడ్డులో రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎన్.బి.రత్నం తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏసీపీ ఆధ్వర్యంలో సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ వై.రాజశేఖర్ నేతృత్వంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. సచివాలయం నార్త్ ఈస్ట్ గేట్ నుంచి మింట్ కంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపునకు వెళ్లే రోడ్డు మార్గంలో ఆక్రమణలు, వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌ను వారం రోజుల్లో పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. మొదటి రోజు రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన వాహనాలను, వ్యాపారుల వాహనాలను తొలగించారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన


సదస్సులో పాల్గొన్న సాయి భాస్కర్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో శుక్రవారం జియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఎన్ ఇంటర్ డిసిప్లనరీ అప్రోచెస్ ఆఫ్ జియో సైన్సెస్' పేరుతో రోజు సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ కన్సల్టెంట్ ఆన్ క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సాయి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పర్యావరణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వర్‌రెడ్డి, సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మణ్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, కన్వీనర్ డాక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇలాంట సదస్సులు నిర్వహించడం అభినందనీయమని వక్తలు అభిప్రాం వ్యక్తం చేశారు. దీనివల్ల జియాలజీ ప్రాముఖ్యత, నైపుణ్యాలు, అవకాశాల గురించి విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. విద్యార్థులకు భవిష్యత్తు అవకాశాలతో పాటు విశ్లేషణ, నైపుణ్యం పరిశోధన ప్రాముఖ్యత అర్థం అవుతుందన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం


కేక్ కట్ చేస్తున్న భవానీశంకర్, కృపాసన్నిధి

రహమత్‌నగర్: ప్రభువైన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికీ అనుసరణీయమైనవని ప్రముఖ దైవ సందేశకులు బెరెకామినిస్ట్రీస్ చైర్మన్, రెవరెండ్ పి.జాషువ అన్నారు. క్రీస్తు బోధించిన శాంతి, కరుణ, ప్రేమలతో ప్రపచంం శాంతిమయం అవుతుందని తెలిపారు. ట్రినిటీ గాస్పెల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్రహ్మశంకనగర్‌లో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాంతియుత సమాజం నిర్మాణం కోసం ఏసుక్రీస్తు తన జీవితాన్నే అర్పించారన్నారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ మాట్లాడుతూ... క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి, పాస్టర్లకు కానుకలను అందజేశారు. మినిస్ట్రీస్ చైర్మన్ రెవరెండ్ టి.కృపాసన్నిధి, పాస్టర్ చిన్నారావు, పాస్టర్ ముఖేష్, జాన్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తేవాలి


ప్రత్యేక చట్టం తేవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గృహ నిర్మాణ కార్మికులు

పంజగుట్ట: తెలంగాణలో ఉన్న సుమారు 11 లక్షల మంది గృహ కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు వారికి సరైన చట్టం తీసుకురావాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వర్గీస్ తెకనాథ్, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ... హైదరాబాద్‌లోనే ఐదు లక్షల మంది, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఆరు లక్షల మంది గృహ నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. వారిని కార్మికులుగా గుర్తించేందుకు, వారి హక్కులను రక్షించేందుకు ఎలాంటి చట్టం లేదన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఏడు జిల్లాలకు చెందిన ఆరు వందల మంది యూనియన్ ప్రతినిధులు సమావేశమై గృహకార్మికుల పరిస్థితులు, యజమానుల నమోదు, గుర్తింపు కార్డుల జారీ, త్రైపాక్షిక సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర అంశాలను చట్టంలో చేర్చాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, కేరళ, ఒడిశా, తమిళనాడు లాంటి రాష్ట్రాలు గృహ కార్మికులకు చట్టలు చేసేందుకు సిద్ధం అవుతున్నాయని వాటి అన్నింటికన్నా ముందు తెలంగాణ రాష్ట్రం చేస్తే మొదటి రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షురాలు పి.మాధవి, వి.మంజుల, ఉష, మేరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో చోరీ

వెంగళరావునగర్: యువకులు నిద్రిస్తున్న గదిలో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జనగాం ప్రాంతానికి చెందిన రమాకాంత్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడలోని అలీనగర్‌లో తన స్నేహితుడు రణధీర్‌తో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున తాము ఉంటున్న గది తలుపులు తీసి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆ గదిలోకి ప్రవేశించాడు. రెండు సెల్‌ఫోన్లు, రూ. 50 వేల నగదు దొంగిలించుకుని వెళ్లాడు. ఉదయం లేచి చూడగా తమ ఫోన్లు, నగదు కనిపించలేదు. హుటాహుటిన బాధితులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఓ నిందితుడు తమ గదిలో నుంచి నగదు, ఫోన్లు తీసుకుని వెళ్తున్న దృశ్యం కనిపించింది. ఈ మేరకు బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అకారణంగా వ్యక్తిపై దాడి: పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో ఉంటున్న పి.రాంబాబు గురువారం రాత్రి రహమత్‌నగర్ చౌరస్తాలోని ఓ కిరాణా దుకాణం వద్ద నిలబడి ఉన్నాడు. ఇంతలో మహేష్ అనే యువకుడు అక్కడు వచ్చి రాంబాబుతో గొడవ పెట్టుకున్నాడు. సమీపంలో ఉన్న కొబ్బరికాయ చిప్పతో రాంబాబు తలపై కొట్టాడు. దాంతో అతని తలపై గాయాలయ్యాయి. క్షతగాత్రుడు చికిత్స అనంతరం శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు పట్టాలపై పడుకొని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు పట్టాలపై పడుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... జామై ఉస్మానియా-విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (40) పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలి రంగు ఫుల్ షర్టు, అదే రంగు జీన్స్ ప్యాంట్ ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శక ఓటరు జాబితాను రూపొందిద్దాం



మాట్లాడుతున్న ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారిణి ప్రశాంతి

ఖైరతాబాద్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ కొత్తగా ఓటర్లుగా చేర్చాలని ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారిణి ప్రశాంతి సూచించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ) సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తాజా ఓటరు జాబితాను తీసుకొని ప్రతి ఓటర్ వద్దకు వెళ్లాలని సూచించారు. మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని, ఒకరికి రెండు చోట్ల ఓటు ఉంటే వెంటనే గుర్తించి ఒక చోట తొలగించాలని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సారి మరింత పకడ్బందీగా ఓటర్ జాబితాను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ దగ్గరికి వెళ్తేనే వాస్తవ విషయాలు తెలుస్తాయని, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు పర్యటించాలన్నారు.

యాచకుల బెడద మళ్లీ షురూ


బంజారాహిల్స్ కేబీఆర్‌పార్కు మొదటి పార్కింగ్ స్థలంలో యాచకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో యాచకుల బెడద తీవ్రంగా ఉందని అయిదు నెలల క్రితం ఇక్కడ వాకింగ్ చేస్తున్న ఓ అధికారి ట్వీట్ చేశారు. దీంతో స్పందించిన సర్కిల్-18 జీహెచ్ఎంసీ అధికారులు నాలుగు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి కేబీఆర్ చౌరస్తాతో పాటు జూబ్లీహిల్స్ చౌరస్తా, పంజగుట్ట, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో 80 మందికి పైగా యాచకులను గుర్తించి జీహెచ్ఎంసీ షెల్టర్ హోమ్స్‌కు తరలించారు. పట్టుమని పది రోజులు కూడా యాచకులు ఈ హోమ్స్‌లో ఉండలేదు. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకంతో హోమ్స్ నుంచి ఒక్కొక్కరుగా యాచకులు మళ్లీ రోడ్డున పడ్డారు. మూడు నెలల నుంచి జీహెచ్ఎంసీ అధికారులు సంబంధిత సిబ్బంది ఎన్నికల విధుల్లో తలమునకలై ఉండగా మళ్లీ అన్ని చౌరస్తాల్లో యాచకుల బెడద తీవ్రతరమైంది. వీరి కోసం నెల నెలా జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లుగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. మరి వీరంతా రోడ్డున ఉండగా ఈ లక్షల రూపాయలు ఎవరికి ఖర్చు చేస్తున్నారన్నది అంతుబట్టకుండా ఉంది. కేబీఆర్ పార్కు మొదటి పార్కింగ్‌స్థలం కడక్‌ఛాయ్ వద్ద ప్రతిరోజూ ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా పది మంది వరకు యాచకులు కస్టమర్లకు నరకం చూపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ యాచకులను గౌరవప్రదమైన ప్రాంతాలకు చేర్చి మంచి సౌకర్యాలు కల్పించి ఆహార భద్రత ఇస్తే వారు మళ్లీ రోడ్డున పడే అవకాశాలు లేవని స్థానికులు అంటున్నారు.

తల్లీకొడుకులపై అటవీ అధికారి వీరంగం

చెన్నూర్: జరిమానా కట్టిన అనంతరం తమ వాహనాన్ని తమకిచ్చేయాలని కోరిన తల్లీ కొడుకులపై ఓ అటవీ అధికారి విచక్షణారహితంగా దాడి చేశాడు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ, ఆమె కుమారుడు లక్ష్మణ్ చెన్నూర్ జాతీయ రహదారిని ఆనుకుని ఖాళీ ప్రదేశంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. లక్ష్మణ్ 3 నెలల క్రితం తమ కుల దైవానికి బలి ఇచ్చేందుకు ఊరపందిని అస్నాద గ్రామానికి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా అటవీ అధికారి బాలకృష్ణ పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. రూ.25వేలు జరిమానా చెల్లిస్తే వాహనాన్ని ఇస్తామని చెప్పడంతో లక్ష్మణ్ నెల క్రితమే జరిమానా డబ్బును కట్టారు. అయినప్పటికీ ద్విచక్రవాహనాన్ని అతడికి ఇవ్వలేదు. ఈ క్రమంలో శుక్రవారం అటవీ అధికారి బాలకృష్ణను లక్ష్మణ్ బైక్ విషయమై నిలదీయగా.. ఆఫీస్‌కు వస్తే ఇస్తానని చెప్పడంతో లక్ష్మణ్ అటవీశాఖ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ లక్ష్మణ్‌ను బాలకృష్ణ కొరడాతో చితక్కొట్టారు. అదే సమయంలో అక్కడకు వెళ్లిన ఎల్లమ్మ బాలకృష్ణను అడుకోగా...ఆమెపై కూడా దాడి చేశాడు. ఈ క్రమంలో లక్ష్మణ్ స్పృహ తప్పిపోగా, ఆస్పత్రికి తరలించేందుకు ఎల్లమ్మ 108 కు ఫోన్‌చేసి వాహనాన్ని రప్పించింది. అయితే తల్లీకొడుకులు డ్రామా ఆడుతున్నారని 108 వాహనాన్ని బాలకృష్ణ వెనక్కి పంపించి వేశారని ఎల్లమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. అయితే సీఐ మాత్రం బాలకృష్ణ విధులకు వెళ్తుండగా లక్ష్మణ్ అతడిని అడ్డగించి దాడి చేశాడని చెబుతున్నారు.

వెంటనే పోలీసు ఉద్యోగాల భర్తీ

నియామకాలకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం

- పలు అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష
- పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక స్కూళ్లు
- ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన నళినికి ఉద్యోగం ఇవ్వండి
- సీఎం కాన్వాయ్‌లోని వాహనాలను 15 నుంచి 9కి తగ్గించండి
- ట్రాఫిక్ జామ్‌లతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియామకాల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు కోరుకొండ స్కూల్ మాదిరి రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. శుక్రవారం సచివాలయంలో పోలీసు, వైద్యారోగ్య శాఖల్లో నియామకాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా, అవకతవకలకు ఆస్కారం లేకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. నియామకాల ప్రక్రియలో లోటుపాట్లను అధిగమించే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన ఉద్యోగ నియామకాలపై కూడా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక స్కూళ్లు

విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడి ఉండే, ఎక్కువ సమయం విధులు నిర్వహించే పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారుల నుండి కానిస్టేబుల్ వరకు, ఆర్టీసీలో ఉన్నతాధికారుల నుండి కండక్టర్, కింది స్థాయి ఉద్యోగుల పిల్లలకు చదువుకొనేలా ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కోరుకొండ సైనిక్ స్కూల్ మాదిరిగా ఆ పాఠశాలలు ఉండాలని.. ఉత్తర, దక్షిణ తెలంగాణలలో వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

వెంటనే హోంగార్డుల నియామకాలు

పోలీసు శాఖలో ఏడెనిమిదేళ్లుగా హోంగార్డుల నియామకాలు లేవని, సమర్థవంతమైన పోలీసు సేవల కోసం వెంటనే హోంగార్డుల నియామకాలు చేపట్టాలని డీజీపీని సీఎం ఆదేశించారు. హోంగార్డుల ఆరోగ్యం, ఆర్థిక, వైద్య అవసరాలు తీరేలా చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం హోంగార్డుల సేవలను మరింతగా వినియోగించుకోవాలన్నారు.

మాజీ డీఎస్పీ నళినికి ఉద్యోగమివ్వండి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌తో డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన నళినికి పోలీసుశాఖలో అదే ఉద్యోగం ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటని ఉన్నతాధికారులను సీఎం ప్రశ్నించారు. నళినికి ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉంటే వెంటనే చేర్చుకోవాలని సీఎస్, డీజీపీలకు సూచించారు. పోలీస్ శాఖలో ఉద్యోగానికి సంబంధించి అవరోధాలేమైనా ఉంటే.. అదే హోదాలో ఇతర శాఖలో ఉద్యోగాన్ని ఇవ్వాలని సూచించారు. గతంలో ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన చాలా మంది తిరిగి ఉద్యోగాల్లో చేరిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ఈ సమీక్ష సమావేశాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా

ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులొద్దు

తన కాన్వాయ్ ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ జామ్‌లతో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రోడ్డుపై మూడు, నాలుగు లేన్లు ఉంటే.. ఒక లేన్‌లో సీఎం కాన్వాయ్ వెళ్లేలా చూడాలని సూచించారు. కాన్వాయ్‌లో ప్రస్తుతమున్న 15 వాహనాల సంఖ్యను 9కి తగ్గించాలన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, తరచూ సమస్య ఉన్న చోటుకు వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. సీఎం సమీక్ష తర్వాత హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎంను కలిసిన ముస్లిం పెద్దలు

శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ నేతృత్వంలో పలువురు ముస్లిం మత పెద్దలు, నాయకులు సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలసి సన్మానించారు. మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలను అందచేశారు.

నామినేటెడ్ పదవులివ్వండి

సీఎంను కోరిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన తమకు కూడా నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం కోరింది. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని మహిళలకు ఆరు గ్యారంటీలు అమలు చేయించేందుకు మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందని, ప్రభుత్వానికి అండగా ఉంటూ మహిళా కాంగ్రెస్ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని మహిళా నాయకులను ఆమె కోరారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు నీలం పద్మ, సదాలక్ష్మి, దుర్గారాణి, రజిత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉన్నత పోస్టుల్లో సామాజిక సమతుల్యం పాటించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వశాఖల్లోని ఉన్నతాధికారుల పోస్టుల్లో సామాజిక సమతుల్యం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర కీలక పోస్టుల్లో ఒక కులానికే పెద్దపీట వేయకుండా ప్రతిభావంతులైన, నిజాయితీ ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంకు ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధికారులకు ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పదవుల నియామకాల్లో అవకాశం దక్కలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ వర్గాలను అవమానించినందుకే ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఈ ప్రభుత్వంలో అలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కోరారు.

మరోమారు ఢిల్లీకి సీఎం!

సహచర ఎంపీలకు విందు ఇచ్చే యోచనలో రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మరోమారు ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. మల్కాజ్‌గిరి ఎంపీగా పనిచేసిన ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో తనతోపాటు పార్లమెంటులో కలిసి పనిచేసిన వివిధ పార్టీల ఎంపీలకు విందు ఇవ్వనున్నారని.. ఈ నేపథ్యంలోనే హస్తిన వెళ్లనున్నారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. శనివారమే ఆయన ఢిల్లీ వెళ్తారనే చర్చ జరిగింది. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటం, 18న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాష్ట్రానికి రానుండటంతో ఆయన ఢిల్లీ పర్యటన ఇంకా ఖరారు కాలేదు. ఆదివారం ఉదయం సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లే అవకాశముందని ప్రచారం జరుగుతున్నా, ఎప్పుడు వెళ్లేది శనివారం స్పష్టత వస్తుందని సమాచారం.

మహిళల బాధను స్మృతీ ఇరానీ విస్మరించారు

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులపై కేంద్రమంత్రి వైఖరిని తప్పుబట్టిన ఎమ్మెల్సీ కవిత



సాక్షి,హైదరాబాద్: నెలసరి సమయంలో మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వనవసరం లేదని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో సెలవులు ఇవ్వాలన్న ప్రతిపాదనను స్మృతీ ఇరానీ వ్యతిరేకించడాన్ని కవిత తప్పుబట్టారు. కేంద్రమంత్రి వైఖరి నిరుత్సాహపరిచిందని, మహిళల బాధను స్మృతి విస్మరించారని శుక్రవారం 'ఎక్స్'వేదికగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ''నెలసరి అనేది ఎంపిక కాదు. అది సహజమైన జీవ ప్రక్రియ. వేతనంతో కూడిన సెలవును తిరస్కరించడం అంటే మహిళలు అనుభవిస్తున్న బాధను విస్మరించినట్లే. మహిళలు ఎదుర్కొంటున్న వాస్తవిక సవాళ్ల పట్ల సానుభూతి చూపకపోవడం విస్తుగొల్పుతోంది. విధానాల రూపకల్పనకు, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన సమయం ఇది ''అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కాగా, క్లిష్ట సమయంలో దేశ నలుమూలల నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పట్ల ప్రేమాభిమానాలు కనబర్చినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ అభిమానులూ ఓటేయలేదు

- అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- లోపాలను సమీక్షించాం.. పార్టీని పటిష్టం చేస్తాం
- రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీపట్ల అభిమానం ఉన్నవారు కూడా ఓటేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలపై పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ మూడు రోజులపాటు హైదరాబాద్‌లో సమావేశమైంది. ఈ భేటీకి కేంద్ర పరిశీలకులుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎ.విజయ రాఘవన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో తమ్మినేని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. సీపీఎం కుటుంబాలు మినహా పార్టీ అభిమానులు కూడా ఈసారి తమకు ఓటేయకపోవడంతో గతంతో పోలిస్తే సీపీఎం దారుణంగా దెబ్బతిన్నదన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేశామని... ప్రతి ఎన్నికల్లోనూ ఇదే అనుభవం ఎదురైందని చెప్పారు. పార్టీలో లోపాలు జరిగాయని, వాటిని సమీక్షించుకొని భవిష్యత్తులో పార్టీని పటిష్టం చేయడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకున్నామని తమ్మినేని చెప్పారు.

పొత్తు సాధ్యం కాక...

తాము పోటీ చేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన లోపంగా పార్టీ గుర్తించిందని తమ్మినేని వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు విషయంలో కాలయాపన కావడం, చివరి నిమిషంలో పొత్తు సాధ్యం కాదని తేలాక ఒంటరిగా పోటీ చేయాల్సి రావడం దెబ్బ తీసిందని చెప్పారు. ఎన్నికలకు సిద్ధం కావడానికి సమయం సరిపోని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మరోవైపు బీఆర్ఎస్ అహంభావ, అప్రజాస్వామిక ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని తమ్మినేని విశ్లేషించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర, రేవంత్‌రెడ్డి నాయకత్వం, కర్ణాటకలో కాంగ్రెస్ విజయం వంటి పరిణామాలన్నీ కాంగ్రెస్ గెలుపునకు తోడ్పడ్డాయని వివరించారు. గత ఎన్నికలతో పోల్చితే బీజేపీకి ఓట్లు, సీట్లు రెట్టింపయ్యాయనీ, ఇది ఓ ప్రమాదకర సంకేతమని చెప్పారు.

సీఎంతో గ్రూప్-1 అధికారుల సంఘం నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి హన్మంతునాయక్, నేతలు చొడారపు శ్రీధర్, భవాని, శశిశ్రీ, జయశ్రీ, హరికిషన్, లింగ్యానాయక్, యూనస్, అఖిలేశ్‌రెడ్డి, మైత్రిప్రియ తదితరులు ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని వారు రేవంత్‌రెడ్డికి తెలిపారు. అతి త్వరలో టాస్ ఏర్పాటు, అదనపు కలెక్టర్ల అంశంపై మళ్లీ ఒకసారి కలుస్తామన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

సీసీఎల్ఏ భూమి సైట్లు బంద్

- పాలనా పగ్గాలు చేతులు మారడంతో భూముల క్రమబద్ధీకరణకు బ్రేక్
- నాలుగైదు వెబ్‌సైట్ల నిలిపివేత
- ప్రభుత్వ నిర్ణయం కోసమే అంటున్న రెవెన్యూ అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు దాటినా రాష్ట్రంలో భూపరిపాలన గాడిలో పడడం లేదు. కోడ్ కారణంగా గతంలో నిలిపివేసిన నాలుగైదు వెబ్‌సైట్లను పునః ప్రారంభించకపోవడమే ఇందుకు కారణమని రెవెన్యూ వర్గాలంటున్నాయి. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) పరిధిలోకి వచ్చే ల్యాండ్ రెగ్యులరైజేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎల్ఆర్ఎంఎస్), యూఎల్‌సీ రెగ్యులరైజేషన్, ఈల్యాండ్స్ టీఎస్, జీవో 58, 59ల ద్వారా ప్రభుత్వ భూముల్లోని కట్టడాల క్రమబద్ధీకరణకు సంబంధించిన వెబ్‌సైట్లతో సహా ఇతర భూపరిపాలన వెబ్‌సైట్లు పని చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. వాస్తవానికి, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత భూముల క్రమబద్ధీ కరణ నిలిచిపోయింది. ప్రభుత్వ భూముల్లో కబ్జా ఉండి నిర్మాణాలు చేసుకున్న వారికి ఆ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు లక్షలాది మంది జీవో 58, 59 ద్వారా భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, అందులో 30-40 శాతం మాత్రమే దరఖాస్తులను పరిష్కరించారు. ఈ దరఖాస్తులను పరిష్కరించే అధికారం కలెక్టర్ల లాగిన్‌లకు మాత్రమే ఉండడంతో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే చాలా చోట్ల ఈ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుదారులు ఎన్నికలు ముగిసిన తర్వాత క్రమబద్ధీకరణ జరుగుతుందని భావించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఆదాయం రానుండడంతో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రారంభమవుతుందని రెవెన్యూ యంత్రాంగం భావించింది. కానీ, ఎన్నికలకు ముందు మూసేసిన వెబ్‌సైట్‌లను ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో రాష్ట్రంలో భూముల క్రమబద్ధీకరణ పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలనా పగ్గాలు మారిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసమే ఎదురుచూస్తున్నామని, ప్రభుత్వ విధానం ఎలా ఉంటుందోనన్న ఆలోచనతోనే తాత్కాలికంగా నిలిపివేశామని చెపుతున్నారు.

ఏపీ ప్రాజెక్టులను అడ్డుకోండి

కేఆర్ఎంబీ చైర్మన్‌కు ఈఎన్‌సీ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నది బేసిన్ పరిధిలోకి రాకుండా చేపట్టిన పలు అనధికార ప్రాజెక్టులను అడ్డుకోవాలని కృష్ణా యాజమాన్య నిర్వహణ మండలి చైర్మన్‌కు నీటిపారుదల శాఖ (సాధారణ) ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ లేఖ రాశారు. గాలేరు నగరి సుజల స్రవంతి, వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, తెలుగు గంగ ప్రాజెక్టుల కింద కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 అవార్డుకు వ్యతిరేకంగా ఈ ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. లాలేటివాగు రిజర్వాయర్, కలిబండ ఎత్తిపోతల పథకం, బెస్తపల్లి ఎత్తిపోతల, జరికోన రిజర్వాయర్ నుంచి పెద్ద చెరువుకు, చెరువుముందారిపల్లి తదితర చెరువులను నింపడానికి వీలుగా పథకాలు చేపడుతున్నారని వివరించారు. సత్యసాయి గంగ కెనాల్‌పై ఏడో బ్రాంచి వద్ద క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణం, కడప జిల్లాలోని తడుకువాగు, మెలకుంట ట్యాంకుల నింపడానికి 85 మిలియన్ క్యూబిక్‌ఫీట్ల నీటిని ఎత్తిపోయనున్నారని తెలిపారు. ఇటుగులపాడు, సవిసెట్టిపల్లి, కొండ్రాజుపల్లి, వరికుంట్ల, గంగపల్లి చెరువులను నింపడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారని ఈఎన్‌సీ మురళీధర్ పేర్కొన్నారు.

ఆర్ఎన్ఆర్ ధాన్యం @ రూ.3,545

- మద్దతు ధర కంటే రూ.1,200 అధికం
- బాదేపల్లి మార్కెట్‌ను ముంచెత్తిన బస్తాలు
- సన్న రకానికి రికార్డు స్థాయి ధర

సాక్షి, హైదరాబాద్: ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర రికార్డు సృష్టించింది. క్వింటాల్ ధర రూ.3,545 పలికింది. మహబూబ్‌గర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ చరిత్రలో ఎన్నడూలేని విధంగా భారీ స్థాయిలో రేట్లు పలుకుతున్నాయి. గత సీజన్‌లో క్వింటాకు రూ.2,600 మాత్రమే పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 2,203 ఉండగా... మార్కెట్‌లో రూ. వెయ్యి నుంచి రూ.1,200 అధికంగా వస్తున్నది. బీపీటీని అంతగా సాగు చేయకపోవడంతో సన్నాలకు డిమాండ్ పెరిగింది. హైదరాబాద్, మిర్యాలగూడతో పాటు ఇతర రాష్ట్రాలకు ధాన్యం ఎగుమతి అవుతోంది. అన్ని మార్కెట్లలోనూ పెద్ద మొత్తంలో ధర లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు జిల్లా వరకే ఈ సీజన్‌లో 1.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. రాష్ట్ర మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ధరలు పలుకుతుండటం, రైతులు మార్కెట్‌కు క్యూ కట్టారు. దీంతో మార్కెట్‌కు ధాన్యం పెద్ద ఎత్తున అమ్మకానికి వస్తోంది. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. ఆర్ఎన్ఆర్ సన్నరకాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు ధరలను పెంచి కొనుగోలు చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్ (తెలంగాణ సోన) ఈరకం బియ్యం సన్నగా ఉండటం, క్వాలిటీ బాగా ఉండటం, నూనె శాతం తక్కువ, షుగర్ పేషంట్లకు బాగుంటుందని డిమాండ్ పెరింగింది. గతంలో వేసే బీపీటీ (సోనా రకం) ధాన్యాన్ని రైతులు అంతగా సాగుచేయకపోవడం కూడా ఈ సన్నాలకు డిమాండ్ అధికంగా వస్తున్నది. అయితే యాసంగిలో ఎక్కువశాతం 1010 దొడ్డురకం ధాన్యం సాగుచేసే అవకాశం ఎక్కువగా ఉండటంతో వచ్చే సీజన్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు సన్నరకాలకు ధరలు అధికంగా పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
16-12-2023



6,268 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు

- వీటి విలువ రూ.3,741 కోట్లు
- అక్టోబర్‌తో పోలిస్తే 8 శాతం ఎక్కువ
- బేగంపేటలో రూ.10.61 కోట్ల ఇంటి రిజిస్ట్రేషన్
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల ప్రభావం స్థిరాస్తి రంగం మీద ఏమాత్రం ప్రభావం చూపించ లేదు. గత నెలలో హైదరాబాద్‌లో రూ.3,741 కోట్ల విలువ చేసే 6,268 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అంతక్రితం నెలతో పోలిస్తే ఇది 8 శాతం, గతేడాది నవంబర్‌తో పోలిస్తే 2 శాతం ఎక్కువ. ప్రాపర్టీ విలువలలో అక్టోబర్‌తో పోలిస్తే 18 శాతం, 2022 నవంబర్‌తో పోలిస్తే 29 శాతం వృద్ధి నమోదయిందని నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది.

- ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ మధ్యకాలంలో నగరంలో 64,658 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటి విలువ రూ.34,205 కోట్లు. గతేడాది ఇదే కాలంలో రూ.30,429 కోట్ల విలువ చేసే 62,208 యూనిట్ల రిజిస్ట్రేషన్లయ్యాయి. అంటే ఏడాది కాలంలో 12 శాతం వృద్ధి నమోదైందన్నమాట. 2021 జనవరి–నవంబర్‌లో చూస్తే రూ.33,531 కోట్ల విలువ చేసే 75,451 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్స్ జరిగాయి.
- గత నెలలో జరిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో అత్యధిక వాటా మధ్యతరగతి గృహాలదే. రూ.50 లక్షల లోపు ధర ఉన్న ఇళ్ల వాటా 61 శాతంగా ఉండగా.. రూ.50–75 లక్షలు ధర ఉన్నవి 17 శాతం, రూ.75 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్నవి 9 శాతం, రూ.కోటి పైన ధర ఉన్న ప్రీమియం గృహాల వాటా 13 శాతంగా ఉంది.

నెల వారీగా రిజిస్ట్రేషన్లు

నెల	రిజిస్ట్రేషన్లు	విలువ (రూ.కోట్లలో)
జనవరి	5,454	2,650
ఫిబ్రవరి	5,725	2,987
మార్చి	6,959	3,602
ఏప్రిల్	4,494	2,286
మే	6,039	3,068
జూన్	5,566	2,897
జులై	5,557	2,878
ఆగష్టు	6,493	3,461
సెప్టెంబర్	6,304	3,459
అక్టోబర్	5,799	3,175
నవంబర్	6,268	3,741

రంగారెడ్డి, మేడ్చల్‌లోనే..

రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోనే రిజిస్ట్రేషన్ల హవా కొనసాగుతుంది. గత నెలలోని రిజిస్ట్రేషన్లలో ఒక్కో జిల్లా వాటా 43 శాతం కాగా.. హైదరాబాద్‌లో 14 శాతంగా ఉంది. గత నెల రిజిస్ట్రేషన్లలో 1,000–2,000 చ.అ. విస్తీర్ణం ఉన్న ఇళ్ల వాటా 71 శాతంగా ఉండగా.. 1,000 చ.అ. లోపు ఉన్న గృహాలు 15 శాతం, 2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన ప్రాపర్టీల వాటా 14 శాతంగా ఉన్నాయి.

- గత నెలలోని టాప్–5 రిజిస్ట్రేషన్లలో బేగంపేటలో రూ.10.61 కోట్ల మార్కెట్ విలువ చేసే ఓ ప్రాపర్టీ తొలి స్థానంలో నిలిచింది. బంజారాహిల్స్‌లో రూ.7.78 కోట్లు, రూ.7.47 కోట్ల విలువ చేసే రెండు గృహాలు, ఇదే ప్రాంతంలో రూ.5.60 కోట్లు, రూ.5.37 కోట్ల విలువ చేసే మరో రెండు ఇళ్ల రిజిస్ట్రేషన్స్ జరిగాయి. ఈ ఐదు ప్రాపర్టీల విస్తీర్ణం 3 వేల చ.అ.లుగా ఉన్నాయి.

ఈవీ ఇళ్లు

- వసతుల జాబితాలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు
- క్లబ్ హౌస్, పార్కింగ్ ప్లేస్‌లలో ఏర్పాటు
- సాధారణ ఇళ్లతో పోలిస్తే ధర 2–5 శాతం ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: ఇంధన వనరుల ధరలు రోజుకో రేటు ఉంటున్న నేపథ్యంలో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తుండటంతో చార్జింగ్ స్టేషన్ల అవసరం పెరిగింది. ఒకవైపు పెట్రోల్ బంక్‌లు, మెట్రో స్టేషన్ల వద్ద ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటవుతుంటే.. మరోవైపు కొత్తగా నిర్మిస్తున్న నివాస, వాణిజ్య సముదాయాలలోనూ వీటిని నెలకొల్పుతున్నారు. జిమ్, స్విమ్మింగ్ పూల్ అంటూ ప్రకటించే వసతుల జాబితాలో ఈవీ చార్జింగ్ పాయింట్ అనే ప్రత్యేకంగా ప్రకటించే స్థాయికి చేరిందంటే ఆశ్చర్యమేమీ లేదు. దీంతో ప్రస్తుతమున్న సాధారణ నివాస భవనాలలో ధరలు 1 శాతం మేర పెరిగితే.. ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన నివాస భవనాలలో ధరలు 2–5 శాతం మేర వృద్ధి చెందుతాయని జేఎల్ఎల్ నివేదిక తెలిపింది.

- 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల వాటా 40 శాతం కంటే ఎక్కువకు చేరుతుంది. దీంతో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఉన్న భవనాలకు డిమాండ్ క్రమంగా పెరుగుతుంది. కొత్త ప్రాజెక్ట్‌లోనే కాకుండా ఇప్పటికే ఉన్న భవనాలలో కూడా ఈవీ పాయింట్ల ఏర్పాటు వ్యవస్థ 2026 నాటికి భారీగా పెరుగుతుంది. భవనాల రకం, సహజ వనరుల పునర్వినియోగ (రెట్రోఫిట్) ప్రాజెక్ట్‌ల నివాస తరగతులను బట్టి ధరల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం నివాస ప్రాంతాలలో యజమానులు సర్వీస్ ప్రొవైడర్ల సహాయంతో ఈవీ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. పెద్ద స్థాయి ప్రాజెక్ట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో అసోసియేషన్లు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. ఇందుకోసం వినియోగదారులపై నిర్ణీత రుసుములను వసూలు చేస్తున్నారు. రానున్న కొత్త నివాస సముదాయాలలో 5 శాతం పార్కింగ్ స్థలాన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్ల కోసం కేటాయించబడతాయని జేఎల్ఎల్ ఇండియా స్ట్రాటజిక్ కన్సల్టింగ్ అండ్ వాల్యుయేషన్ అడ్వైజరీ హెడ్ ఏ శంకర్ తెలిపారు. ఈవీ స్టేషన్ల ఏర్పాటు కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ) చార్జింగ్ ఉపకరణాలు, ఇంటర్నెట్ లభ్యత కూడా అందుబాటులో ఉండాలి గనక.. ఇప్పటికే ఉన్న పెద్ద రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలలో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు వ్యయం, పరిమిత విద్యుత్ సరఫరా సామర్థ్యాలను బట్టి 1 శాతం ప్రీమియం ఉంటుందని పేర్కొన్నారు. 60 శాతం కంటే ఎక్కువ నివాసితులు ఈవీ చార్జింగ్ పాయింట్ల అవసరాన్ని కోరుకుంటుంటే ఈ ప్రీమియం 2–5 శాతం వరకు ఉంటుందని తెలిపారు.

ఆఫీస్ స్పేస్‌లలో కూడా..

ఈవీ స్టేషన్లు ఉన్న ఆఫీస్ స్పేస్‌లకు కూడా డిమాండ్ ఏర్పడింది. కొందరు స్థల యజమానులు వినియోగదారు రుసుముతో ఈవీ స్టేషన్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు చార్జింగ్ సర్వీస్ ప్రొవైడర్లకు భూమిని లీజుకు లేదా రెవెన్యూ షేర్ మోడల్ ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆఫీస్ పార్కింగ్‌లలో ఖాళీ ప్లేస్‌లు లేకపోవటమే అసలైన సవాలు. ఇప్పటికే ఉన్న కొన్ని కార్యాలయాలలోని పార్కింగ్‌లలో ఇలాంటి అవసరాల కోసం కొంత స్థలాన్ని కేటాయించాయి. ప్రభుత్వ విభాగాలు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేట్ ఆపరేటర్లకు లీజుకు ఇవ్వొచ్చు లేదా దీర్ఘకాలానికి సంబంధిత భూమిని సర్వీస్ ప్రొవైడర్లకు లీజుకు ఇవ్వొచ్చని జేఎల్ఎల్ సూచించింది.





గృహాల అద్దెలు పెరిగాయి!

- ఏడాదిలో నగరంలో 24.2% వృద్ధి
- మ్యాజిక్ బ్రిక్స్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: నగరంలో గృహాల అద్దెలు పెరిగాయి. ప్రీమియం ఇళ్లకు డిమాండ్, ఆఫీసు కేంద్రాలకు చేరువలో ఉండటం వంటి కారణంగా ప్రధాన నగరాలలో ఇళ్ల అద్దెలు వృద్ధి చెందుతున్నాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది జూలై–సెప్టెంబర్‌లో 4.6 శాతం, ఏడాదితో పోలిస్తే 22.4 శాతం మేర అద్దెలు పెరిగాయని మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా థానేలో 57.3 శాతం, గుర్గావ్‌లో 41.4 శాతం, గ్రేటర్ నోయిడాలో 28.7 శాతం, నోయిడాలో 25.2 శాతం, హైదరాబాద్‌లో 24.2 శాతం మేర వృద్ధి చెందాయి.

- దేశంలోని 13 నగరాలో 67 శాతంగా ఉన్న 18–34 ఏళ్ల వయసు ఉన్న మిల్లీనియల్స్ వల్లే గృహాల అద్దెలు పెరిగాయి. సెమీ ఫర్నిష్ గృహాలను రెంట్‌కు తీసుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ తరహా అద్దెలకు 52.7 శాతం డిమాండ్ ఉండగా.. సప్లయి 48.7 శాతం మాత్రమే ఉందని మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుధీర్ పాయ్ తెలిపారు. నెలకు రూ.10–30 వేలు మధ్య అద్దె ఉన్న మధ్యస్థాయి గృహాలకు 41 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.

భళా.. ఆఫీసు!

- కార్యాలయ అద్దెల్లో 8 శాతం వృద్ధి
- చెన్నై తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆఫీసు స్పేస్ అద్దెలు పెరుగుతున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (హెచ్1) దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కార్యాలయాల అద్దెలు 7 శాతం మేర పెరిగాయి. నిర్మాణం, ఇన్‌పుట్ వ్యయం పెరగడమే ఇందుకు కారణమని అనరాక్ రిపోర్ట్ వెల్లడించింది. చెన్నై తర్వాత హైదరాబాద్‌లోనే ఆఫీసు స్పేస్ అద్దెలు అత్యధికంగా పెరిగాయి. ఏడాది కాలంలో చెన్నైలో 10 శాతం మేర వృద్ధి చెందితే.. నగరంలో 8 శాతం పెరిగాయని పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో నగరంలో నెలకు చ.అ. ఆఫీసు అద్దె రూ.61గా ఉండగా.. 2024 ఫైనాన్షియల్ ఇయర్ నాటికి రూ.66కు పెరిగాయి. అదే గ్రేడ్–ఏ ఆఫీసు అద్దె చ.అ.కు నెలకు 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.77.5గా ఉండగా.. ఇప్పుడది రూ.83కు పెరిగింది.

నగరాల వారీగా అద్దె (నెలకు చ.అ.కు)

నగరం	2023 హెచ్1	2024 హెచ్1	వృద్ధి (%లో)
బెంగళూరు	84	90	7
ముంబై	130	136	5
ఎన్‌సీఆర్	81	85	5
చెన్నై	62	68	10
హైదరాబాద్	61	66	8
పుణే	74	79	7
కోల్‌కతా	54	58	7

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ: ఆర్ కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు, బీసీల అభ్యున్నతికి కేంద్ర బడ్జెట్‌ను రూ.రెండు లక్షల కోట్లకు పెంచేలా సిఫారసు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కృష్ణయ్యతో కూడిన ప్రతినిధి బృందం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అమలుచేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి తగు సిఫారసు చేస్తానని బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

మేడారం జాతర కోసం రూ.75 కోట్లు



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించింది. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఈ నిధులు ఖర్చు చేసి.. జాతర ప్రాంతంలో వసతులు కల్పిస్తారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ నిధులను మొత్తంగా 21 శాఖల ద్వారా ఖ ర్చు చేస్తారు. తాగునీటి వసతి మొదలు, అక్కడ వి.ధులు నిర్వహించే ఉద్యోగుల అలవెన్సులకు వీటిని ఖర్చు చేస్తారు. నిధులు మంజూరు చేయడంతో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ములుగు జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ములుగు జిల్లా కలెక్టర్ సమన్వయంతో ఈ పనులన్నీ చేపట్టాలి. జనవరి నెలాఖరు కల్లా నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని, డిసెంబర్ నెలాఖరునాటికి టెండర్లు ఖరారు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

రూ.25 లక్షలు ఉచిత వైద్యం

- ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయ పరిమితిని భారీగా పెంచిన ఏపీ ప్రభుత్వం
- ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం
- ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి రూ.4,400 కోట్ల వ్యయం.. 18న ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం
- జనవరి 1 నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక'రూ.3 వేలకు పెంపు



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణలో మరో విప్లవాత్మక నిర్ణయానికి ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ లభించింది. పేద కుటుంబాలకు పునర్జన్మ ప్రసాదిస్తున్న అపర సంజీవని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ అధునాతన వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలోపేతం చేయడం తెలిసిందే. ఇప్పటికే క్యాన్సర్ లాంటి మహమ్మారి బారిన బాధితులకు పరిమితి లేని చికిత్సలు అందిస్తూ ఆరోగ్యశ్రీ సంజీవనిగా మారింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్న ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంతో రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీతో లబ్ధి పొందుతున్నాయి. నాలుగున్నరేళ్లలో 37.40 లక్షల మంది ఆరోగ్యాలకు భరోసానిస్తూ వివిధ జబ్బుల చికిత్సకు 53,02,816 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం రూ.11,859.86 కోట్లు ఖర్చు చేసింది. మరోవైపు గత ఎన్నికల్లో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా ఆచరిస్తూ మేనిఫెస్టోలో పేర్కొన్న మరో హామీని సంపూర్ణంగా నెరవేరుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. ప్రస్తుతం రూ.2,750గా ఉన్న వైఎస్సార్ పింఛన్ కానుకను జనవరి 1వ తేదీ నుంచి రూ.3 వేలకు పెంచాలని నిర్ణయించింది. తద్వారా 65.33 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, చర్మకారులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఈ మేరకు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర లభించింది. జనవరి 10వతేదీ నుంచి 23వరకు చివరి విడత వైఎస్సార్ ఆసరా, జనవరి 29 నుంచి ఫిబ్రవరి 10 వరకు వైఎస్సార్ చేయూత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

దేశ ప్రజారోగ్య చరిత్రలో కీలక మైలురాయి

పేదలకు ఉచిత వైద్య సేవల కోసం గత సర్కారు ఏడాదికి రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు ఏడాది 4,400 కోట్లు వెచ్చిస్తున్నాం. ఇప్పటి వరకు ఒక్క క్యాన్సర్ ప్రొసీజర్స్‌లోనే వైద్యానికి రూ.1,897 కోట్లు వ్యయం చేశాం. ఇక ఆరోగ్యశ్రీ కొత్త కార్డుతో ఆస్పత్రికి వెళ్తే రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తాం. ఇది దేశంలోని ప్రజారోగ్య చరిత్రలో అతిపెద్ద మైలురాయి. ఈ నెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీని ప్రారంభిస్తారు. గతంలో ఆరోగ్యశ్రీలో 1,059 ప్రొసీజర్స్ మాత్రమే ఉండగా, సీఎం జగన్ వీటిని ఏకంగా 3,257కి పెంచడం ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధికి నిదర్శనం. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. 19వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కొత్త కార్డుల పంపిణీ చేపడతాం. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందడంపై జనవరి నెలాఖరు/ఫిబ్రవరి తొలి వారంలోగా ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రజల ఫోన్లలో డౌన్‌లోడ్ చేస్తారు. ఆరోగ్యశ్రీ యాప్‌లో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవల సమగ్ర డేటా అందుబాటులో ఉంటుంది. ఆరోగ్యశ్రీ చికిత్సను 104 కాల్ సెంటర్, విలేజ్ హెల్త్ క్లినిక్, 108 అంబులెన్స్, ఫ్యామిలీ డాక్టర్, స్థానిక పీహెచ్‌సీల ద్వారా పొందడంపై ప్రతి ఒక్కరికీ తెలియచేస్తాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొంది తిరిగి డాక్టర్ చెకప్ కోసం వెళ్లాల్సి వస్తే రవాణా ఖర్చుల కింద రూ.300 చెల్లిస్తాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్నికలకు సన్నద్ధం

- మంత్రులకు సీఎం జగన్ దిశానిర్దేశం
- ఈసారి సార్వత్రిక ఎన్నికలకు కాస్త ముందే షెడ్యూల్ రావచ్చు
- ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి ఉధృతంగా వెళ్లండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని మంత్రులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 10న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిందని పేర్కొంటూ ఈసారి ఎన్నికల షెడ్యూల్ కాస్త ముందుగానే వెలువడే అవకాశం ఉందన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రజలతో మమేకమవుతున్నామని, 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలను సమన్వయం చేసుకుంటూ ఇకపై మరింత ఉధృతంగా జనంలోకి వెళ్లాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. శుక్రవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం సందర్భంగా అజెండా అంశాలపై చర్చ ముగిశాక అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత సమకాలీన రాజకీయ పరిస్థితులపై సీఎం జగన్ మంత్రులతో చర్చించారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు కాస్త ముందుగానే వెలువడే అవకాశాలు ఉన్నందున ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉండాలని, అందరినీ సమన్వయం చేసుకుంటూ మరింత ఉధృతంగా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో రాష్ట్రంలో సాకారమైన విప్లవాత్మక మార్పులను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏపీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి దుర్మరణం



చెరుకువాడ వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో ఘటన

సాక్షి, అమరావతి/సాక్షి, భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి(60) శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉదయం ఆకివీడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతు తెలిపిన అనంతరం స్నేహితుడి కారులో ఎమ్మెల్సీ సాబ్జి పాలకొల్లు బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో చెరుకువాడలోని రైస్‌మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లకూ ముందు భాగాలు దెబ్బతిన్నాయి. తలకు తీవ్రగాయమై కొన ఊపిరితో ఉన్న ఎమ్మెల్సీ సాబ్జిని స్థానికులు బయటకు తీసి సపర్యలు చేస్తుండగానే కన్నుమూశారు. ఆయన పీఏ షేక్ ఆలియా, గన్‌మేన్ ముత్యాలరాజు, కారు నడుపుతున్న వాసా శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారుకు ముందుభాగంలో బెలూన్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్నవారికి ఏమీ కాలేదు. భీమవరంలో ప్రయాణికులను దించి ఆకివీడు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

గవర్నర్, ముఖ్యమంత్రుల సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతిపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్‌వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. కాగా, మంత్రివర్గ సమావేశం జరుగుతుండగా ఎమ్మెల్సీ మరణవార్త సీఎం జగన్ దృష్టికి వచ్చింది. వెంటనే సాబ్జి మృతికి కేబినెట్ సంతాపం తెలిపింది. కేబినెట్ సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు.

టీ వర్క్స్ సీఈవో సుజయ్ తొలగింపు

కొత్త సీఈవోగా ఆనంద్ రాజగోపాల్

సాక్షి, హైదరాబాద్:బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీ–వర్క్స్ సీఈవోగా టీ–ఫైబర్, ఎలక్ట్రానిక్స్ (ప్రమోషన్స్) డైరెక్టర్‌గా కీలక పదవులు నిర్వర్తించిన సుజయ్ కారంపూరిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీ వర్క్స్ సీఈవో పదవితో పాటు 'టీ ఫైబర్', 'ఎలక్ట్రానిక్స్ వింగ్ డైరెక్టర్'గా సుజయ్ పనిచేశారు. తన నియామకం రాజకీయాలకు సంబంధించినది కానందున రాజీనామా చేయాల్సిన అవసరం లేదని సుజయ్ కారంపూరి ఇటీవల ప్రకటించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో సుజయ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం ఆయనపై వేటు వేసినట్లు తెలిసింది. కాగా టీ వర్క్స్ కొత్త సీఈవోగా ప్రస్తుతం అదే సంస్థలో డైరెక్టర్ (ఆపరేషన్స్)గా పనిచేస్తున్న ఆనంద్ రాజగోపాల్‌ను ప్రభుత్వం నియమించింది.

టీ ఫైబర్ హెడ్‌గా కాసుల ఆనంద్, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ వింగ్ హెడ్‌గా ఎస్‌కే శర్మ నియమితులయ్యారు. సుజయ్ తొలగింపు నేపథ్యంలో టీ హబ్ సీఈవోగా మహంకాళి శ్రీనివాసరావు, వి హబ్ సీఈవోగా దీప్తి రావుల కొనసాగే అంశంపై చర్చ జరుగుతోంది.



సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మావల మండలం బట్టిసావర్‌గావ్ గ్రామ శివారులోని చెరువు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, అధికారులు వెయ్యికి పైగా మొక్కలు నాటారు. కానీ వాటికి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలన్నిటినీ పశువులు తినేశాయి. వాటికి ఊతంగా అమర్చిన కర్రలే ప్రస్తుతం మిగిలాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నగర వార్తలు

సెల్ బేలో నటి శుభశ్రీ సందడి



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సెల్ బే షోరూమ్‌లో నటి శుభశ్రీ రాయగురు సందడి చేశారు. శుక్రవారం 5జీ హ్యాండ్‌సెట్ రియల్‌మీ సి67 ఆమె మార్కెట్‌లోకి విడుదల చేశారు. చాలా కాలంగా సెల్‌బేతో తనకు అసోసియేషన్ ఉందన్నారు. సెల్‌బే ఎండీ నాగరాజు మాట్లాడుతూ వినియోగదారులకు సరికొత్త ఉత్పత్తులను అందజేస్తున్నామని అన్నారు. రియల్‌మీ సీ67 మొబైల్ అత్యుత్తమ ఫీచర్స్ కలిగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెల్బే ప్లానింగ్ డైరెక్టర్ సుహాస్ నల్లచెరు, రియల్‌మీ ప్రతినిధులు తరణి ప్రసాద్, పునీత్‌చతుర్వేది, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై ముగిసిన శిక్షణ



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆసక్తి గల యువ రైతులకు నిర్వహించిన తేనెటీగల పెంపకం పై శిక్షణ శుక్రవారం ముగిసింది.ఏడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో తేనెటీగల పెంపకం వాటి సంరక్షణలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు.అనంతరం వారికి సర్టిఫికెట్స్‌ను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సివి సమీర్, డాక్టర్ అరుణశ్రీ,తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సత్కారం

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.



ఉరకలేసేలా.. ఊపునిచ్చేలా..

ఓ వైపు సాంస్కృతిక సౌరభాలు వెదజల్లే సంప్రదాయ నాట్యాలు.. మరోవైపు అత్యాధునికతకు పట్టం కట్టే అంతర్జాతీయ మ్యూజిక్ ఫెస్టివల్స్.. అంబరాన్ని తాకే అద్భుతమైన పెళ్లి వేడుకలు.. రంగుల హంగుల హోలీ వేడుకలు.. నగరం అంటే ఇప్పుడో ఈవెంట్ల సాగరం. ఓ వైపు ఈవెంట్స్‌కు పెద్దన్న లాంటి కొత్త సంవత్సరం వచ్చేస్తోంది.. మరోవైపు ఇటీవలే కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో నూతన కాంతులీనాలని నగర ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగం ఆకాంక్షిస్తోంది. అందుకు గాను ప్రభుత్వ సహాయ సహకారాలను కోరుతోంది.
– సాక్షి, సిటీబ్యూరో

ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈవెంట్స్ రంగాన్ని ఇండస్ట్రీగా గుర్తించాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఈ రంగంలో ఈవెంట్ మేనేజర్‌లు, సౌండ్ లైట్ వీడియో ప్రొవైడర్లు, డెకరేటర్‌లు, డిజైనర్లు తదితర విభిన్న క్రాఫ్టలను కలిగి ఉన్న నగర ఈవెంట్ రంగం దేశంలోనే నంబర్ 1గా దూసుకుపోతోంది. పెద్ద సంఖ్యలో కళాకారులు, క్యాటరర్లు, ఈవెంట్ వేదికల యజమానులు, కన్వెన్షన్ కేంద్రాలతో కళకళలాడుతోంది. ఈ నేపథ్యంలోనే తమ ఈవెంట్ రంగానికి ప్రభుత్వం నుంచి పరిశ్రమ గుర్తింపు కావాలని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ప్రతినిధులు కోరుతున్నారు. టీసీఈఐలో 400 మంది సభ్యులు, 15,000 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్రంలో అధికారికంగా ఈవెంట్ మార్కెట్ పరిమాణం రూ.800 కోట్ల అసంఘటిత రంగంలో కొన్ని వేల కోట్లు ఉంటుందని అంచనా. ఈ రంగం ఏటా 16% చొప్పున వృద్ధి నమోదు చేస్తోంది.

కోర్సులకు శ్రీకారం..

విస్తృత అవసరాలను కలిగి ఉన్న ఈవెంట్ రంగం వైపు నిపుణులను ఆకర్షించడానికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ కోర్సులను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ కోర్సులను ప్రారంభించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌తో టీసీఈఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కోర్సుల పట్ల యువతలో ఆసక్తి పెంచడానికి వీటిని ఉపాధి ఆధారితంగా మార్చడానికి, టీసీఈఐ ప్రభుత్వ సహకారం కోరుతోంది.

సింగిల్ విండోతో సమస్యలకు చెక్...

ఈవెంట్ నిర్వహణ కత్తిమీద సాము. ముఖ్యంగా ఇందులో సమయం కీలకపాత్ర పోషిస్తుంది. కాలం వృథా వల్ల కలిగే నష్టం ఒక్కోసారి అంచనాలకు అందదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈవెంట్ల నిర్వహణకు కావాల్సిన అనుమతుల కోసం అనేక ప్రభుత్వ విభాగాల చుట్టూ తిరిగే అవసరం తప్పించాల్సిందిగా టీసీఈఐ చాన్నాళ్లుగా కోరుతోంది. అన్ని రకాల అనుమతులూ ఒకే చోట క్లియర్ అయ్యేలాగా విండో క్లియరెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తోంది. గత ప్రభుత్వం అందించిన సహకారంతో ఈవెంట్స్ రంగం కొత్త పుంతలు తొక్కిందనీ నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం అంతకు మించిన ప్రోత్సాహం అందిస్తుందని, ప్రపంచంలోనే హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చే కృషిలో చేయూత అందిస్తుందని టీసీఈఐ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈవెంట్ సిటీగా రూపుదాల్చాలి

- సింగిల్ విండో అనుమతులు కావాలి
- కొత్త ప్రభుత్వానికి సిటీ ఈవెంట్స్ రంగం వినతి



ఈవెంట్ సిటీ ఏర్పాటు కావాలి..

నగరంలోని ఈవెంట్స్, మేనేజర్ల టాలెంట్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరాయి. దీనికి అనుగుణంగా మరిన్ని మార్పులు చేర్పులు అవసరం. ప్రపంచ స్థాయి ఈవెంట్‌లు – కాన్ఫరెన్స్‌ల నిర్వహణను సులభతరం చేయడానికి, భారీ కన్వెన్షన్ సెంటర్‌లు, స్పోర్ట్స్ స్టేడియాలు, అడ్వెంచర్ స్పోర్ట్స్ అరేనాలు, అవుట్‌డోర్ ఈవెంట్ అరేనాలు, మోటర్ స్పోర్ట్స్ రేసింగ్ ట్రాక్‌లు, హోటళ్లు, వివిధ రంగాల్లో పనిచేసే వ్యక్తుల హౌసింగ్ వంటివన్నీ ఒకే చోట నెలకొల్పే విధంగా ఒక ఈవెంట్ సిటీని ఏర్పాటు చేస్తే అద్భుతంగా ఉంటుంది. దీనిని నగరానికి 80–100 కి.మీ లోపల ఈవెంట్ సిటీని సృష్టించేందుకు వీలుంది. ఇలాంటి ప్రతిపాదనలతో కొత్త ప్రభుత్వ సారధులను త్వరలోనే కలవనున్నాం.
– రవి కుమార్, జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ

పారా లీగల్ వలంటీర్ల సేవలతో సత్వర న్యాయం

నాగోలు: సత్వర న్యాయం కోసం పారా లీగల్ వలంటీర్లు పనిచేస్తారని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా అన్నారు. శుక్రవారం పారాలిగల్ వలంటీర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన గుంత మురళీమోహన్‌ను నియమించారు. ఈ సందర్భంగా జడ్జి ఇందిరా మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు, న్యాయస్థానానికి మధ్య వారధిగా ఉంటారని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల పేద మధ్యతరగతి ప్రజలకు ఉచిత న్యాయం లభిస్తుందని అన్నారు. గుంత మురళీమోహన్ మాట్లాడుతూ సామాన్యులు ఎవరైనా తమ సమస్యలపై ఎప్పుడైనా తనని సంప్రదించవచ్చని తెలిపారు. న్యాయస్థానానికి తమ సమస్యలను తెలుసుకోవాలనుకునేవారు 81848 48498 నెంబర్ ద్వారా తనను సంప్రదించవచ్చన్నారు.



మురళీమోహన్‌కు పారాలీగల్ వాలంటీర్ కార్డును అందజేస్తున్న జిల్లా జడ్జి ఇందిరా

ముగిసిన మిల్లెట్స్ గ్లోబల్ సెక్యూరిటీ సదస్సు



సదస్సుకు హాజరైన ప్రతినిధులకు జ్ఞాపికలను అందిస్తున్న దృశ్యం

ఏజీవర్సిటీ: రాజేంద్ర నగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో మిల్లెట్స్ గ్లోబల్ సెక్యూరిటీ అనే అంతర్జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం ముగిసింది. ఇందులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, అంతర్జాతీయ మిల్లెట్స్, కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. మిల్లెట్ అడ్వాన్స్‌మెంట్ ఆలయన్స్ ప్రోగ్రామ్‌ను స్థాపించడానికి 2023 తర్వాత అంతర్జాతీయ మిల్లెట్స్ ఇయర్‌ని పొడిగించాలని సిఫార్సు చేశారు. దీంతో పాటు వాతావరణ మార్పు, ఆహార భద్రత, పోషకాహారం, జీవవైవిధ్యంలో క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించడానికి ప్రపంచ సంస్థలు, విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు కలిసిరావాలని సూచించారు.కార్యక్రమంలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర్, ఏఆర్‌డీఓ సెక్రటరీ జనరల్ శ్రీ డాక్టర్ మనోజ్ నర్దియోసింగ్ మేనేజ్, ఐఐఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరసన తెలిపేందుకు ఓ వేదిక అవసరం

- ధర్నా చౌక్‌ను సందర్శించిన కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి

కవాడిగూడ: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్, ఎన్‌టీఆర్ స్టేడియాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజా స్వామ్యంలో నిరసన తెలిపేందుకు ఒక వేదిక అవసరమని ధర్నా చౌక్ అందుకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. తాను సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ధర్నా చౌక్ పరిసరాలు ఎలా ఉన్నాయో చూసేందుకు ఇక్కడికి వచ్చానని ఆయన వివరించారు. గతంలో ధర్నా చౌక్ విషయంలో కోర్టులో కేసు వేశారని ఆ అంశంపై ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్ కారణంగా ధర్నా చౌక్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తగ్గిందని ఆయన అన్నారు. ప్రజలు ఏదైనా నిరసన చేపట్టాలి అనుకుంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇచ్చి అనుమతితో వారి వారి ధర్నాలు నిర్వహించుకోవచ్చని సూచించారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసనలు తెలుపవచ్చన్నారు. తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తరచు సెక్రటరియేట్‌కు రావడం వల్ల నగరంలో కొంత మేర ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని వాటిని ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పరిష్కరిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీనివాసులు, చిక్కడపల్లి ఏసీపీ మధుమోహన్‌రెడ్డి, గాంధీనగర్ ఏసీపీ రవికుమార్, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు ధర్నా చౌక్‌ను పరిశీలిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హెచ్‌సీయూను సందర్శించిన ఆఫ్రికా జర్నలిస్టులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఆఫ్రికా ఖండానికి చెందిన పలువురు జర్నలిస్టులు సందర్శించారు. ఆఫ్రికా ఖండంలోని బోట్‌స్వానా, ఎస్వతిని, ఇథియోపియా, కెన్యా, మలావి, మొజాంబిక్, నైజీరియా, నమీబియా, టంజానియా, ఉగాండా, జాంబియా, జింబాబ్వే, రువాండా, ఎరిత్రియా, కొమొరోస్ దేశాలకు చెందిన జర్నలిస్టుల బృందం శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూను సందర్శించారు. ఈ జర్నలిస్టుల బృందానికి హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం హెచ్‌సీయూలోని పరిపాలనా, మౌలిక సదుపాయాలగురించి వివరించారు. తరువాత ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోసం ఇంటర్నేషనల్ స్టూడెంట్స్, కోర్స్‌లపై ప్రెజెంటేషన్‌ని ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ అందించారు.



ప్రేమించి మోసం చేసిన యూ ట్యూబర్

నిందితుడి రిమాండ్



చంద్రశేఖర్ సాయికిరణ్

మణికొండ: సోషల్ మీడియాలో పరిచయం అయిన యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఏకంగా తన ఇంటికి పిలుచుకుని మోసం చేసిన ఓ యూ ట్యూబర్‌ను పోలీసులకు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. పుప్పాలగూడకు చెందిన కోలా చంద్రశేఖర్ సాయికిరణ్ (యూ ట్యూబ్ చందూగాడు, పక్కింటి అబ్బాయి) యూట్యూబర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి సోషల్ మీడియాలో పరిచయమైన యువతితో ప్రేమాయణం సాగించాడు. 2021లో పుట్టిన రోజు ఉందని ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో అతను వీడియాలు చేసేందుకు డబ్బు కావాలంటే తన బంగారాన్ని తాకట్టు పెట్టి సైతం డబ్బు ఇచ్చింది. అయితే రూ.3 కోట్లు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని, లేదంటే తన జోలికి రావద్దని బెదిరించాడు. తన నివాసాన్ని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జైన్స్ అపార్ట్‌మెంట్‌కు మార్చాడు. దీంతో బాధితురాలు ఈనెల 6వ తేదీన నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. చంద్రశేఖర్ సాయికిరణ్‌తో పాటు అతని తల్లితండ్రులు అమ్మాజీ, వెంకటేశ్వర్‌రావు, సోదరి లక్ష్మీమణి, బావ బాలు నాయుడులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. మిగతా వారు పరారీలో ఉండగా నిందితున్ని శుక్రవారం అరెస్టు చేసి రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచగా కోర్టు అతనికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఫస్టు నుంచి చూద్దాం!

ఆ మాటే వద్దు.. ఇవ్వాళే మొదలెట్టండి!

**'న్యూ ఇయర్ రానీ' అంటారు కొందరు.
'జనవరి 1 నుంచి అంతా మార్చేస్తా'
అంటుంటారు ఇంకొందరు.
'లాస్ట్ ఇయర్ వేస్ట్‌గా పోయింది.
ఈ ఇయర్ జిమ్‌ను కేక పెట్టిస్తా'...
మనం ఫిట్‌గా ఉండటానికి
న్యూ ఇయరే రావాలా?
మంచి అలవాటుకు ప్రతిరోజూ మంచిరోజే.
నిపుణుల అభిప్రాయం ఏమిటంటే
జనవరి 1 కంటే నవంబర్, డిసెంబర్‌లలో
ఫిట్‌నెస్ సంకల్పం తీసుకుంటున్నవారు
బెటర్‌గా మాటకు కట్టుబడుతున్నారని.
ఒకటి దాకా ఆగొద్దు.
ఇవాళ్టితో కదుల్దాం ముందుకు.**



అందరి షూ ర్యాక్‌లో దుమ్ము పట్టిన వాకింగ్ షూస్ ఉంటాయి. అవి గత సంవత్సరం జనవరి నెలలో కొన్నవి. కొత్త సంవత్సరంలో తీసుకున్న నిర్ణయాలలో భాగంగా, వాకింగ్ చేయాలనుకుని కొన్నవి అవి. ఆ వాకింగ్ ఎన్ని రోజులు సాగిందో. ప్రస్తుతం అవి దుమ్ముకొట్టుకుని, పట్టించుకునే యజమాని కోసం ఎదురు చూస్తూ అలా పడి ఉంటాయి.

ఆ దారిన వెళుతున్నప్పుడల్లా ఆ జిమ్ కనిపిస్తూనే ఉంటుంది. జనవరి, ఫిబ్రవరి రెండు నెలలు వెళ్లి మూడో నెల నుంచి మానేసిన జిమ్. ట్రైనర్ ఇప్పటికీ ఫోన్ చేస్తుంటాడు. జిమ్ నుంచి అలెర్ట్ మెసేజీలు వస్తూనే ఉంటాయి. గత సంవత్సరం కంటిన్యూ చేయలేదు కాని ఈ సంవత్సరం మళ్లీ చేరి కంటిన్యూ చేయాలి అనుకుంటూ ఉంటారు కొందరు.

ఉదయం వాకింగ్ ఫ్రెండ్స్ వాకింగ్ చేస్తూనే ఉంటారు. మనం వారు కనిపిస్తే ముఖం తిప్పుకుని వెళ్లిపోతూ ఉంటాం. నాలుగు రోజుల సింగారంగా మన వాకింగ్ ముగిసిపోయి ఉంటుంది. 'న్యూ ఇయర్ రానివ్వండి. జాయిన్ అవుతాను' అని వాళ్లు కనిపించినప్పుడల్లా అంటూనే ఉంటారు.

తక్షణం అవశ్యం ఆరోగ్యం

'ఆలస్యం అమృతం విషం' అన్నారు పెద్దలు. 'తక్షణం అవశ్యం ఆరోగ్యం' అనుకోవాలి విజ్ఞులు. ఇవాళ రేపట్లో మనం ఏం తింటున్నామో అందరికీ తెలుసు. విషం. మందులు విషం. కల్తీ గాలి. అయితే పరిగెత్తి చేసే ఉద్యోగాలు లేదా తిష్ట వేసినట్టుగా కదలక కూచుని చేసే కొలువులు... ఆరోగ్యం ఎలా? వయసు పెరిగే కొద్దీ బాధ్యతలు పెరుగుతాయి. బాధ్యతలు నెరవేరాలంటే ఆరోగ్యం ముఖ్యం.

అందుకు ప్రయత్నం ముఖ్యం. అక్కడే వస్తుంది చిక్కు. 'ఆరంభించరు నీచ మానవులు' అని భర్తృహరి అన్నాడు కాని 'ఆరంభించడానికి వేచి చూస్తారు సోమరి పోతులు' అనాలి నిజానికైతే. 'జనవరి 1 వస్తేనే ఆరంభిస్తా' అనుకుంటే జనవరి 1 వస్తేనే ఛోం చేస్తా అనుకోరు ఎందుకో.

ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్

జనవరి 1 అంటే కొత్త సంవత్సరం వస్తుంది. క్యాలెండర్ మారుతుంది. అన్నిచోట్ల ఒక కొత్త ఉత్సాహం ఉంటుంది. కనుక కొత్తగా నిర్ణయాలను అమలు చేద్దాం అని చాలామంది అనుకుంటారు. దీనిని ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్ అంటారు. అయితే డాక్టర్ జాన్ నార్‌క్రాస్ అనే సైకాలజీ ప్రొఫెసర్ ఇలా న్యూ ఇయర్ నిర్ణయాలు తీసుకుంటున్నవారిని గత 40 ఏళ్లుగా పరిశీలిస్తూ ఏమని తేల్చాడంటే– సాధారణంగా న్యూ ఇయర్ నిర్ణయాలలో ముఖ్యమైనవి 2. మొదటిది ఫిట్‌నెస్ సాధించడం, రెండోది బరువు తగ్గడం. ఫిట్‌నెస్ సాధించాలనుకునేవారు, బరువు తగ్గాలనుకునేవారు ఒక నెల రోజుల్లో సగానికి సగం మంది వ్యాయామం ఆపేస్తున్నారు. ఆరు నెలల్లో తొంభై శాతం మంది. పది శాతం మందే న్యూ ఇయర్ నిర్ణయాలను కొనసాగిస్తున్నారు. నిర్ణయం తీసుకోవడం ఎందుకు నీరుగారిపోవడం ఎందుకు?

మంచి సీజన్

అమెరికా, బ్రిటన్‌లలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో జిమ్‌లు కిటకిటలాడతాయి. నవంబర్, డిసెంబర్ వచ్చేసరికి ఖాళీ అయిపోతాయి. కొత్త సంవత్సరం ఉత్సాహం, నిర్ణయం నిలబడకపోవడమే కారణం. నిపుణులు ఏమంటున్నారంటే మీరు, మీ చుట్టూ ఉండే వాతావరణం ఎప్పుడు ఉత్సాహంగా ఉంటే అప్పుడు నిర్ణయాలు తీసుకుని అమలు చేయండి అని. ఉదాహరణకు మనకు వేసవి కాలం ఉత్సాహంగా అనిపిస్తే అప్పుడు మొదలెట్టి కొనసాగించాలి. లేదా నవంబర్ మంచి సీజన్ అనుకుంటే మొదలెట్టాలి. అమెరికాలో జనవరి నెల చలిలో మొదలెట్టే వ్యాయామాలు కొనసాగించడం సాధ్యం కావడం లేదని తేల్చారు. మన దగ్గర కూడా జనవరి చలి. ఆ చలిలో ఉదయాన్నే లేవలేక న్యూ ఇయర్ రెజల్యూషన్ పాటించడం లేదని బాధపడి... ఇదంతా ఎందుకు? ఈ రోజు నుంచే మొదలెట్టొచ్చు కదా.

ముఖ్యం... చాలా ముఖ్యం

ఆరోగ్యం కోసం కష్టపడటం ముఖ్యం. చాలా ముఖ్యం. ఏదో ఒక మంచి సందర్భంలో వజ్ర సంకల్పం తీసుకోవాలి. ఆల్కహాల్ తగ్గిస్తాను, స్మోకింగ్ మానేస్తాను, ఫేస్‌బుక్ కట్టేస్తాను, పిల్లలతో గడుపుతాను, యోగా చేస్తాను, నాన్‌వెజ్ వారంలో ఒక్కరోజే... ఇలా ఏ మంచి నిర్ణయమైనా మీకు మేలు చేస్తుంది.

నేటి మీ నిర్ణయం రేపు మీ యోగం.

దైనందిన జీవితంలో ఎన్నో సందర్భాలు ఎదురవుతుంటాయి. వాటిలో కొన్ని మనల్ని కదిలించి ఆలోచింపచేస్తాయి. మరికొన్ని సందర్భాలు భవిష్యత్‌నే మార్చేస్తాయి. అలాంటి ఓ సంఘటన ప్రణవ్ శుక్లా జీవితాన్ని మార్చేసి సామాజికవేత్తగా తీర్చిదిద్దింది. వందలమంది వృద్ధులను చేరదీసి వారి ఆలన పాలన చూసుకుంటూ ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాడు ప్రణవ్.

పండుటాకులే పిల్లలుగా...



వృద్ధురాలితో ప్రణవ్

హరియాణలోని ఫరిదాబాద్‌కు చెందిన వ్యక్తి ప్రణవ్ నారాయణ్ శుక్లా. ప్రణవ్ శుక్లా ప్రొఫెసర్ కొడుకు కావడంతో ఇంటర్మీడియట్ తరువాత మెడిసిన్ చదవాలనుకున్నాడు. అనుకున్నట్టుగానే మెడిసిన్‌లో చేరాడు. కానీ ఫ్యాషన్ డిజైనింగ్‌పై మక్కువ ఏర్పడడంతో నెలరోజుల తరువాత మెడిసిన్ మానేసాడు. ఇది కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదు. అయినా తనకిష్టమైన ఫ్యాషన్ డిజైనింగ్‌ను కష్టపడి చదివి ఓ బహుళజాతి సంస్థలో ఉద్యోగం సంపాదించాడు.

కాలేజీ రోజుల్లో...

ప్రణవ్ శుక్లా ఫ్యాషన్ డిజైనింగ్ చదివేటప్పుడు రోజూ కాలేజీకి ట్రెన్‌లో వెళ్తుండేవాడు. ఒకసారి ట్రెన్ ఎక్కేందుకు ఓక్లా స్టేషన్‌కు చేరుకున్నాడు. అది చలికాలం కావడంతో ప్లాట్‌ఫాం మీద మెల్లగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో ప్లాట్‌ఫాం పైన ఒక మూలన ఒక వృద్ధుడు చలికి వణికిపోతూ అల్లాడిపోతున్నాడు. అదిచూసి చలించిపోయిన ప్రణవ్ తను ఎంతో ఇష్టంతో కొనుక్కున్న జాకెట్‌ను ఆ వృద్ధుడికి ఇచ్చాడు. అప్పుడు అతడి కళ్లలో చూసిన ఆనందం ప్రణవ్‌కు చాలా సంతృప్తినిచ్చింది. తను జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తరువాత వృద్ధుల బాగోగులను చూసుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నాడు.

> **అందుకే పిల్లలు వద్దనుకున్నాం**
> కాలేజ్ డేస్‌లో తీసుకున్న నిర్ణయం ఈరోజు ఇంతమందికి ఆశ్రయం కల్పిస్తోంది. పెద్దవారికి సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఆశ్రమంలో నలభై రెండు మంది వృద్ధులు ఉన్నారు. వారిని కన్నబిడ్డల్లా చూసుకుంటున్నాము. అందుకే నేను, నా భార్య పిల్లలు వద్దు అనుకున్నాము.

ఆనందాల, ఆత్మీయతల ఆశ్రమం..

ప్రణవ్ ఉద్యోగంలో చేరాక కొంతమొత్తాన్ని దాచుకుని వృద్ధులకు ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. కొంత మొత్తం జమయ్యాక.. నిరాశ్రయులైన వృద్ధులకు బియ్యం, పప్పులు, దుస్తులు వంటి నిత్యావసరాలు సమకూర్చేవాడు. అయితే వారి అవసరాలు తీర్చడానికి మరిన్ని సదుపాయాలు అవసరం అని భావించి... 1996లో 'అనడి సేవా ప్రకల్ప్' పేరిట ఓల్డేజ్ హోమ్‌ను ఏర్పాటు చేశాడు.

అప్పుడు ప్రణవ్‌కు పంతొమ్మిదేళ్లు. వసతి సదుపాయాలు లేక అనాథలుగా మారిన ఒంటరి వృద్ధులను చేరదీసి వసతి, కడుపునిండా ఆహారం పెట్టడం, అవసరమైన ఆరోగ్య అవసరాలు తీర్చుతూ వృద్ధుల జీవననాణ్యతను మెరుగుపరిచాడు. ఒక పక్క ప్రణవ్ ఉద్యోగం చేస్తూనే అనడిని చూసుకునేవాడు. కొన్నాళ్ల తరువాత పూర్తి సమయాన్ని ఆశ్రమానికి కేటాయించడం కోసం 2017లో ఉద్యోగం వదిలేశాడు. అప్పటి నుంచి మరింత సమయాన్ని కేటాయించి ఆశ్రమంలోని వారిని సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం మొదలు పెట్టాడు. వారికి అవసరమైన వైద్యసదుపాయాలు సకాలంలో అందిస్తూ వారిని ఆనందంగా ఉంచేందుకు తనవంతు కృషి చేస్తున్నాడు.

ఆవులు పెంచుతూ...

ఆశ్రమాన్ని నడిపేందుకు.. అవసరమైన ఖర్చుల కోసం అనడి ఫారమ్స్ అండ్ గోదామ్ పేరిట ఆవుల పెంపకాన్ని ప్రారంభించాడు. రెండువందల ఆవులను పెంచుతూ.. వాటి ద్వారా వచ్చే పాలు, పెరుగు, నెయ్యిని విక్రయిస్తూ వచ్చిన ఆదాయాన్ని అనడి ఆశ్రమ వృద్ధుల కోసం ఖర్చు చేస్తున్నాడు. గత ఇరవై ఆరేళ్లుగా అనడిలో ఎంతోమంది వృద్ధులు ఆశ్రయం పొందారు. మలివయస్కుల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న నలభై ఆరేళ్ల ప్రణవ్ సేవకు గుర్తింపుగా అనేక అవార్డులు, గౌరవ సత్కారాలు దక్కడంలో ఆశ్చర్యం లేదు.

'అమ్మాయిలు నటించడం ఏమిటి?' అనే ఆశ్చర్యం నుంచి రంగస్థలానికి వెలుగులు అద్దిన ప్రసిద్ధ నటీమణుల వరకు ఎంతో చరిత్ర ఉంది. రంగస్థలానికి సంబంధించిన చరిత్రలో మరో విశిష్టమైన పేరు ఇందు. లండన్‌లోని ప్రసిద్ధ రాయల్ నేషనల్ థియేటర్‌కు ఇందు రుబసింగంను ఆర్టిస్టిక్ డైరెక్టర్, జాయింట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించారు. 60 సంవత్సరాల చరిత్ర ఉన్న నేషనల్ థియేటర్‌కు మహిళా దర్శకురాలిని 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియమించడం ఇదే తొలిసారి....

ఫస్ట్ టైం

రంగస్థల సింగం



ఇందు

ఇందు తల్లిదండ్రులు ఇంగ్లాండ్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళులు. నాటింగ్‌హామ్ సిటీలోని నాటింగ్‌హామ్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది ఇందు. హల్ యూనివర్శిటీలో థియేటర్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ చేసింది. థియేటర్ రాయల్, స్ట్రాట్‌ఫర్డ్ ఈస్ట్‌లో ట్రైనీ డైరెక్టర్‌గా పనిచేసింది. ఆ తరువాత ఫ్రీలాన్స్ థియేటర్ డైరెక్టర్‌గా పది సంవత్సరాలకు పైగా పనిచేసింది.

ఫ్రీలాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కాలంలోనే లండన్‌లోని 'గేట్ థియేటర్'లో అసోసియేట్ డైరెక్టర్‌గా నియామకం అయింది.

లండన్‌లోని కిల్న్ థియేటర్‌కు 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియామకం కావడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది ఇందు. గతంలో ఈ థియేటర్ శ్వేత జాతీయుల ఆధ్వర్యంలోనే నడిచేది. శ్వేతజాతేతర మహిళా దర్శకురాలు 'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా నియామకం కావడం ఇదే తొలిసారి. కిల్న్ థియేటర్ నిర్వహణలో 'ఆర్టిస్టిక్ డైరెక్టర్' గా తనదైన ముద్ర వేసింది ఇందు. ఆడిటోరియంను ఆధునీకరించి సీట్ల సంఖ్యను పెంచింది.

కొత్త సౌకర్యాలు మాత్రమే కాదు కొత్త నాటకాన్ని థియేటర్‌కు పరిచయం చేసింది.

'రెడ్ వెల్వెట్' 'హ్యాండ్ బ్యాగ్డ్' 'వెన్ ది క్రాస్ విజిట్' 'ఏ వోల్ఫ్ ఇన్ స్నేక్‌స్కిన్ షూస్'...మొదలైన నాటకాలు డైరెక్టర్‌గా ఇందుకు మంచి పేరు తెచ్చాయి. ది ఆర్ట్స్ అండ్ కల్చర్ అవార్డ్, ఏషియన్ ఉమెన్ ఆఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డ్, లిబర్టీ హ్యూమన్ రైట్స్ అవార్డ్... మొదలైన ఎన్నో అవార్డ్‌లు అందుకుంది.

'నాటకరంగాన్ని వినోద మాధ్యమానికి పరిమితం చేయకూడదు. మార్పు తెచ్చే శక్తి నాటకానికి ఉంది. ప్రజలను ఒక దగ్గరకు తీసుకువచ్చి అభిప్రాయాలు పంచుకునేలా, ఆలోచించేలా చేస్తుంది' అంటుంది ఇందు.

కొత్తదనం నిండిన నాటకాలకు ఇందు ప్రాధాన్యత ఇస్తుంది. మానవ సంబంధాలను విభిన్న కోణాల నుంచి విశ్లేషించే నాటకాలను ఎంపిక చేసుకుంటుంది. బీబీసీ రేడియో 4, బీబీసీ రేడియో 3, బీబీసి వరల్డ్ సర్వీస్‌కు సంబంధించి రేడియో నాటికలకు కూడా దర్శకత్వం వహించింది. నేషనల్ థియేటర్‌లో 'ది వెయిటింగ్ రూమ్' 'ది రామాయణ' అనుపమ చంద్రశేఖర్ 'ది ఫాదర్ అండ్ ది అసాసిన్' నాటకాలకు దర్శకత్వం వహించింది. 'ది ఫాదర్ అండ్ ది అసాసిన్'కు బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డ్ అందుకుంది.

కొత్త రచయితలను, నటులను ప్రోత్సహించడంలో ప్రపంచ రంగస్థలానికి పరిచయం చేయడంలో ఎప్పుడూ ముందు ఉంటుంది ఇందు.

'ఇందు నేషనల్ డైరెక్టర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉంది. ఆర్టిస్ట్‌గా, లీడర్‌గా ఆమె అంటే అపారమైన అభిమానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే నాటకాలు రావడానికి, నాటకరంగాన్ని స్ఫూర్తిదాయక శక్తిగా మలిచే విషయంలో ఆమె కొత్త అధ్యాయాన్ని మొదలు పెడతారని ఆశిస్తున్నాను' అంటుంది నేషనల్ థియేటర్ డైరెక్టర్ కేట్ వరహ్.

'ఆర్టిస్టిక్ డైరెక్టర్'గా తన నియామకంపై స్పందిస్తూ...

'నేషనల్ థియేటర్ నా జీవితంలో ముఖ్య పాత్ర పోషించింది. ఇదొక అత్యున్నత గౌరవంగా భావిస్తున్నాను. నాకు సంబంధించి ఇది ప్రపంచంలోనే అత్యున్నత బాధ్యత' అంటుంది ఇందూ రుబసింగం.

> **కొత్త రెక్కలతో...**
> రంగస్థలం అనేది ఒకచోట, ఒకేకాలంలో ఉండిపోదు. కాలంతో పాటు కదులుతుంది. కాలాన్ని ప్రతిబింబిస్తుంది. రంగస్థలానికి ఆలోచనాపరులను ఒకే వేదిక మీదికి తీసుకువచ్చే శక్తి ఉంది. మానవసంబంధాల నుంచి అస్తిత్వ పోరాటాల వరకు ఎన్నో అంశాలకు నాటకం అద్దం పడుతుంది. సాంకేతిక పరంగానే కాదు ఇతివృత్త పరంగా కూడా నాటక రంగం కొత్త దారిలో వెళుతుంది. రంగస్థల ప్రపంచంలో కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. కొత్త ఆలోచలకు రెక్కలు వస్తున్నాయి.
> – ఇందు రుబసింగం, రంగస్థల దర్శకురాలు



'ది ఫాదర్ అండ్ ది అసాసిన్' నాటకంలో...

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

జీవితాన్ని యోగవంతం చేసుకుంది

**చిన్న వయసులో పెళ్లి..
పుట్టింటి పుల్లవిరుపులను అత్తింటి ఆరళ్లను
తన యోగాసనాలతో అడ్డుకుని, తనతోపాటు, ఇతరులనూ...
ఆయురారోగ్యాలతో ఆనందంగా
జీవించేలా చేస్తోంది ఫైజా సైఫీ.**



ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో పుట్టింది ఫైజా సైఫీ. నలుగురు సంతానంలో పెద్దమ్మాయి. ఫైజా తండ్రి ఫరీదాబాద్‌లో పనిచేసేవారు. దీంతో ఫైజా కూడా అక్కడే చదివింది. కాస్త పెద్దయ్యేసరికి ''మనం మన సంప్రదాయాలు కచ్చితంగా పాటించాలి'' అని ఇంట్లో వారు చెప్పేవాళ్లు. వయసుతోపాటు నిబంధనలు పెరిగాయి. తనకు నచ్చని ఆంక్షలు పాటించడానికి ఫైజా ఒకపట్టాన ఇష్టపడేది కాదు. టీనేజ్‌లోకి రాగానే ''ఇది చేయకూడదు, అది చేయకూడదు, అలా ఉండు, ఇలా ఉండు'' అని చెప్పేవారితో 'అలా ఎందుకు?' అని వాదిస్తుండేది.

''అత్తారింటికి వెళ్లాక పనులన్నీ నువ్వే చేయాలి'' అని చెప్పినప్పుడు తనకు ఇష్టం లేకపోయినా... ఉదయం నాలుగ్గంటలకే లేచి ఇంటిపనులు చేసేది. స్కూలు నుంచి వచ్చాక కూడా ఇంటిపనులు చూసుకోక తప్పేది కాదు. ఇలా పనులు చూసుకుంటూనే 2003లో పదో తరగతి పాసైంది. ఆ తరువాత ఢిల్లీ సంబంధం వస్తే పెళ్లిచేశారు ఫైజాకు.

ఇల్లు కాస్తా జైలైంది...

పెళ్లి అంటే ఏంటో తెలియని వయసులో .. తనకంటే బాగా ఎక్కువ వయసు ఉన్న వ్యక్తితో వివాహం జరిగింది. భర్తకు మూర్ఛరోగంతో పాటు మానసిక సమస్యలు ఉండడంతో కోపం వచ్చినప్పుడల్లా ఫైజాను విపరీతంగా కొట్టేవాడు. దీనికితోడు పుట్టింట్లో ఎప్పుడూ ధరించని బురఖాను అత్తారింట్లో తప్పనిసరిగా వేసుకోవాలని హుకుం జారీ చేశారు. దీంతో ఫైజాకు జైల్లో ఉన్నట్లు అనిపించింది. రోజంతా గొడ్డు చాకిరి... అడుగడుగుకీ ఆంక్షలు... అత్తారింటి బాధలు భరించలేక అమ్మావాళ్ల దగ్గర గోడు వెళ్లబోసుకున్నా..''సమాజంలో పరువు, మర్యాదలు...'' అని చెప్పి నోరు మూయించేవారు. ఎవరికీ చెప్పుకోలేక తనలో తాను కుమిలిపోయేది ఫైజా.

పిల్లలు పుట్టాక కూడా..

అత్తారింట్లో ప్రసవం అయిన తరువాత వారానికే ఇంటి పనులు ఫైజా నెత్తిన పడ్డాయి. పెద్దకుటుంబం కావడంతో.. ఒక్కొక్కరు ఒక్కో రకమైన రుచిని కోరుతూ తను చేయగలదా... లేదా... అని కూడా చూడకుండా ఆమెను వండమని బలవంతం చేసేవాళ్లు. దీంతో ఫైజా నడుము నొప్పి, మైగ్రేన్, థైరాయిడ్, ఆస్తమాల బారిన పడి బాగా నీరసించిపోయింది. తిన్నావా? మందులు వేసుకున్నావా? అని అడిగేవారు ఒక్కరూ లేరు. ఇంత కష్టంలోనూ.. తన రెండున్నరేళ్ల కొడుకుని ప్లేస్కూల్లో దింపడానికి వెళ్లేది ఫైజా. అక్కడ పరిచయమైన టీచర్‌తో .. తనకు చదువుకోవాలని ఉందంటూ తన ఇంటి పరిస్థితులను వివరించి చెప్పింది. అప్పుడు టీచర్ ప్రైవేటుగా చదువుకోవచ్చని సలహా చెప్పడంతో చదవడం ప్రారంభించింది. పరీక్షలు ఉన్నప్పుడు పుట్టింటికి వెళ్లి అక్కడనుంచి రాసేది. పెద్దబాబుకి ఐదేళ్లు వచ్చేటప్పటికి రెండో బాబు కడుపులో పడ్డాడు. ఈసారి ఫైజా ఆరోగ్యం మరింత క్షీణించింది. మెడ నొప్పి, హై బీపీ వంటి సమస్యలు తలెత్తాయి.

టీవీలో యోగా చూసి...

ఒకరోజు ఫైజా ఆరోగ్యం బాగా క్షీణించడంతో పుట్టింటికి పంపించేశారు. అక్కడ ఆయుర్వేద మందులు వాడడంతో కొంత ఉపశమనం లభించింది. ఆ తరవాత రెండో బాబును ప్రసవించింది. ప్రసవం తరువాత పదిహేనురోజులు పుట్టింటిల్లోనే ఉంది. ఆ సమయంలో ఒకరోజు టీవీలో వస్తోన్న యోగా కార్యక్రమాలను చూసింది. యోగాతో అనారోగ్యాలు నయం అవుతాయని తెలుసుకుని యోగా నేర్చుకోవడం ప్రారంభించింది. ఎవరికీ తెలియకుండా ఆసనాలు వేసేది. ఆసనాలు వేసేకొద్దీ తన ఆరోగ్యం కుదుటపడడం గమనించింది ఫైజా. యోగా గురించి ఇతరులకు సలహాలు ఇస్తుండేది. రహస్యంగా ఇంటర్మీడియట్ పూర్తిచేసిన తరువాత హిమాలయ యూనివర్శిటీలో యోగా, ఆక్యుప్రెజర్ థెరపీ, ఆయుర్వేదంలో డిప్లొమా చేసింది.

> **ఆరోగ్యంగా.. ఆనందంగా**
> నాకు ఢిల్లీ, ముంబై, అమెరికా, కువైట్‌ల నుంచి క్లైంట్లు ఉన్నారు. ఆన్‌లైన్ తరగతులు చెబుతున్నాను. ఏళ్లపాటు ప్రయత్నించినా గర్భం దాల్చని వారు సైతం నేను అందించే ప్రత్యేకమైన యోగా థెరపీ ద్వారా పిల్లల్ని కంటున్నారు. నా దగ్గర యోగా నేర్చుకునేవారిలో చాలామంది ... జీపీ, గుండె సమస్యలు, అధిక బరువు, డయాబెటిస్, థైరాయిడ్, ఆందోళన, నిరాశా నిస్పృహల నుంచి బయటపడి ఆరోగ్యంగా ఆనందంగా జీవిస్తున్నారు. తమ్ముడు, చెల్లి కూడా నా దగ్గర యోగా నేర్చుకుని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకుంటున్నారు. యోగా నాతోపాటు చాలామందిని ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో నిలబెడుతోంది. యోగా వల్లే ఈ రోజు నేను, నా ఇద్దరు కొడుకులు ఆరోగ్యంగా, ఆనందంగా బతక గలుగుతున్నాం. అమ్మాయిలూ... మీ నిర్ణయాలు మీరే తీసుకోండి. ఎవరి మీదా ఆధారపడకండి. ఇతరుల మీద ఆధారపడినంత కాలం ఆత్మవిశ్వాసం కోల్పోతారు. మిమ్మల్ని మీరు నమ్ముకుంటే.. నాలాగా ఏదైనా సాధించగలుగుతారు.
> – ఫైజా సైఫీ

ఆ రోజు రానేవచ్చింది

ఫైజా ఎవరికీ తెలియకుండా చదువుకున్నప్పటికీ అత్తారింట్లో అన్నీ తెలిసిపోయాయి... దాంతో ఆమెను కొత్తరకంగా హింసించడం అకారణంగా చేయి చేసుచేసుకోవడం మొదలు పెట్టారు. ఫైజా భర్త ట్రిపుల్ తలాఖ్ చెప్పి, రెండో పెళ్లికి రెడీ అయిపోయాడు. అంతటితో ఫైజాకు అత్తారింటితో సంబంధాలు తెగిపోయాయి. పుట్టింటిలో కొన్నిరోజులు ఉన్న తరువాత ..''నీ వల్ల చెల్లెళ్లు, తమ్ముళ్లకు పెళ్లిళ్లు కావు. నువ్వు మీ అత్తారింటికి వెళ్లు. అక్కడే సర్దుకుపో'' అని సతాయించడం మొదలు పెట్టారు ఫైజా తల్లిదండ్రులు. దాదాపు పదేళ్లపాటు అత్తారింట్లో అనుభవించిన నరకాన్ని మళ్లీ ఎదుర్కోవాలనుకోలేదు ఫైజా. తల్లిదండ్రులకు చెప్పినా అర్థం చేసుకోరు. వేరే దారిలేక తన పిల్లలను తీసుకుని ఫరీదాబాద్‌లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. ఇక్కడ రెడ్ క్రాస్ సొసైటీ సాయం, మరోపక్క రూమ్‌మేట్స్ కూడా పిల్లలను ఉంచుకోవడానికి ఒప్పుకోవడంతో ఉద్యోగంలో చేరింది.

యోగా టీచర్‌గా..

స్కూల్లో టీచర్‌గా చేరిన ఫైజా యోగా తరగతులు చెప్పేది. అలా చెబుతూ 2013లో 'ఫైజా యోగా' పేరుతో సొంతంగా ఇన్‌స్టిట్యూట్‌ను పెట్టుకుంది. ప్రారంభంలో రోజుకి యాభైగా ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడు ఐదువందలకు పైకి చేరింది. ఇన్‌స్టిట్యూట్‌లో తరగతులేగాక యోగా క్యాంప్స్‌కూడా నిర్వహిస్తోంది ఫైజా. ఫీజులు చెల్లించలేనివారికి ఉచితంగా యోగా నేర్పించి వారిని యోగా ఇన్‌స్ట్రక్టర్‌లుగా మారుస్తోంది. ఫైజా ఇన్‌స్టిట్యూషన్ గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సైతం ఆమెతో సంబంధాలను పునరుద్ధరించుకోవడం మొదలుపెట్టారు.

అలా ఆమె జీవితం యోగవంతం అయింది.

లైఫ్@360

పేరెంటింగ్



బాధ్యతతో పెంచుతున్నారా?

చాలామంది తల్లిదండ్రులు తాము పడ్డ కష్టాలను తమ పిల్లలు అనుభవించ కూడదనే ఉద్దేశ్యంతో వారిని అతి గారం చేస్తుంటారు. తమకు ఉన్నా లేకున్నా, వారికి కావలసిన అన్ని వసతులూ, సౌకర్యాలూ సమకూర్చుతూ, వారికి కష్టం అనేది తెలియకుండా పెంచుతుంటారు. అయితే అది చాలా తప్పు. వారికి బాల్యం నుంచి బాధ్యతలు తెలియజేయాలి. అలాగని వారి నెత్తిమీద బాధ్యతల బరువు వెయ్యడం కాదు... వారి బాధ్యత వారికి తెలిసేలా చేయడమే బాధ్యతతో కూడిన పెంపకం.

పంచుకోవడం అన్నది పిల్లలకి తప్పనిసరిగా నేర్పాల్సిన వాటిలో ఒకటి. దానివల్ల ఇతరులతో స్నేహ బాంధవ్యాలు పెరుగుతాయి. ఒకరి అవసరం మరొకరికి తెలుస్తుంది. కొంతమంది పిల్లలు స్కూలు నుండి రాగానే, పుస్తకాల సంచీ అక్కడే ఏ సోఫాలోనో పారేసి, విడిచిన బట్టలని, చెప్పులని ఒకపక్కకి వదిలేస్తారు. అటువంటప్పుడు వారికి ఆ వస్తువుల విలువ, అవసరం తెలియజేస్తూ, క్రమపద్ధతిలో భద్రపరచుకునేట్లు వారికి అలవాటు చేయాలి. అంతేకాదు, వారు అడిగినవన్నీ వెంటనే తెచ్చి ఇవ్వకుండా మంచి మాటలతో బుజ్జగించి దారికి తేవాలి.

ఎదిరించి మాట్లాడుతుంటే...

పెద్దవాళ్ళని ఎదిరించి మాట్లాడే పిల్లలని చూస్తుంటాం. మొదట తల్లిదండ్రులు తమ పెద్దలని గౌరవిస్తే, అదే బాటలో పిల్లలూ నడుచుకుంటారు. గురువులు, పెద్దలు, వృద్ధులను తల్లిదండ్రులు గౌరవిస్తే పిల్లలు అదే అలవాటు చేసుకుంటారు.

షాపింగ్

షాపింగ్‌కి వెళ్ళినపుడు, పిల్లలని తమతో తీసుకెళుతుంటారు. అక్కడ వారికి సెల్‌ఫోన్ చేతికిచ్చి ఒకచోట కూర్చోబెట్టి తాము షాపింగ్ చేసుకుంటారు. అలా కాక తమ పిల్లలని కూడా తమతో ఉంచుకుంటే ఒక వస్తువు కొనేటప్పుడు తమ తల్లిదండ్రులు ఆ వస్తువు నాణ్యతని ఎలా పరీక్షిస్తున్నారో, ఎలా ఎంచుకుంటున్నారో అన్న విషయాలు తెలుసుకోవటంతో పాటు అక్కడ ఏమేమి రకాలు ఉన్నాయి, తమకు ఏమి కావాలి, ఏవి ఉపయోగం అన్నది గ్రహించుకోగల్గుతారు.

మంచి మాటలతో

సహజంగా పిల్లలు అల్లరి బాగా చేస్తుంటారు. ఆ అల్లరి మోతాదు మించిపోతుంటుంది. వస్తువులు పాడవటం, విరగటం, పగిలి పోవటం కూడా జరుగుతుంటుంది. ఆ సమయంలో ఎంత కోపం వచ్చినా, ఆ పాడయిన వస్తువు గురించే మాట్లాడాలి కాని పిల్లవాడి మనస్తత్వం గురించి మాట్లాడకూడదు. ఆ వస్తువు భద్రత గురించి చెప్పాలి. మరొకసారి ఆ తప్పు చేయకుండా ఉండేలా చేయాలి.

పాకెట్ మనీ

సాధారణంగా పిల్లలు కొంచెం ఎదిగాక, వారికి వారి ఖర్చుల నిమిత్తం కొంత సొమ్ము ఇస్తుంటారు. వారు ఎలా ఖర్చు పెట్టుకున్నా పట్టించుకోరు. ఇది సరి కాదు. వారు ఆ డబ్బును ఎందుకు... ఎలా ఖర్చు చేస్తున్నారో పద్దు రాయమనాలి. వాటిని చెక్ చేసి, అందులో అనవసర ఖర్చులుంటే వాటిని ఎత్తి చూపాలి. దీనివల్ల పిల్లలకి మనీ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

టైమ్ మేనేజ్‌మెంట్

ఉదయం లేచే సమయం, భోజన సమయం, చదువుకునే సమయం, ఆటలాడే సమయం, పడుకునే సమయం.. ఇలా అన్నింటికీ ఒక టైం టేబుల్ తయారు చేయాలి. ఇది ఎంతో అవసరం.

కలిసి భోజనం చేయడం

వారానికి ఒక్కరోజు అయినా అందరూ కలిసి భోజనం చేయాలి. అలా చేయటం వల్ల బయటకు వెళ్ళి, ఇతరులతో కలిసి భోజనం చేయాల్సొచ్చినప్పుడు, తల్లిదండ్రులు పిల్లలకు తినిపించాల్సిన అవసరం ఉండదు.

చదువు

చదువు అని పోరాటం కాదు, ఎలా చదువుకోవాలో, చదువు ప్రాముఖ్యత ఏమిటో తెలియపరిస్తే వారు చదువుని కష్టపడి కాకుండా, ఇష్టపడి చదువుతారు.

థాంక్స్.. సారీ..!

ఎదుటి వారికి ఇబ్బంది కలిగించినపుడు సారీ చెప్పటం, ఎవరి దగ్గరైనా ఏ వస్తువునైనా, లేదా సహాయాన్నైనా పొందితే కృతజ్ఞత చెప్పటం అలవరచాలి.

బాల్యం నుంచే పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించడం, ఇరుగు పొరుగుతో, తోటివారితో మర్యాదగా మెలగడం, ఉన్నదానిని కలిసి పంచుకోవడం వంటి వాటిని నేర్పిస్తూ, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి.

కీళ్ళ నొప్పులా..? ఇలా చేసి చూడండి...

చలికాలం వచ్చిందంటే చాలు కీళ్ల నొప్పులు,ఒంటి నొప్పులతో బాధ పడే వారి సంఖ్య బాగా పెరుగుతుంది. చాలా మందికి చలికాలంలో కీళ్ల నొప్పులతో లేచి నడవలేని పరిస్థితి కూడా ఉంటుంది. ఇక ఉదయం పూట పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంటుంది. కీళ్లు గట్టి పడిపోవడం, జాయింట్లు సహకరించకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటి వారు చలికాలంలో కీళ్ల నొప్పుల నుండి, ఒంటి నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు.



చలికాలంలో వాతావరణంలోని చల్లదనానికి కీళ్లమధ్యలో ఉండే మృదువైన కార్టిలేజ్ కుచించుకుపోతుంది. చర్మం, కండరాలు బిగుసుకుపోతాయి. అందుకే చాలా మందికి చలి కాలంలో కీళ్ల సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా ఆడవాళ్లలో రక్తహీనత కారణంగా కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తుంటాయి. అందుకే ఈ సీజన్‌లో శరీరాన్ని వీలైనంత వెచ్చగా ఉంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. కీళ్ల నొప్పులను తేలిగ్గా తీసుకోకూడదు. చలికాలంలో వచ్చే సాధారణ కీళ్ల నొప్పులను తగ్గించడానికి తేలికపాటి వ్యాయామాలు చేయాలి. ముఖ్యంగా భుజాలు, తొడ కండరాలు గట్టిపడే వ్యాయామాలు చేస్తే కీళ్లపై ఒత్తిడి పడదు. అలాగే గంటల తరబడి కూర్చొని పనిచేసే వాళ్లు అప్పుడప్పుడు లేచి అటు ఇటు నడుస్తుండాలి. నొప్పి నుంచి తక్షణ ఉపశమనం కోసం వేడినీళ్ల కాపడం, మసాజ్, ఫిజియోథెరపీ వ్యాయామాలు లాంటివి ఉపయోగపడతాయి. కీళ్ల అరుగుదల, కీళ్లవాతం లాంటి సమస్యలు ఉన్నవాళ్లు చలికాలంలో డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. కీళ్లు మరీ వీక్‌గా ఉన్నవాళ్లు డాక్టర్ల సలహా మేరకు క్యాల్షియం, విటమిన్ డి మాత్రలు వేసుకోవచ్చు. ఇక వీటితోపాటు చలికాలంలో జంక్ ఫుడ్ తగ్గించి శరీరంలో వేడిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్స్, క్యాల్షియం, విటమిన్–డి, ప్రొటీన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. కీళ్లను వెచ్చగా ఉంచుకునేందుకు మందపాటి బట్టలు వేసుకోవాలి. శరీరాన్ని చలికి ఎక్స్‌పోజ్ అవ్వకుండా చూసుకోవాలి.

చలికాలంలో సూర్యరశ్మి శరీరానికి కావలసినంత అందకపోవడం వల్ల విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. విటమిన్–డి లోపాన్ని తగ్గించుకోవడానికి విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకోవడం ఎంతో మంచిది.

సల్ఫర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నా, క్యాల్షియం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నా కాస్త కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు బాధిస్తున్న వారు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకుంటే మంచిది. నారింజ, క్యాబేజీ, బచ్చలికూర, టమోటాలు వంటి వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం మరీ మంచిది.

చలికాలంలో మనకు తెలియకుండానే తక్కువ నీటిని తీసుకుంటాం కాబటి బాడీ డీహైడ్రేషన్ కు గురవుతుంది. దానివల్ల కీళ్ల నొప్పులు ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటాయి. అందువల్ల అది గుర్తుంచుకుని కీళ్లనొప్పులతో బాధపడేవారు శరీరం డీ హైడ్రేట్ కాకుండా తగినంత నీటిని తాగడం మంచిది.

బచ్చలికూర బంగారం!



మనకు అందుబాటులో ఉండే అనేక రకాల ఆకుకూరల్లో బచ్చలి కూర ఒకటి. కానీ, బచ్చలికూరను చాలామంది ఇష్టపడరు.. అయితే, బచ్చలికూరలో దాగివున్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే మాత్రం నిజంగా బంగారమే అంటారు. బచ్చలి కూర లో విటమిన్ ఎ, సి, ఇ, కె, మెగ్నీషియం, ఫోలేట్, పొటాషియం, ఐరన్, కాపర్ పుష్కలంగా ఉన్నాయి. ఇది ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, డైటరీ ఫైబర్, ఫ్లేవనాయిడ్స్‌కు భాండాగారం.

రక్తహీనతతో బాధపడే వారికి బచ్చలి కూర దివ్యౌషధంలా పని చేస్తుంది. శరీరంలో రక్తం తక్కువగా ఉన్నవారు తమ రోజు వారి ఆహారంలో బచ్చలికూరను చేర్చుకుంటే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడగలరని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ పేషెంట్లు బచ్చలి ఆకులను రసంగా చేసుకుని తాగుతుంటే..రక్తపోటు అదుపులో ఉంటుంది.

అంతేకాదు.. బచ్చలి కూర గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బచ్చలికూరను తరచూ తీసుకోవటం ద్వారా శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొలెస్ట్రాల్ కరుగుతుంది. బచ్చలి కూరలో ఉండే కాల్షియం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. బచ్చలి కూరలో అధికంగా ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, నియాసిన్, సెలీనియం నరాల ఆరోగ్యానికి, మెదడు ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయి. అంతేకాదు, మూత్రంలో మంట, ఇన్ఫెక్షన్ వంటి సమస్యలతో బాధపడేవారు రెగ్యులర్‌గా బచ్చలి కూరను తీసుకోవడం వల్ల మూత్ర విసర్జనలోని సమస్యలు తొలగిపోతాయి. పైల్స్, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలతో బాధపడేవారు బచ్చలికూరను తింటే ఈ సమస్యనుంచి ఉపశమనం లభిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

మీకు తెలుసా?

కాలీఫ్లవర్ వల్ల గ్యాస్...అలర్జీ



కాలీఫ్లవర్‌తో వివిధ రకాల వంటకాలు తయారు చేసుకుని చాలా మంది ఇష్టంగా తింటారు. కాలీఫ్లవర్‌లోని పోషకాలు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అయితే కాలీఫ్లవర్‌ను అతిగా తినడం వల్ల కడుపు ఉబ్బరంతోపాటు జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతాయి. ముఖ్యంగా వీటిని పచ్చిగా తింటే పొట్టలో గ్యాస్ సమస్య, జీర్ణక్రియ సమస్యలతో పోరాడక తప్పదు. కాలీఫ్లవర్‌లో ఉండే గ్లూకోసినోలేట్స్ అనే సల్ఫర్ కలిగిన రసాయనాలు కడుపులోకి ప్రవేశించినప్పుడు, అవి హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి సమ్మేళనాలను ఏర్పరుస్తాయి.

ఇది కడుపులో వాయువును సృష్టిస్తుంది. అందువల్లనే, కాలీఫ్లవర్ తిన్న తర్వాత కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది. థైరాయిడ్ సమస్య..కాలీఫ్లవర్ వంటి కూరగాయలు గ్రంథుల పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి. హైపోథైరాయిడిజం వంటి సమస్యలతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకపోవడం మంచిది. అలెర్జీ ప్రమాదం..కొందరికి కాలీఫ్లవర్ తినడం వల్ల చర్మంపై దురద, దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి.

హెల్త్ టిప్స్

మాటలు సరిగ్గా రానివారి కోసం...



వసకొమ్ముని దంచి చూర్ణం చేసుకుని ఆ చూర్ణాన్ని ఒక పాత్రలో పోసి ఆ చూర్ణం నిండేవరకు ఉసిరికాయల రసం పోసి బాగా కలిపి ఒక రాత్రి నానబెట్టి తరువాత ఎండబెట్టాలి. బాగా ఎండిన తరువాత మళ్లీ దంచి మెత్తగా తయారు చేసుకుని ఆ చూర్ణాన్ని రోజూ పూటకు మూడు గ్రాముల మోతాదుగా ఒక చెంచా తేనె కలిపి రెండు పూటలా సేవిస్తూ ఉంటే మాటలు తడబడే వారికి, మాటలు ముద్దగా పలికేవారికి , ఆగి ఆగి మాట్లాడేవారికి ఆ సమస్యలు తొలగి మాటలు స్పష్టంగా వస్తాయి.

లేత మర్రి ఊడలు సాన పైన అరగదీసి ఆ గంధాన్ని నాలిక పైన రాస్తున్నా మాటలు త్వరగా వస్తాయి.

క్షయరోగానికి...

క్షయ... అదేనండీ... టీబీతో ఇబ్బంది పడేవారు అశ్వగంధ పొడిని పాలల్లో కలిపి తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు బలం చేకూరటమే కాక శరీర రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. నిద్రలేమి కూడా తగ్గుతుంది.

గొంతులో కఫం

వామాకు, తులసాకు, తమలపాకుని రోజూ తింటూ ఉంటే గొంతులో కఫం తగ్గిపోతుంది. మెత్తగా దంచి జల్లించిన కరక్కాయ పొడిని తేనెలో రంగరించి రెండు పూటలా చప్పరించినా గొంతులో గరగర, శ్లేష్మం పడటం వంటి సమస్యలు తొలగిపోతాయి.

సినిమా

అవసరమైన మేరకే కండలు పెంచాను

\- ప్రభాస్



"సలార్' సినిమాలోని పాత్రల మధ్య చక్కని భావోద్వేగాలు ఉంటాయి. ముఖ్యంగా రెండు పాత్రల మధ్య చక్కని సోదర భావాన్ని చూస్తారు. ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని పాత్రలో నన్ను చూస్తారు. అలా అని ఈ పాత్ర కోసం నేనేం ప్రత్యేకంగా కష్టపడలేదు. పాత్రకు అవసరమైన మేరకే కండలు పెంచాలని దర్శకుడు ప్రశాంత్ ముందే చెప్పారు. నా కెరీర్‌లో గడచిన 21 ఏళ్లలో నేను మారిన దానితో పోల్చుకుంటే 'సలార్' సినిమా కోసం జరిగిన మార్పులు చాలా సాధారణమైనవని నాకనిపించింది" అన్నారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. 'సలార్' చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాస్ ఓ ఆంగ్ల మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఈ విధంగా...

- ప్రశాంత్ నీల్‌తో సినిమా చేయాలని చాలా ఆసక్తిగా ఎదురు చూశాను. మా (హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్) కాంబినేషన్‌లో సినిమా ఎలా ఉంటే ప్రేక్షకులందరినీ ఆకట్టుకుంటుందనే విషయంపై నేను, ప్రశాంత్ బాగా చర్చించుకున్నాం. వర్క్‌షాప్స్ కూడా చేశాం. సినిమా గురించిన నా ఆలోచనలను ఆయనతో పంచుకున్నాను. వాటిలో కొన్ని ప్రశాంత్‌కు నచ్చాయి. నా పాత్రను ఎలా చూపించాలనుకుంటున్నాడో ఆ విషయాలను నాకు చాలా విపులంగా చెప్పాడు. కథకు తగ్గట్టు నా బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలో కూడా మాట్లాడుకున్నాం. 'సలార్' సినిమా చిత్రీకరణ మొదలైన నెల రోజుల్లోనే ఇద్దరం మంచి స్నేహితులైపోయాం. ఈ సినిమా షూటింగ్ చాలా సరదాగా గడిచింది.
- హీరోలను తెరపై గొప్పగా చూపించాలనుకునే దర్శకుడు ప్రశాంత్ నీల్. నేను సెట్స్‌లోకి అడుగుపెట్టగానే అంతా ఆపేసి హీరో సీన్స్‌ని చిత్రీకరించడానికి టీమ్ సిద్ధమయ్యేది. నేను ఎప్పుడూ షాట్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఏర్పడలేదు. ప్రశాంత్ అలాంటి జాగ్రత్తలు తీసుకున్నాడు. ఎప్పుడూ ముందుగానే ఏర్పాట్లను పూర్తి చేసేవాడు. ఇక నేను, శ్రుతీహాసన్, పృథ్వీరాజ్ కలిశామంటే షూటింగ్ ఇంకా సరదాగా గడిచేది. 'సలార్' సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు.

వ్యూహం... నేను నమ్మిన రియాలిటీ

\- దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ



● దాసరి కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

"నేను తీసినటువంటి విభిన్న రకాలైన సినిమాలు ఎవరూ తీయలేదు. రాజకీయ నాయకులు, పోలీసులు.. ఇలా ఎవరైనా కావొచ్చు. నాకు పవర్‌ఫుల్ వ్యక్తుల బయోపిక్‌లు తీయడం అంటే ఇష్టం" అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. అజ్మల్, మానస ముఖ్య తారలుగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మించిన చిత్రం 'వ్యూహం'. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం 'వ్యూహం: 1' ఈ నెల 29న విడుదల కానుంది. మలి భాగం 'శపథం' పేరుతో జనవరి 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వ్యూహం: 1' రెండో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– "అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపలేరు. 'వ్యూహం' సినిమా రిలీజ్‌ను ఎవరూ ఆపలేరు అని నేను గతంలోనే చెప్పాను. ఇప్పుడు నేను, కిరణ్‌గారు కలిసి నిరూపించాం. క్లీన్ యూతో మాకు సెన్సార్ సర్టిఫికెట్ ఎలా వచ్చింది? అనేది సీక్రెట్. వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారు మరణించిన సమయం నుంచి 2023 వరకు 'వ్యూహం' సినిమా మొత్తం కథనం ఉంటుంది. వైఎస్ జగన్‌గారు ముఖ్యమంత్రి అయ్యే వరకు తొలి భాగం ఉంటుంది. ఈ క్రమంలో ఎవరెవరు ఏయే వ్యూహాలు రచించారు వంటి ప్రధాన ఘటనలు ఈ సినిమాలో ఉంటాయి. 'వ్యూహం' తొలి భాగంలో ఏవైనా సందేహాలు కలిగితే అవి రెండో భాగంలో నివృత్తి అవుతాయి. నిజ జీవితంలోని వ్యక్తులు, వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. కానీ నేను నమ్మిన రియాలిటీతోనే 'వ్యూహం' ఉంటుంది. సినిమా అంటేనే నాటకీయత. కాబట్టి ఈ సినిమాలో ఆ నాటకీయత కూడా ఉంటుంది. ప్రేక్షకులకు తెలియని విషయాలు కూడా ఈ సినిమాలో ఉంటాయి. 'వ్యూహం' సినిమాలో కామెడీ పాత్ర కూడా ఉంది. ఆ పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. భవిష్యత్తులో 'వ్యూహం' తరహా సినిమాలను నేను తీస్తానా? అంటే చెప్పలేను. ఎందుకంటే నా మాటపై నేను నిలబడను" అని అన్నారు. "రామ్‌గోపాల్ వర్మగారితో నేను గతంలో 'వంగవీటి' సినిమా చేశాను. ఆ తర్వాత మళ్లీ సినిమా చేయాలనుకున్నప్పుడు 'వ్యూహం', 'శపథం' ప్రాజెక్ట్స్ మొదలయ్యాయి. ప్రతి వారం థియేటర్స్‌లోకి మూడు నాలుగు సినిమాలు రావడం సహజమే. అన్నింటికీ థియేటర్లు దొరుకుతాయి. మా 'వ్యూహం' సినిమాను ఎక్కువ థియేటర్స్‌లోనే రిలీజ్ చేస్తాం" అన్నారు నిర్మాత దాసరి కిరణ్.

ఆంధ్రప్రదేశ్ సీయం వైఎస్ జగన్‌గారితో నాకు పరిచయం లేదు. అయితే జగన్‌గారంటే నాకు పాజిటివ్ అభిప్రాయాలు ఉన్నాయి. సీబీఎన్‌గారంటే కూడా నాకు ఇష్టమే. విలన్స్ అన్నా నాకిష్టమే. 'నా వెనక ఉండే నీకు అర్థం కాదు తమ్ముడు (ఓ పాత్రధారి).. తన ఊపు చూస్తుంటే ఏదో కొత్త పార్టీ పెట్టేసేలా ఉన్నాడు (మరో పాత్రధారి). క్షవరం అయితే కానీ వివరం తెలియదు అని ఊరికే అనలేదు పెద్దలు (ఓ పాత్రధారి)' అనే డైలాగ్స్ సినిమాలో ఉన్నాయంటే... చిరంజీవి, పవన్ కల్యాణ్ ఇంట్లో పని చేసినవారిని సంప్రదించి, నేను నమ్మిన అంశాలతో ఈ సినిమాలో కొన్ని డైలాగ్స్ పెట్టాం. అసలు.. జనసేనలో పవన్‌కల్యాణ్ టీడీపీ కోవర్ట్‌గా పని చేస్తున్నాడని నా అభిప్రాయం. పవన్ పార్టీ పెట్టినప్పుడు అతన్ని అభిమానిస్తున్నట్లుగా మాట్లాడాను. కానీ అతనిలో స్థిరత్వం లేదు. ఇక తెలంగాణలో ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ప్రతిపక్ష పార్టీ లేదని నా అభిప్రాయం. ఎన్నికల్లో ఎవరెవరు నిలబడుతున్నారు? వారు ఏమేం హామీలు ఇస్తున్నారనే రాజకీయ పరిజ్ఞానం నాకు లేనప్పుడు ఎన్నికల్లో ఓటు వేయడం కరెక్ట్ కాదని, ఓ బాధ్యత గల పౌరుడిగా నేనిప్పటి వరకూ ఓటు వేయలేదు.

\- రామ్‌గోపాల్ వర్మ

లేదంటే మాటొచ్చేత్తది!



● నాగార్జున, 'అల్లరి' నరేశ్

అంజిగా మారిపోయారు 'అల్లరి' నరేశ్. నాగార్జున హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇందులోని కీలకమైన అంజి పాత్రను 'అల్లరి' నరేశ్ చేస్తున్నారు. శుక్రవారం 'అల్లరి' నరేశ్ పాత్ర అంజిని గురించిన గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. "మా అల్లరి అంజిగాడ్ని పరిచయం చేస్తున్నాం. లేదంటే మాటొచ్చేత్తది" అంటూ 'అంజి' గ్లింప్స్ వీడియోను షేర్ చేశారు నాగార్జున. "చేసేయ్.. చేసేయ్.. లేదంటే మాటొచ్చేత్తది" అనే డైలాగ్ చెప్పారు 'అల్లరి' నరేశ్. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి.

ఒక రోజు వస్తది..



● రానా, రవికాంత్ పేరేపు, రోషన్, రాఘవేంద్ర రావు, మానస, అనిల్, వివేక్

ప్రముఖ యాంకర్ సుమ కనకాల తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'బబుల్‌గమ్'. మానసా చౌదరి హీరోయిన్‌గా నటించారు. రవికాంత్ పేరేపు దర్శకత్వంలో మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రానా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు, దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్ లాంచ్ అనంతరం రాఘవేంద్ర రావు మాట్లాడుతూ– "ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే సూపర్‌హిట్ కళ కనిపిస్తోంది. రోషన్, మానసల కెమిస్ట్రీ బాగుంది" అన్నారు. "రోషన్‌కు ప్రేక్షకుల అభిమానం దక్కాలని కోరుకుంటున్నాను" అన్నారు రానా. "యూత్‌కు కావాల్సిన అంశాలు ఉన్న చిత్రమిది. రోషన్ యూనిక్‌గా ఉన్నాడు" అన్నారు అనిల్ రావిపూడి. "జీవితంలో ఏదో ఒక సందర్భంలో పగ తీర్చుకోవాలనిపిస్తుంటుంది. ఈ సినిమాలో ఆది (రోషన్ పాత్ర పేరు) పాత్ర మాటల్లో చెప్పాలంటే 'ఒక రోజు వస్తది.. ఆ రోజు చెవులు మూసుకున్నా వినపడతా.. కళ్లు మూసుకున్నా కనపడతా..'. రానా అన్న మా అందరికీ స్ఫూర్తి. రాఘవేంద్రరావు, అనిల్ గార్లు ఈ వేడుకకు రావడం హ్యాపీగాగా ఉంది" అన్నారు రోషన్. "ట్రైలర్ కంటే సినిమా ఇరవై రెట్లు హై ఇస్తుంది" అన్నారు రవికాంత్ పేరేపు. "'బబుల్‌గమ్' ట్రైలర్ యూత్‌ఫుల్‌గా ఉంది. ఈ మధ్య 'బేబీ' చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఈ సినిమా కూడా అంత పెద్ద హిట్టవుతుందని ఆశిస్తున్నాను" అన్నారు నిర్మాత వివేక్ కూచిభొట్ల. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల పాల్గొన్నారు.

థ్రిల్లింగ్ రుధిరాక్ష



● ఆది, జేడీ చక్రవర్తి, సముద్ర ఖని, రాజు జువ్వల

ఆది సాయికుమార్ హీరోగా జేడీ చక్రవర్తి, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటించనున్న పాన్ ఇండియా చిత్రానికి 'రుధిరాక్ష' టైటిల్ ఖరారు చేశారు. శివ శంకర్ దేవ్ దర్శకత్వంలో రాజు జువ్వల నిర్మిస్తున్న ఈ డార్క్ థ్రిల్లర్ మూవీ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రామ్ తాళ్లూరి కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు–దర్శకుడు సముద్ర ఖని క్లాప్ ఇచ్చారు. దేవ్ గౌరవ దర్శకత్వం వహించారు. "త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: కిశోర్ బోయిదాపు.

సర్కారు నౌకరికి డేట్ ఫిక్స్



● ఆకాశ్, భావన

ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాశ్ హీరోగా పరిచయవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. ఈ చిత్రంలో భావన హీరోయిన్. గంగనమోని శేఖర్ దర్శకత్వంలో ఆర్కే టెలీ షో పై దర్శకుడు రాఘవేంద్ర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. "సర్కారు నౌకరి'ని కొత్త సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఘనంగా విడుదల చేయనున్నాం" అని యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: శాండిల్య, సహ నిర్మాత: పరుచూరి గోపాలకృష్ణా రావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
970	274
71,484	21,457

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,826	▲	65
డోజోన్స్	37,251	▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,577	▽	72
డాక్స్	16,765	▲	10
షాంఘై	2,943	▽	16
నికాయ్	32,971	▲	284

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,367	▽	29
బంగారం (99.5 స్వచ్ఛత)	62,117	▽	29
వెండి (కేజీ)	74,273	▲	280

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.24	106.80
€	యూరో	ఎస్‌బీఐ	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.18	22.00
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

గోల్డ్ బాండ్ @ రూ. 6,199

- ఆర్‌బీఐ నుంచి సావరిన్ బాండ్లు
- ఈ నెల 18–22 మధ్య విక్రయం
- బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా అమ్మకం



ముంబై: తదుపరి దశ సావరిన్ గోల్డ్ బాండ్ల(ఎస్‌జీబీ)కు రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజాగా ధరను ప్రకటించింది. ఒక గ్రాము బాండుకు రూ. 6,199ను నిర్ణయించింది. వీటి సబ్‌స్క్రిప్షన్ ఈ నెల సోమవారం(18న) ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగనుంది. ఎస్‌జీబీ పథకం 2023–24- సిరీస్–3లో భాగంగా ఆర్‌బీఐ ఈ నెల 18–22 మధ్య పసిడి బాండ్ల సబ్‌స్క్రిప్షన్‌కు తెరతీస్తోంది. స్మాల్, పేమెంట్, గ్రామీణ బ్యాంకులు మినహా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు వీటిని విక్రయిస్తాయి. వీటితోపాటు స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, క్లియరింగ్ కార్పొరేషన్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ ద్వారా కొనుగోలు చేయవచ్చు. పూర్తి స్వచ్ఛత(999)గల పసిడి సగటు ముగింపు ధర ఆధారంగా గ్రాముకు రూ. 6,199 ధరను నిర్ధారించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐతో చర్చల తదుపరి కేంద్ర ప్రభుత్వం గ్రాముకు రూ. 50 చొప్పున ఇన్వెస్టర్లకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేసేందుకు నిర్ణయించింది. అయితే ఇందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడంతోపాటు.. డిజిటల్ విధానంలో చెల్లింపులు చేపట్టవలసి ఉంటుంది. వెరసి గోల్డ్ బాండ్ రూ. 6,149కు లభించనున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా.. ఎస్‌జీబీ సిరీస్–4లో భాగంగా వచ్చే (2024) ఫిబ్రవరి 12–16 మధ్య బాండ్లను ఆఫర్ చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

మదర్‌సన్ చేతికి విదేశీ కంపెనీలు

డీల్ విలువ రూ. 575 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ తాజాగా రెండు విదేశీ కంపెనీలను సొంతం చేసుకోనుంది. ఆస్ట్రేలియా సంస్థ లూమెన్ గ్రూప్, స్విట్జర్లాండ్‌కు చెందిన డెల్టాకార్ప్ ఎస్‌ఏలను రూ. 575 కోట్లకు కొనుగోలు చేయనుంది. పూర్తి అనుబంధ సంస్థ సంవర్ధన మదర్‌సన్ ఆటోమోటివ్ సిస్టమ్స్ గ్రూప్ బీవీ ద్వారా ఈ సంయుక్త కొనుగోళ్లు చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు సంవర్ధన మదర్‌సన్ వెల్లడించింది. ఆస్ట్రేలియా పీటీవైసహా లూమెన్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్(ఉత్తర అమెరికా, థాయ్‌లాండ్, యూరప్, దక్షిణాఫ్రికాలో 90%), లూమెన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్, స్పెషల్ కన్వర్షన్స్ పీటీవైలతో కూడిన లూమెన్ గ్రూప్‌ను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. అయితే లూమెన్ దక్షిణాఫ్రికాను చేర్చలేదని వెల్లడించింది.

జనవరి–మార్చిలో..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో లూమెన్ గ్రూప్ కొనుగోలు పూర్తికావచ్చని అంచనా వేస్తోంది. ఆటో రంగ దిగ్గజాలు(ఓఈఎంలు) ఆమోదించిన ఆటోమోటివ్ విడిభాగాల తయారీ, డిజైన్, సరఫరాలు చేపడుతోంది. 93 మిలియన్ డాలర్ల(దాదాపు రూ. 520 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో లూమెన్ గ్రూప్‌ను సొంతం చేసుకోనుంది. 2024–27 మధ్య కాలంలో పనితీరు ఆధారంగా అదనపు చెల్లింపులకు వీలున్నట్లు సంవర్ధన మదర్‌సన్ తెలియజేసింది. మరోపక్క స్విస్ కంపెనీ డెల్టా కార్ప్ ఎస్‌ఏను 4.5 మిలియన్ డాలర్ల(రూ. 43 కోట్లు)కు కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. కొనుగోలులో భాగంగా సుమారు 1.2 మిలియన్ డాలర్ల లీజ్ లయబిలిటీలను సైతం టేకోవర్ చేయనున్నట్లు తెలియజేసింది.



ఎగుమతులు మళ్లీ మైనస్‌లోకి..

- నవంబర్‌లో 2.83 శాతం క్షీణత
- విలువలో 33.90 బిలియన్ డాలర్లు
- దిగుమతులదీ క్షీణ బాటే
- 4.33 శాతం పతనంతో 54.48 బిలియన్ డాలర్లుగా నమోదు
- వాణిజ్యలోటు 20.58 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ తీవ్ర అనిశ్చితి పరిస్థితులకు భారత్ వస్తు ఎగుమతులు అద్దం పడుతున్నాయి. అక్టోబర్‌లో 'ప్లస్'లోకి వచ్చిన ఎగుమతులు తిరిగి నవంబర్‌లో మైనస్‌లోకి జారిపోయాయి. 2022 ఇదే నెలతో పోల్చితే 2023 నవంబర్‌లో ఎగుమతుల విలువ 2.83% క్షీణించి 33.90 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇక 10 నెలల తర్వాత అక్టోబర్‌లో ఎగువబాటకు చేరిన దిగుమతులు నవంబర్‌లో మళ్లీ క్షీణతలోకి జారాయి. 4.33% పతనంతో 54.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్య లోటు 20.58 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ముందు.. వెనుకలు ఇలా...

అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం సవాళ్లు, కఠిన ద్రవ్య పరిస్థితుల నేపథ్యంలో 2023 ఫిబ్రవరి నుంచి జూలై వరకూ భారత్ వస్తు ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణతలో నడిచాయి. అయితే ఆగస్టులో వృద్ధిలోకి (3.88 శాతం) మారినా, మళ్లీ సెప్టెంబర్‌లో 2.6 శాతం క్షీణించాయి. అక్టోబర్‌లో సానుకూల ఫలితం వెలువడింది. మరుసటి నెలలోనే మళ్లీ క్షీణరేటు నమోదయ్యింది.

ఏప్రిల్–నవంబర్ మధ్య క్షీణ గణాంకాలే..

ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య భారత్ వస్తు ఎగుమతుల విలువ 6.51 శాతం క్షీణించి 278.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దిగుమతుల విలువ కూడా 8.67 శాతం క్షీణించి 445.15 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు– ఈ ఏడు నెలల్లో 166.36 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎనిమిది నెలల కాలంలో పసిడి దిగుమతులు 21 శాతం పెరిగి 32.93 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

స్మార్ట్ ఫోన్ కొంటే హెల్త్‌కేర్ ప్రయోజనాలు

21వ వార్షికోత్సవం సందర్భంగా బిగ్ 'సి' వినూత్న ఆఫర్లు


హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ చైన్ బిగ్ 'సి' తన 21వ వార్షికోత్సవం సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. 'స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.1.10 లక్షల హెల్త్ కేర్ ప్రయోజనాలు ఉచితం. ఇందులో భాగంగా ఏడాది పాటు టెలిఫోనిక్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రమాద బీమా కవరేజ్, ఔషధాలపై 20% డిస్కౌంట్, రూ.50 వేల వరకు అంబులెన్స్ సేవలు ఉచితంగా పొందొచ్చు' అని సంస్థ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. మరో ఆఫర్‌గా రూ. 75 వేల విలువైన పేటీఎం కూపన్లతో ఎంటర్‌టైన్‌మెంట్, డైనింగ్, ట్రావెలింగ్, వినియోగ వస్తువులు, వెల్‌నెస్, షాపింగ్ ప్రయోజనాలు పొందొచ్చు. మూడో ఆఫర్‌గా రూ. 21కే రూ.4,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్ వాచ్, లేదా రూ. 2,999 విలువ గల రెడ్‌మీ బడ్స్ సొంతం చేసుకోవచ్చు. బిగ్ సి షోరూంల్లో స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేసే కస్టమర్లు ఈ మూడింటిలో ఏదో ఒకటి ఎంచుకునే సౌలభ్యం కల్పిస్తున్నట్లు బాలు చౌదరి వెల్లడించారు.



71,000 శిఖరంపై సెన్సెక్స్

- 21,450 స్థాయి పైకి నిఫ్టీ
- రెండో రోజూ బుల్ రికార్డుల్

ముంబై: ఐటీ, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన షేర్లు రాణించడంతో సెన్సెక్స్ చరిత్రలో తొలిసారి 71,000 పాయింట్ల ఎగువన ముగిసింది. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో శుక్రవారం సెన్సెక్స్, నిఫ్టీలు తాజా గరిష్టాలు నమోదు చేశాయి. వచ్చే ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాల ప్రభావం భారత్‌తో సహా అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లపై కొనసాగింది. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, ఎఫ్‌ఐఐల వరుస కొనుగోళ్లు అంశాలు కలిసొచ్చాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. సెన్సెక్స్ 70,804 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 1,092 పాయింట్లు ఎగసి 71,484 వద్ద కొత్త జీవితకాల గరిష్టం తాకింది. చివరికి 970 పాయింట్లు లాభపడి 71,484 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 310 పాయింట్లు బలపడి 21,492 వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఆఖరికి 274 పాయింట్లు లాభపడి 21,457 వద్ద నిలిచింది. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, రియల్టీ, సేవా రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.



- సూచీల రికార్డుల ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీ మొత్తం మార్కెట్ విలువ గత ట్రేడింగ్ సెషన్లలో రూ.8.11 లక్షల కోట్లు పెరిగి రూ.357.87 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఐదు మాత్రమే నష్టపోయాయి. ఇక వారం మొత్తంగా సెన్సెక్స్ 1,658 పాయింట్లు, నిఫ్టీ 487 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఇరు సూచీలకిది వరుసగా ఏడో వారం లాభాల ముగింపు.
- పెన్సిళ్ల తయారీ సంస్థ డోమ్స్ ఇండస్ట్రీస్ ఐపీఓకు చివరిరోజు నాటికి 93.40 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 88.37 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 82.54 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హత గల సంస్థాగత ఇన్వెస్టర్ల విభాగం 115.97 రెట్లు, రిటైల్ కోటా 69.10 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 66.47 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 27 పైసలు బలపడి 83.03 వద్ద స్థిరపడింది. దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వెల్లువెత్తడం, స్టాక్ సూచీల కొత్త శిఖరాలకు చేరుకోవడం రూపాయి ర్యాలీకి కారణమయ్యాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.
- ఫెడ్ వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపు, ద్రవ్యోల్బణం దిగివచ్చేందుకు చర్యలు తీసుకోవడంతో ఐటీ షేర్లు రెండో రోజూ లాభపడ్డాయి. ఇన్ఫీబీమ్ 12%, జెన్సార్ టెక్ 11%, మెస్టెక్ 6.50%, హెచ్‌సీఎల్ టెక్ 6%, పర్‌సిస్టెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 5%, కో ఫోర్జ్, సైయంట్ 4%, టెక్ మహీంద్రా 3 చొప్పున లాభపడ్డాయి.
- బ్యాంకింగ్ షేర్లలో ర్యాలీ భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు ఒకటిన్నర శాతం లాభపడి రూ.91.24 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.ఒక లక్షల కోట్లను అధిగమించింది.

ఘనంగా వాల్యూ జోన్ హైపర్ మార్ట్ ప్రారంభం

హైదరాబాద్: భాగ్యనగరంలోని పటాన్‌చేరులో అతి పెద్ద అవుట్‌లెట్ ''వాల్యూ జోన్ హైపర్ మార్ట్'' శుక్రవారం ప్రారంభమైంది. సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. మీకు నచ్చిన, మీరు మెచ్చిన ప్రతి వస్తువుకూ కేరాఫ్ అడ్రస్... వాల్యూ జోన్ హైపర్ మార్ట్ అని ఆయన అన్నారు. ''కస్టమర్ల భిన్న అభిరుచులు, అవసరాలు దృష్టి ఉంచుకొని నాణ్యమైన వస్తువులను, అతి తక్కువ ధరల్లో ఒకే చోట అందుబాటులో ఉంచుతున్నాము. రిటైల్ వాణిజ్య వ్యవస్థలోనే ఇదో వినూత్న విప్లవం'' అని డైరెక్టర్ సురేశ్ సీర్ల తెలిపారు.



జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గివింగ్' ప్రచారం

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ సంస్థ జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గివింగ్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. నెల రోజుల ఈ ప్రచారంలో భాగంగా బంగారం, డైమండ్ జ్యువెలరీ మజూరీ చార్జీలపై 25% తగ్గింపు ఇస్తున్నట్లు గ్రూప్ చైర్మన్ ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో జనవరి 15 వరకు 'సీజన్ ఆఫ్ గివింగ్' ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. పండుగ డిస్కౌంట్‌కు అదనంగా కొనుగోలు చేసిన జ్యువెలరీపై ఏడాది ఉచిత బీమా గ్యారంటీ, జీవిత కాల ఉచిత నిర్వహణ, బైబ్యాక్ గ్యారంటీని అందిస్తుంది.

సాక్షి స్పోర్ట్స్



వేలంలో మెస్సీ 6 జెర్సీలకు రూ. 65 కోట్లు!

ఫుట్‌బాల్ దిగ్గజం లయోనల్ మెస్సీ ప్రపంచకప్ మ్యాచ్‌లలో ధరించిన జెర్సీలకు వేలంలో అత్యద్భుత స్పందన లభించింది. 2022లో ఖతర్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో మెస్సీ అర్జెంటీనా జట్టును విజేతగా నిలిపాడు. ఈ టోర్నీలో అతను ధరించిన 6 జెర్సీలను న్యూయార్క్‌లో ఆన్‌లైన్‌లో వేలం వేశారు. వీటిని మొత్తం 78 లక్షల డాలర్లకు (సుమారు రూ. 65 కోట్లు) ఒక అజ్ఞాత అభిమాని సొంతం చేసుకోవడం విశేషం. అతని వివరాలను బయటకు వెల్లడించలేదు. క్రీడల్లో జ్ఞాపికల వేలానికి సంబంధించి ఇటీవలి కాలంలో ఇది రికార్డు మొత్తం కావడం గమనార్హం. ఫైనల్ మ్యాచ్‌లో 3–3తో స్కోరు సమమైన తర్వాత పెనాల్టీ షూటౌట్‌లో గెలిచి అర్జెంటీనా విశ్వవిజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ 2 గోల్స్ చేశాడు. వేలం ద్వారా దక్కిన మొత్తంలో కొంత భాగాన్ని మెస్సీ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న చిన్న పిల్లల ఆస్పత్రికి విరాళంగా అందజేస్తారు.

ధోని జెర్సీ నంబర్ '7'కు రిటైర్మెంట్: బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, రెండు ప్రపంచకప్‌లను గెలిపించిన సారథి మహేంద్ర సింగ్ ధోనిపై బీసీసీఐ సముచిత గౌరవం ప్రదర్శించింది. అతను మైదానంలో ధరించిన '7' నంబర్ జెర్సీకి కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. దిగ్గజ క్రికెటర్‌గా భారత క్రికెట్‌కు ధోని చేసిన సేవలకు గుర్తిస్తూ తాము ఈ నిర్ణయం తీసుకున్నామని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించే ఏ ఆటగాడు కూడా తమ జెర్సీపై '7' నంబర్ వాడేందుకు బోర్డు అనుమతించదు. గతంలో ఆల్‌టైమ్ గ్రేట్ సచిన్ టెండూల్కర్ గౌరవార్థం కూడా అతను ధరించిన '10' నంబర్‌కు కూడా బీసీసీఐ అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించింది. సచిన్ తప్పుకున్న తర్వాత ఒకే ఒకసారి ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ '10' నంబర్ జెర్సీని వేసుకోగా అభిమానుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. దాంతో అతను తన నంబర్‌ను మార్చుకోవాల్సి వచ్చింది. జెర్సీ నంబర్లకు రిటైర్మెంట్ ప్రకటించడం ఇతర క్రీడల్లో చాలా కాలంగా ఉంది. బాస్కెట్‌బాల్ దిగ్గజం మైకేల్ జోర్డాన్ వేసుకున్న '23' నంబర్‌ను కూడా అతని కెరీర్ తర్వాత చికాగో బుల్స్ టీమ్ రిటైర్మెంట్ ఇచ్చింది.

ఆస్ట్రేలియా 487 ఆలౌట్

పెర్త్: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 113.2 ఓవర్లలో 487 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 346/5తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 141 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (90; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీని చేజార్చుకున్నాడు. తొలి టెస్టు ఆడుతున్న పాక్ బౌలర్ ఆమెర్ జమాల్ 111 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (42; 6 ఫోర్లు), కెప్టెన్ షాన్ మసూద్ (30; 5 ఫోర్లు) అవుటయ్యారు.



రోహిత్ అవుట్

కెప్టెన్సీ నుంచి తప్పించిన ముంబై ఇండియన్స్

- కొత్త సారథిగా హార్దిక్ పాండ్యా
- 2024 సీజన్ నుంచే బాధ్యతలు

ముంబై: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన, ఆకర్షణీయమైన ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్‌లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 2024 సీజన్ ఆరంభానికి చాలా ముందే ఆ జట్టులో సారథ్య మార్పు జరిగింది. 11 సీజన్ల పాటు టీమ్‌కు అద్భుత విజయాలు అందించి ముంబై ఇండియన్స్ ముఖచిత్రంగా మారిన కెప్టెన్ రోహిత్ శర్మను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు టీమ్ యాజమాన్యం ప్రకటించింది. రోహిత్ స్థానంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను జట్టు కెప్టెన్‌గా నియమించింది. గత నెల 26న గుజరాత్ టైటాన్స్ టీమ్ నుంచి హార్దిక్‌ను ముంబై తీసుకున్నప్పటి నుంచే భవిష్యత్తులో అతనికి కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉందని వినిపించింది. అయితే అది ఇంత తొందరగా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఈ సీజన్ వరకు రోహిత్ నాయకత్వంలో ఆడి వచ్చే ఏడాది నుంచి అతను పగ్గాలు చేపట్టవచ్చని భావించగా... ముంబై ఇండియన్స్ యాజమాన్యం మాత్రం వేగంగా నిర్ణయం తీసుకుంది. ఐదుసార్లు ముంబైని ఐపీఎల్‌లో విజేతగా నిలిపిన సారథి రోహిత్ ఇప్పుడు 'మాజీ'గా మారిపోయాడు. మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి **గతంలోనే** బెంగళూరు కెప్టెన్సీ నుంచి తప్పుకోగా, **2008** నుంచి చెన్నైకి సారథిగా ఉన్న ధోని ఇంకా **కెప్టెన్‌గా** కొనసాగుతున్నాడు.

అందుకే మార్పు...

2024 సీజన్ నుంచే హార్దిక్‌కు కెప్టెన్సీ **అప్పగిం**చాలని తాము భావించినట్లు ముంబై ఇండి**యన్స్** గ్లోబల్ హెడ్ ఆఫ్ పర్ఫార్మెన్స్ మహేలా జయ**వర్ధనే** అన్నాడు. 'ఎప్పుడైనా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ముంబై ఇండియన్స్ నిర్ణయాలు తీసుకుంటుంది. ఇది కూడా అందులో భాగమే. రోహిత్‌తో పాటు గతంలోనూ సచిన్, హర్భజన్, పాంటింగ్ కెప్టెన్లుగా జట్టును సమర్థంగా నడిపించడంతో పాటు ముందు చూపుతోనూ వ్యవహరించారు. వచ్చే సీజన్ నుంచే హార్దిక్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతాడు. రోహిత్ నాయకత్వంలో ముంబై టీమ్ అత్యుత్తమ ఫలితాలు సాధించింది. అతని నాయకత్వ పటిమకు మా అభినందనలు. ఐపీఎల్‌లో అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా రోహిత్ అనుభవం మైదానంలోనూ, మైదానం బయటా జట్టుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం' అని అతను చెప్పాడు. 2015–2021 మధ్య ముంబైతో ఉన్న హార్దిక్ పాండ్యా 92 మ్యాచ్‌లు ఆడి నాలుగు టైటిల్స్ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. గత రెండు సీజన్లలో గుజరాత్‌ను ఫైనల్‌కు చేర్చిన అతను ఒకసారి ట్రోఫీ అందించాడు.

ఐదు ఐపీఎల్ ట్రోఫీలు...

ఐపీఎల్‌లో ముంబై కెప్టెన్‌గా రోహిత్ ముద్ర అసామాన్యం. 2013 సీజన్‌లో తొలి ఆరు మ్యాచ్‌లలో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రికీ పాంటింగ్ అనూహ్యంగా ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దాంతో ఏడో మ్యాచ్ నుంచి సారథిగా వ్యవహరించిన రోహిత్ ఆ ఏడాది జట్టును విజేతగా నిలిపాడు. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో కూడా ముంబై ఐపీఎల్ గెలుచుకుంది. 2013 చాంపియన్స్ ట్రోఫీ కూడా రోహిత్ నాయకత్వంలోనే వచ్చింది. రోహిత్ సారథ్యంలో జట్టు మొత్తం 158 మ్యాచ్‌లు ఆడగా... అందులో 87 విజయాలు, 67 పరాజయాలు ఉన్నాయి. 4 మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. అయితే 2021, 2022 సీజన్లలో 'ప్లే ఆఫ్స్'కు చేరడంలో ముంబై విఫలం కాగా... 2023లో రెండో క్వాలిఫయర్‌లో ఓడి మూడో స్థానంతో ముగించింది.



హార్దిక్‌కు హామీతోనే...

రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడంపై ఎలాంటి స్పష్టమైన కారణం బయటకు కనిపించడం లేదు. ఇప్పటికీ మంచి ఫామ్‌తో భారత జట్టు కెప్టెన్‌గా కూడా కొనసాగుతున్న రోహిత్‌ను పక్కన పెట్టడం అంటే అంతర్గతంగా ఏదైనా జరిగి ఉండాలి. గత మూడు సీజన్లలో జట్టు ప్రదర్శన గొప్పగా లేకపోయినా సరే... మార్కెటింగ్ పరంగా కూడా రోహిత్ విలువేమీ తగ్గలేదు. లేదంటే రోహిత్ తానే స్వయంగా సారథిగా ఇక చాలు, ఈ సీజన్‌లో ఆటగాడిగా మాత్రమే కొనసాగాలని భావిస్తున్నట్లు చెప్పి ఉండవచ్చు. అయితే భారీ మొత్తం చెల్లించి గుజరాత్ నుంచి హార్దిక్‌కు ఎలాగైనా తీసుకునేందుకు ముంబై ఇండియన్స్ చేసిన ప్రయత్నం చూస్తేనే జట్టు ప్రణాళిక ఏమిటో అర్థమవుతుంది. పాండ్యా కూడా కెప్టెన్సీ హామీ మేరకే ముంబైకి తిరిగి వచ్చినట్లు సమాచారం. గత రెండు సీజన్లలో టైటాన్స్‌కు సారథ్యం వహించినా... ముంబై కెప్టెన్సీపై అతను మక్కువ పెంచుకున్నాడు. తాజా పరిణామాలతో రోహిత్ భారత టి20 జట్టు కెప్టెన్సీ కూడా సందేహంలోనే పడింది. రోహిత్ లేని సమయంలో భారత్ ఆడిన గత 25 టి20ల్లో 13 మ్యాచ్‌లలో నాయకత్వం వహించిన హార్దిక్ పాండ్యానే వచ్చే టి20 వరల్డ్ కప్‌లోనూ కెప్టెన్ అయ్యే అవకాశాలు మరింత మెరుగ్గా కనిపిస్తున్నాయి. బ్యాటర్‌గా మాత్రమే రోహిత్ టి20ల్లో కొనసాగుతాడా అనేది కూడా చెప్పలేం. ఎందుకంటే 2020 టి20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఓటమి తర్వాత రోహిత్ ఒక్క అంతర్జాతీయ టి20 మ్యాచ్ కూడా ఆడలేదు.

దీప్తి ధమాకా



దీప్తి

7 పరుగులిచ్చి 5 వికెట్లు

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 136 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 186/6
- గెలుపు దిశగా హర్మన్‌ప్రీత్ బృందం

ముంబై: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు విజయంపై కన్నేసింది. భారత బౌలర్ల జోరుతో రెండో రోజే మ్యాచ్‌పై జట్టు పూర్తిగా పట్టు బిగించింది. స్పిన్నర్ల హవా సాగిన శుక్రవారం రెండు జట్లలో కలిపి 19 వికెట్లు నేలకూలగా... అందులో 15 వికెట్లు స్పిన్నర్లే పడగొట్టారు. భారత ఆఫ్‌స్పిన్నర్ దీప్తి శర్మ (5/7) కేవలం 7 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీప్తి ధాటికి ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 35.3 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. నాట్ సివర్ బ్రంట్ (70 బంతుల్లో 59; 10 ఫోర్లు) మాత్రమే పోరాడి అర్ధ సెంచరీ సాధించగా, ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. మరో ఆఫ్ స్పిన్నర్ స్నేహ రాణాకు 2 వికెట్లు దక్కాయి. ఫలితంగా భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 292 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అయితే ఇంగ్లండ్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా భారత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభం నుంచే బ్యాటర్లంతా దూకుడుగా ఆడటంతో జట్టు ఆధిక్యం మరింత పెరిగింది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (67 బంతుల్లో 44 నాటౌట్; 5 ఫోర్లు) రాణించగా... షఫాలీ వర్మ (33), జెమీమా (27), స్మృతి మంధాన (26) కీలక పరుగులు సాధించారు. ఇంగ్లండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్లు చార్లీ డీన్ 4, ఎకెల్‌స్టోన్ 2 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ టాప్ స్కోరర్‌గా నిలిచిన శుభ సతీశ్ ఎడమ చేతికి ఫ్రాక్చర్ కావడంతో బ్యాటింగ్‌కు దిగలేదు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 410/7తో శుక్రవారం ఉదయం ఆట కొనసాగించిన భారత్ మరో 18 పరుగులు జోడించి 428 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం ఏకంగా 478 పరుగుల ఓవరాల్ ఆధిక్యంతో భారత్ ఇప్పటికే అసాధ్యమైన లక్ష్యం విధించే దిశగా సాగుతోంది. మ్యాచ్‌లో మరో రెండు రోజులు మిగిలి ఉన్న నేపథ్యంలో ఇంగ్లండ్ ఓటమి నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యమే.

భారత్, పాక్ జట్లకు షాక్

దుబాయ్: ఆసియా కప్ అండర్–19 క్రికెట్ టోర్నీలో ఫేవరెట్స్ భారత్, పాకిస్తాన్ జట్ల కథ సెమీఫైనల్లోనే ముగిసింది. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్ నాలుగు వికెట్ల తేడాతో భారత్‌పై, యూఏఈ 11 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై సంచలన విజయాలు సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో ముందుగా భారత్ 42.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. ముషీర్ ఖాన్ (50; 3 ఫోర్లు), హైదరాబాద్ క్రికెటర్ అభిషేక్ మురుగన్ (62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం బంగ్లాదేశ్ 42.5 ఓవర్లలో 6 వికెట్లకు 189 పరుగులు చేసి గెలిచింది. మరోవైపు యూఏఈ నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాక్ 182 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.



క్లుప్తంగా...

వరాహావతారంలో భద్రాద్రి రామయ్య



భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా రామయ్య శుక్రవారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. అధ్యయనోత్సవాలు మూడో రోజుకు చేరగా, ఉదయం బేడా మండపంలో స్వామివారికి వేద పండితులు దివ్య ప్రబంధం పఠించారు. అనంతరం వరాహావతారంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారికి పల్లకీసేవ నిర్వహిస్తూ మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియం వేదికపై కొలువు దీర్చారు. భక్తుల దర్శనానంతరం స్వామి వారికి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు.

రేపట్నుంచి యాదాద్రిలో ధనుర్మాస ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ ఉత్సవంలో భాగంగా ప్రతిరోజూ వేకువజామున 4.30 నుంచి ఉదయం 5.15 గంటల వరకు ఆలయ ముఖమండపంపైన ఉత్తర భాగంలో ఉన్న హాల్‌లో అమ్మవారిని వేంచేపు చేసి తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. వచ్చేనెల 14వ తేదీ రాత్రి 7 గంటలకు గోదాకల్యాణం, 15వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం జరిపిస్తామని తెలిపారు.

19న తిరుమలలో బ్రేక్ దర్శనాలు రద్దు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా ఈ నెల 18న సిఫార్సు లేఖలు స్వీకరించడంలేదని స్పష్టం చేసింది.

'టీఎస్‌పీఎస్సీ'పై హైకోర్టు జడ్జితో.. న్యాయ విచారణ!

ఆ దిశగా ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే కొనసాగుతున్న సిట్ దర్యాప్తు
- గవర్నర్‌కు రాజీనామా పత్రాలు పంపించిన ఐదుగురు సభ్యులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణస్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)లో ప్రశ్నపత్రాల లీకేజీ కోణంలోనే కాకుండా ప్రతి విభాగంలో నెలకొన్న లోపాలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయనున్నారు. విచారణకు ప్రత్యేకంగా సిట్టింగ్ జడ్జిని నియమించాలని ఆ లేఖలో కోరనున్నట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై గత ప్రభుత్వం సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) ఏర్పాటు చేయగా, ఆ దర్యాప్తు కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక టీఎస్‌పీఎస్సీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. మరోవైపు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవికి బి.జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయగా, సభ్యులుగా కొనసాగిన ఐదుగురు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సభ్యులంతా గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు రాజీనామా పత్రాలు పంపించారు. గవర్నర్‌ను అపాయింట్‌మెంట్ కోరినా, ఆమె సమయం ఇవ్వకపోవడంతో రాజీనామాలు పంపించినట్టు ఓ సభ్యుడు తెలిపారు. దీంతో కమిషన్‌లో చైర్మన్‌తో సహా సభ్యుల స్థానాలు ఖాళీ అయ్యాయి.

ఇతర విభాగాల పనితీరు, లోపాలపై దృష్టి

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలోని 'కోరం' వివిధ ప్రభుత్వ శాఖల్లో దాదాపు 30 వేలకు పైబడి ఉద్యోగాల భర్తీకి 23 నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో 19 నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షలు పూర్తి కాగా, గ్రూప్–2, గ్రూప్–3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. గ్రూప్–1 ప్రిలిమినరీ పూర్తి చేసిన కమిషన్ మెయిన్ పరీక్షలు చేపట్టాల్సి ఉంది. ఇవి కాకుండా వివిధ ప్రభుత్వ కాలేజీల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో నాలుగు పరీక్షలను రద్దు చేసి రెండుసార్లు నిర్వహించారు. మరికొన్నింటిని వాయిదాలు వేస్తూ పూర్తి చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీయే ఇందుకు కారణం. అయితే టీఎస్‌పీఎస్సీలోని ఇతర విభాగాల్లో పనితీరు, లోపాలు గుర్తించాలని రాష్ట్రం ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి విభాగంలో అధికారులు, ఉద్యోగుల పనితీరు, విధి నిర్వహణ, సమాచార వ్యవస్థ, గోప్యత తదితరాలను లోతుగా పరిశీలించనుంది. ప్రశ్నపత్రాల లీకేజీతో ఇతర విభాగాల అలసత్వం, అధికారుల ఉదాసీనతపై సమగ్రంగా విచారించనున్నారు. అక్రమాలకు పాల్పడిన, విధినిర్వహణలో అలసత్వం వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సీఎం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ దిశగా హైకోర్టు సిట్టింగ్ జడ్జిని నియమించాలని సీజేకు లేఖ రాయనున్నారు.

కొత్త కమిషన్ కొలువుదీరేలోపు...

టీఎస్‌పీఎస్సీలో పదవులన్నీ ఖాళీ అయ్యాయి. సాధారణంగా కమిషన్‌లో సభ్యుల నిర్ణయం తప్పనిసరి. కనీసం ఇద్దరు సభ్యులున్నా అందులో సీనియర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎవరూ లేకపోవడంతో ఏ నిర్ణయమూ తీసుకునే అవకాశం లేదు. కొత్త కమిషన్ కొలువుదీరేలోపు విచారణ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విచారణకు ముందుగానే కొత్త కమిషన్ ఏర్పాటైతే తాజాగా చేపట్టదలచిన సమగ్ర విచారణకు ఆటంకాలు ఎదురవుతాయని, కొత్త కమిషన్‌కు నిర్ణయాధికారంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ దర్యాప్తు వేగవంతం చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీఎస్‌పీఎస్సీ, సిట్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు. వీలైనంత వేగంగా విచారణ చేపడితే ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు అడుగులు పడతాయన్న ఆశలో నిరుద్యోగులు ఉన్నారు.

'డీప్'గా పసిగట్టి.. 'ఫేక్' పనిపట్టండి



పలు సూచనలు చేసిన కేంద్ర హోంశాఖ

సాక్షి, హైదరాబాద్: డీప్‌ఫేక్‌పై కేంద్రం కొరడా ఝుళిపించింది. ఆన్‌లైన్‌లో ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలతో మోసాలకు పాల్పడటం, వ్యక్తిగత ప్రతిష్టను దిగజారుస్తుండటంతో ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో డీప్‌ఫేక్ కట్టడికి కఠిన నిబంధనలు విధిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే, డీప్‌ఫేక్‌తో మోసాలకు గురికాకుండా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయకుండా ఉండేందుకు కొన్ని సూత్రాలు పాటించాలని కేంద్ర హోంశాఖ కీలక సూచనలు చేసింది. వీటిని పరిశీలించకుండా వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. వాటిల్లో కొన్ని సూచనలు కింది విధంగా ఉన్నాయి.

- ఫొటోలు, వీడియోలలో ఉన్న లైటింగ్, నీడలను నిశితంగా పరిశీలించాలి. అందులో ఏవైనా తేడాలు గమనిస్తే అది ఫేక్ అని ప్రాథమిక అంచనాకు రావొచ్చు.
- అసహజ ముఖకవళికలు ఉన్నట్టు గమనిస్తే దానిని డీప్‌ఫేక్‌తో తయారు చేసిన వీడియోగా భావించవచ్చు.
- ఆడియోలలో అసమానతలు, ఆడియో అస్పష్టంగా ఉన్నాయా అన్నది పరిశీలించాలి.
- ఫొటోలు, వీడియోల బ్యాక్‌గ్రౌండ్‌లో అసమానతలు, ఏవైనా వస్తువులు సాధారణానికి భిన్నంగా ఉన్నట్టు గమనించినా అది డీప్‌ఫేక్ అయి ఉండొచ్చు.
- ఫొటోల్లో, వీడియోల్లో వ్యక్తులు నిలబడిన, నడుస్తున్న ప్లాట్‌ఫారమ్‌లు అసాధారణంగా ఉన్నాయా? కదలికలు నిశితంగా పరిశీలిస్తే ఏవైనా అనుమానాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలి.
- డీప్‌ఫేక్ డిటెక్షన్ టూల్స్ వాడి కూడా అవి నిజమైనవా..లేదా? గుర్తించవచ్చు.

కోహిర్ @8.9

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

సాక్షి,నెట్‌వర్క్/హైదరాబాద్: రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. రాత్రివేళనేకాదు...పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత 8.9 డిగ్రీలుగా నమోదైంది. ఆ తర్వాతి స్థానంలో మేడ్చల్ జిల్లా చౌదరిగూడెంలో 9.4 డిగ్రీలు, కుమ్రంభీం జిల్లా సిర్పూరు(యు)లో 9.7 డిగ్రీలు నమోదు కావటంతో వాతావరణశాఖ అలర్ట్ నోటీస్ జారీ చేసింది.

ఆయా జిల్లాల వారీగా చూస్తే...

రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల సాధారణం కంటే 2 డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే..గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 30.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 12.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఆదిలాబాద్, నల్లగొండ, హైదరాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.8 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల పాటు ఇదే తరహాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



మంథని-పెద్దపల్లి రహదారిపై శుక్రవారం కమ్ముకున్న పొగమంచు
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	12.0
భద్రాచలం	18.0
హకీంపేట్	15.2
దుండిగల్	14.3
హనుమకొండ	15.0
హైదరాబాద్	14.7
ఖమ్మం	17.4
మహబూబ్‌నగర్	17.2
మెదక్	12.8
నల్లగొండ	16.2
నిజామాబాద్	16.0
రామగుండం	14.5

నేడు బీఎల్‌డబ్ల్యూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

జిల్లా కేంద్రాల్లో బంగ్లాదేశ్ లిబరేషన్ వార్ 1971 సినిమా ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో భారత దేశం విజయం సాధించిన సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా బంగ్లాదేశ్ లిబరేషన్ వార్ (బీఎల్‌డబ్ల్యూ) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ శ్రేణులను కోరారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ధీరత్వంతో సాధించిన ఈ విజయానికి చిహ్నంగా ఉత్సవాలు నిర్వహించాలన్న ఏఐసీసీ సూచన మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో బంగ్లాదేశ్ లిబరేషన్ వార్–1971 సినిమాను ప్రదర్శించాలని సూచించారు. సినిమాను పార్టీ నేతలు, వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఒక ప్రకటనలో కోరారు. గాంధీభవన్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ సినిమా ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

తాత్కాలికంగా పలు రైళ్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: వివిధ మార్గాల్లో నడిచే పలు రైళ్లను సాంకేతిక కారణాల దృష్ట్యా తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్–జైపూర్ (127201/12719) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27, 29, జనవరి 1, 3, 5 తేదీల్లో రద్దు కానుంది. హైదరాబాద్–హిస్సార్ (17020/17019) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30, జనవరి 2 తేదీల్లో రద్దు కానుంది.

మూత్రపిండాలు బయట ఉన్న శిశువు జననం



ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఓ శిశువు జన్యులోపంతో జన్మించింది. మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఓ మహిళ రెండోకాన్పులో మూత్రపిండాలు బయటే ఉన్న ఆడశిశువుకు జన్మనిచ్చినట్లు వైద్యాధికారి డాక్టర్ సాగర్ తెలిపారు. పది వేలమందిలో ఒక్కరు ఇలా జన్మిస్తారని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం శిశువును హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.